# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం, 22 జనవరి 2025 సంపుటి: 9 సంచిక: 28 పేజీలు: 12 వెల రూ.5


HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


**చిలుకూరు బాలాజీ టెంపుల్లో ప్రియాంక చోప్రా**



2

**కుంభమేళాలో ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ స్క్రీనింగ్**



వాల్మీకి రామాయణం ఆధారంగా ఇండో- జపాన్ సంయుక్త భాగస్వామ్యంతో రూపొందించిన యానిమేషన్ చిత్రం ''రామాయణ : ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ'' ప్రదర్శనను మహాకుంభమేళాలో నిర్వహిస్తున్నట్టు ఎక్సెల్ ఎంటర్టైన్మెంట్ ప్రకటించింది.




దావోస్‌లో తెలంగాణ రైజింగ్ టీం ఫస్ట్ సిగ్నేచర్..

# యూనీలివర్‌తో ఒప్పందం

**కామారెడ్డిలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటు**

- బాటిల్ క్యాప్‌ల తయారీ కేంద్రం కూడా..
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ 21, (మనం న్యూస్):** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రతినిధుల బృందం బిజీబిజీగా గడుపుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులను సాధించేందుకు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను కలుస్తోంది. ఇందులో భాగంగానే రేవంత్ నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి వరల్డ్ ఎకనమిక్ ఫోరం రెండో రోజున వరుసగా వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. బృందం దావోస్ పర్యటనలో మంగళవారం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో అంతర్జాతీయ కంపెనీ అయిన యూనిలీవర్ సీఈవో హీన్ హూమేకర్, చీఫ్ సప్లయి ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, అధికారుల బృందం సమావేశమయ్యారు. ఈ మేరకు ఆ కంపెనీతో జరిపిన చర్యలు విజయవంతమయ్యాయి. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల గురించి యూనిలివర్ కంపెనీ సభ్యులకు తెలంగాణ ప్రతినిధుల బృందం క్షుణ్ణంగా వివరించింది. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, కంపెనీలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాలను వివరించింది. దీంతో తెలంగాణలో ఇన్వెస్ట్ చేసేందుకు ...మిగతా 2లో




## తెలంగాణ పెవిలియన్

ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్‌లో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ టీం అక్కడ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై వారితో చర్చించింది. మరోవైపు దావోస్‌లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీలు కొనసాగుతున్నాయి.

ట్రంపు యాక్షన్.. రియాక్షన్..

# అమెరికాలో ట్రంప్ మార్కు పరిపాలన మొదలు

మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్.. నినాదంతో ఎన్నికల్లో గెలిచి అమెరికా దేశానికి 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన డొనాల్డ్ ట్రంప్. పదవీబాధ్యతలు చేపట్టిన క్షణం నుంచే తన (స్వదేశీ) 'ఎజెండా' అమలును మొదలుపెట్టాడు. దీని వల్ల ఆ దేశంలో నివసిస్తున్న వివిధ దేశాలకు చెందిన ప్రజల్లో ఆందోళనలు మొదలైనాయి. మొదటి రోజే ఆయన తీసుకున్న ఎగ్జిక్యూటివ్ నిర్ణయాల్లోని కొన్ని అంశాలు.. అమెరికా సంయుక్త రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న మెక్సికో నుంచి మన పక్క నున్న చైనా దాకా.. పలు ప్రపంచ దేశాల్లోనూ భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఆ దేశంలో అడవులను నాశనం చేస్తున్న కార్చిచ్చు లాగా ట్రంప్ నిర్ణయాలు కూడా ప్రపంచమంతా రాజకీయ కార్చిచ్చు రగిలిస్తాయనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అందుకే, కొందరు 'ట్రంప్ ఈజ్ బ్యాక్ విత్ ద రివెంజ్' అంటున్నారు. ఇటువంటి వైఖరి వల్ల ఆయన రెండో టర్మ్ ముగిసే నాటికి ప్రపంచ పరిస్థితి ఎలా ఉంటుందో? అన్న మాటలూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన తొలి రోజు 'పౌరసత్వ కల్పన'పై చేసిన నిర్ణయంపై భారత్‌లో సందేహాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముందు ముందు ఇంకా ఏం జరుగనున్నదో అన్న ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి. ఇప్పుడు ట్రంప్ తీసుకున్న పౌరసత్వ నిర్ణయం భారతీయులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో స్థూలంగా తెలుసుకుందాం..



**వందేళ్ల విధానాన్ని ఒక్క సంతకంతో ఖతం చేసిన ట్రంప్** 2

## రిపబ్లిక్ డే చీఫ్ గెస్ట్‌గా ప్రభోవో

భారత 76వ గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రభోవో సుబియాంతో హాజరువుతున్నారు. ఇండియా కీలక విధానమైన 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'లో కీలక భాగస్వామిగా ఇండోనేషియా ఉన్న విషయం విదితమే.



కొత్త పథకాల లబ్ధిదారుల ఎంపికలో వేగం

# రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న గ్రామసభలు

**ఆరు గ్యారెంటీలపై ప్రశ్నిస్తున్న ప్రజలు**

**హైదరాబాద్, జనవరి 21 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న కొత్త పథకాల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సభలను నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో అధికారుల సర్వేలు నిర్వహించి పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక ...మిగతా 2లో



**మహిపాల్ రెడ్డికి నిరసన సెగ** 2

సీనియర్ల సనుగుళ్లు.. కార్యకర్తల గులుగుళ్లు

# బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో సిత్రాలు

**పార్టీ నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు**

**అభిప్రాయ సేకరణ లేకుండానే మండల, జిల్లా అధ్యక్షుల ఎంపిక**

**హైదరాబాద్ 21, (మనం న్యూస్):** బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో కొందరు నేతలు పార్టీ నియమాలకు తిలోదకాలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభిప్రాయ సేకరణలు జరపకుండానే మండల, మున్సిపాలిటీతో పాటు జిల్లా అధ్యక్షుడిని సైతం తమకు సన్నిహితులకు కట్టబెడుతున్నారని క్షేత్రస్థాయి కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీజేపీలో బూత్ అధ్యక్షులు ...మిగతా 2లో



**సెకండ్ సిమ్@ రూ.20/మంత్**

15 రోజుల గ్రేస్ పీరియడ్ కూడా..

2

మరో భీకర ఎన్‌కౌంటర్

# 27గురు మావోయిస్టుల మృతి

- మృతుల్లో 8 మంది మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు
- ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతాల్లో పారుతున్న రక్తపుటేరులు
- ఇంకా కొనసాగుతున్న ఎదురు కాల్పులు?



**చర్ల, జనవరి 21 (మనం న్యూస్):** ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి రక్తపుటేరులు పారుతున్నాయి. భద్రతా బలగాలు మావోయిస్టుల నడుమ మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్ లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతులలో ఎనిమిది మంది మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులున్నారు. గరియాబంద్, నౌపాడ జిల్లాలో ఈ ఎదురుకాల్పుల ఘటన జరిగింది. ఛత్తీస్‌గఢ్ - ఒడిషా బోర్డర్ మెయిన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుల్హాదీ ఘాట్ బాలు డిగ్గి అడవులలో మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో కోబ్రా భద్రతా దళాలు ఆదివారం నుండే కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మావోయిస్టులు తారస పడటంతో ఇరు వర్గాల నడుమ హోరాహోరీగా కాల్పులు మొదలైనాయి. మొదటి రోజే ఇద్దరు మావోయిస్టులు మరణించారు. అక్కడ నుండి తప్పించుకున్న మావోయిస్టులను వెంటాడిన భద్రతా బలగాలు మంగళవారం మరో 25 మంది వరకూ మట్టుబెట్టినట్టు సమాచారమందుతున్నది. మృతుల్లో కోటి రూపాయల ...మిగతా 2లో

వేగంగా పారిశ్రామికీకరణ..

# ఆర్థికాభివృద్ధిలో మైనింగ్ కీలకం

**2030 నాటికి 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి**

సరైన సమయంలో గనుల తవ్వకాలపై దృష్టి సారిస్తం

బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ జాతీయ సదస్సులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2





'సింధు నదీ జలాల' ఒప్పందంపై తటస్థ నిపుణుడికి

**భారత్ ఓకే**

ఒప్పందం ప్రకారమే నడచుకోవాలి

2

# రియల్ బ్రోకర్ చెంప ఛెళ్లు

## దళారిపై చేయిచేసుకున్న ఈటల

చిరుద్యోగుల భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల దౌర్జన్యం

పేదల భూములు కబ్జాచేసినందుకే..: ఎంపీ రాజేందర్

పోచారం ఏకశిలానగర్ బీదలకు సర్కారు న్యాయం చేయాలె



2

ఏం చేద్దాం? ఎలా ముందుకు పోదాం?..

# మేయర్‌పై అవిశ్వాసం!

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తాడోపేడో..

కేటీఆర్ అధ్యక్షతన తలసాని ఇంట్లో లంచ్ మీటింగ్

పలు కీలక అంశాలపై సుదీర్ఘ చర్చ

రెండున్నర గంటల పాటు సాగిన సమావేశం

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో బీఆర్ఎస్ గ్రేటర్ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ నివాసంలో జరిగిన ఈ లంచ్ మీటింగ్ కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షత వహించారు. దాదాపు రెండున్నర గంటల సేపు ఈ సమావేశం ...మిగతా 2లో



**జూనియర్ కాలేజీల్లో మిడ్ డే మీల్స్!**

బడ్జెట్‌లో రూ. 120 కోట్లు కేటాయింపు!

2

# చిలుకూరు బాలాజీ టెంపుల్లో ప్రియాంక చోప్రా

హైదరాబాద్, జనవరి 21 (మనం న్యూస్): హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ టెంపుల్లో సినీ నటి ప్రియాంకా చోప్రా పూజలు చేశారు. గుడిలో ప్రదక్షిణలు చేసిన అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ప్రియాంకను పూజారులు శేష వస్త్రంతో గౌరవించారు. ''శ్రీ బాలాజీ ఆశీస్సులతో కొత్త అధ్యాయం మొదలైంది. మనమందరం మన హృదయాల్లో శాంతిని నింపుకొని, మన చుట్టూ సమృద్ధి, సౌభాగ్యాలతో గడపాలి. దేవుడి దయ అనంతం. ఓం నమో నారాయణాయ. థ్యాంక్యూ ఉపాసన కొణిదెల అని తన పోస్ట్లో పేర్కొంది.

అంటే ఈ టెంపుల్ విజిట్‌కు ఉపాసన హెల్ప్ చేసి ఉండవచ్చని అంతా అనుకుంటున్నారు. అందునా ప్రియాంకా చోప్రాకు, రామ్ చరణ్‌కు మధ్య మంచి స్నేహబంధం ఉన్న విషయం తెలిసిందే. వారిద్దరూ 'జంజీర్' అనే మూవీలో కలిసి నటించారు కూడా. అలాగే త్రిబుల్‌ఆర్ మూవీకి ఆస్కార్ అవార్డ్ రావడంలోనూ ఆమె సపోర్ట్ చేశారు. ఆస్కార్ కోసం వచ్చిన వారికీ ప్రీ-ఆస్కార్ పార్టీ కూడా ఇచ్చారామె.

# సెకండ్ సిమ్@ రూ.20/మంత్

ఢిల్లీ: మనలో చాలామంది రెండేసి సిమ్ములు వాడుతుంటారు. కానీ, రీచార్జిల భారం మోయలేకుండా ఉన్నామని.. రెండో సిమ్‌ను తీసేయాలని అనుకుంటున్న వారికి ట్రాయ్ సంతోషకరమైన వార్త ప్రకటించింది. రెండో సిమ్ మీ పేరు మీదే కొనసాగాలీ అనుకుంటే.. కేవలం రూ.20 రీఛార్జి చేసుకుంటే సరిపోతుంది. సిమ్‌కార్డు కాల్స్, ఎస్సెమ్మెస్‌లు, డేటా వాడకుండా ఎటువంటి యాక్టివ్ రీఛార్జి ప్లాన్ లేకుండా 90 రోజులకు మించి సిమ్ కార్డును పక్కన పడేస్తే అది డిస్కనెక్ట్ అయిపోతుంది. అప్పుడు మీ టెలికాం ఆపరేటర్ ఆ సిమ్కార్డును మీ పేరు నుంచి డీరిజిస్టర్ చేసి వేరొకరికి కేటాయిస్తారు. ఇలా మీ పేరుమీదే సిమ్కార్డు కొనసాగాలంటే రూ.20 రీఛార్జి చేసుకుంటే సరిపోతుంది. మీరు 90 రోజుల పాటు మీ సిమ్కార్డును వాడకపోతే.. మీ ప్రీపెయిడ్ బ్యాలెన్స్ నుంచి రూ.20 కట్ అయ్యి మీకు 30 రోజుల గడువు లభిస్తుంది. ఇలా ప్రతి నెలా రూ.20తో రీఛార్జి చేసుకుంటే మీ సిమ్కార్డును యాక్టివ్గా ఉంచుకోవచ్చు.

జియో, ఎయిర్టెల్, వొడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఈ సదుపాయం వినియోగించుకోవచ్చు. ఒకవేళ ఆ నెలలో ఏదైనా కారణంతో మీ ఖాతాలో రూ.20తో రీఛార్జి చేసుకోకపోతే 15 రోజుల గ్రేస్ పీరియడ్ లభిస్తుంది. ఆలోపు మీ ఖాతాలో బ్యాలెన్స్ మెయింటెయిన్ చేసుకుంటే సరిపోతుంది. లేకపోతే మీ సిమ్కార్డును కోల్పోవాల్సి వస్తుంది. వాస్తవానికి ట్రాయ్ తీసుకొచ్చిన రూల్ కొత్తదేమీ కాదు. ఈ ఆటోమేటిక్ నంబర్ రిటెన్షన్ స్కీమ్ను ఎప్పుడి నుంచో ఉంది. దీనిపై సరైన ప్రచారం లేకపోవడంతో చాలా మంది రెండో సిమ్ము తమ పేరు మీద కొనసాగించేందుకు ప్రతినెల పెద్ద మొత్తం పెట్టి రీఛార్జి చేసుకుంటున్నారు.

# 'సింధు నదీ జలాల' ఒప్పందంపై తటస్థ నిపుణుడికి భారత్ ఓకే

ఢిల్లీ: జమ్ముకశ్మీర్లో నిర్మిస్తున్న కిషన్ గంగ, రాట్లే జలవిద్యుత్కేంద్రాల విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య విభేదాలను పరిష్కరించేటందుకు ప్రపంచబ్యాంకు తటస్థ నిపుణుడిని నియమించింది. దీనిని భారత్ స్వాగతించింది. ఈ మేరకు భారత విదేశాంగశాఖ ప్రకటన విడుదల చేసింది. నిపుణుడి నిర్ణయం భారత వైఖరిని సమర్థించిందని పేర్కొంది. సింధు జలాల ఒప్పందం ప్రకారం.. తటస్థ నిపుణుడికి మాత్రమే విభేదాలను పరిష్కరించే సామర్థ్యం ఉందని భారత్ విశ్వసిస్తోందని పేర్కొంది. దీనిపై పాకిస్థాన్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. సింధు నదికి ఉపనదులైన జీలం, చిన్నా భారత్ జల విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తుండటాన్ని పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కానీ, భారత్- పాక్ మధ్య 1960లో సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం ప్రకారం.. ఈ ఉపనదుల జలాలను భారత్ సాగు కోసం పరిమితంగా, జలవిద్యుత్ కోసం గరిష్ఠంగా ఉపయోగించుకోవచ్చు. అయినప్పటికీ.. కిషన్గంగ, రాట్లే ప్రాజెక్టులపై పాకిస్థాన్ వివాదం లేవనెత్తి, మధ్యవర్తిత్వ కోర్టును ఏర్పాటు చేయాల్సిందిగా ప్రపంచబ్యాంకును కోరింది. ఏ వివాదాన్ని పరిష్కరించుకోవాలన్నా తటస్థ నిపుణుడిని నియమించాలని ఒప్పందం నిర్దేశిస్తోంది. ఈ అంశాన్నే భారత్ గుర్తు చేసింది. అయినా 2022లో ప్రపంచబ్యాంకు అటు భారత్ కోరిన ప్రకారం మైకేల్ లీనోను తటస్థ నిపుణుడిగా, పాకిస్థాన్ కోరిన ప్రకారం షాన్ మర్ఫీ అధ్యక్షతన మధ్యవర్తిత్వ కోర్టునూ నియమించింది. ఇలా ఒకే సమస్యపై రెండు రకాలుగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా, ఆచరణపరంగా సమస్యలకు దారితీస్తుందన్నది భారత్ వాదన. అందరూ సింధు జలాల ఒప్పందం ప్రకారమే నడచుకోవాలని భారత్ స్పష్టం చేస్తోంది.

# జూనియర్ కాలేజీల్లో మిడ్ డే మీల్స్!

హైదరాబాద్, జనవరి 21 (మనం న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మాదిరిగానే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని సర్కారు భావిస్తోంది. సీఎం ఆదేశాల మేరకు ఇంటర్ విద్యాశాఖ పథక అమలుకు తయారీ చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 425 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా... సుమారు 1.70 లక్షల మంది చదువుతున్నారు. కళాశాలలన్నీ నియోజకవర్గ, మండల కేంద్రాల్లోనే ఉండటంతో పలువురు విద్యార్థులు రోజూ దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పొద్దున్నే భోజనం తెచ్చుకునే వీల్లేనివారు మధ్యాహ్నానికే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఈ పరిస్థితి వల్ల డ్రాపౌట్లు పెరిగిపోతున్నాయి. హాజరు కూడా 50 శాతానికి మించడం లేదు. ఈ సమస్యల నివారణకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్లో ఈ పథకానికి నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. అందుకనుగుణంగానే వారం రోజుల్లో ఇంటర్ విద్యాశాఖ ప్రతిపాదనలు సమర్పించనుంది. ఒక్కో విద్యార్థిపై పూటకు రూ.20 నుంచి రూ.25 వరకు ఖర్చవుతుందని.. ఏటా రూ.100- 120 కోట్లు అవసరమవుతాయని ప్రాథమిక అంచనా.



### గతంలో రెండుసార్లు ప్రకటించినా..

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతోపాటు బీఈడీ, డీఈడీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో మొత్తం 3.91 లక్షల మందికి మధ్యాహ్న భోజనం అమలు చేయాలని 2018లో గత ప్రభుత్వం నిర్ణయించింది. అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా అమలు చేయాలని ఆనాడు కమిటీ సూచించింది. ఈ మేరకు 2018-19 విద్యా సంవత్సరంలో ఆగస్టు 15న పథకాన్ని ప్రారంభించాలని భావించినా అమలు కాలేదు. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. ఏపీలో ఇటీవలే ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. కళాశాలల సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వండి సరఫరా చేస్తున్నారు.

# మేయర్‌పై అవిశ్వాసం!

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగింది. జీహెచ్ఎంసీ మేయర్‌పై అవిశ్వాసం అంశంతో పాటు పలు కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించారు. జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్‌కు ఉన్న కార్పొరేటర్ల బలం, అవిశ్వాసం పెట్టేందుకు ఎంత సంఖ్య అవసరం అనే కోణంలో చర్చించినట్లు తెలుస్తోంది. అవసరమైనంత మంది సభ్యులను ఎలా సమకూర్చుకోవాలి? అనే అంశంపై వారు సమాలోచనలు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణి, మాజీ మంత్రి మహమూద్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... ఇది పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులకు సంబంధించిన సమావేశమని చెప్పారు. అయితే, తాము రాజకీయ నాయకులం కాబట్టి రాజకీయ అంశాలపై కూడా చర్చించుకున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టడంపై చర్చించుకున్నామని తలసాని చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో పాటు, రైతు రుణమాఫీ, రైతు భరోసా అంశాల్లో ప్రభుత్వ మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా సుదీర్ఘ చర్చ జరిగిందని చెప్పారు. రేషన్ కార్డులను అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

ఇక, స్ట్రీట్ వెండర్స్‌ని ఆదుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని... కానీ, ఇప్పుడు వారిని పూర్తిగా తొలగించేందుకు చూస్తోందని తలసాని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో కాంగ్రెస్ గీత దాటితే... తాము కూడా గీత దాటాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. మరోవైపు, బీఆర్ఎస్ నేతల కుటుంబ వారసులను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకొచ్చే అంశంపై కూడా లంచ్ మీటింగ్‌లో చర్చించినట్లు తెలుస్తోంది.

# వందేళ్ల విధానాన్ని ఒక్క సంతకంతో ఖతం చేసిన ట్రంప్

ఢిల్లీ: వలసదారులకు అమెరికాలో ఉన్నప్పుడు పుట్టే పిల్లలకు అమెరికా పౌరసత్వం కల్పించే చట్టాన్ని నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేశారు. దాదాపు వందేళ్లుగా అమల్లో ఉన్న విధానానికి ఒక్క ఎగ్జిక్యూటివ్ ఆర్డర్తో ఫుల్‌స్టాప్ పెట్టారు.ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రవాస భారతీయులపై ఎలాంటి తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.



### చట్టం ఏం చెబుతోంది?

అమెరికా చట్టాల ప్రకారం.. ఆ దేశ పౌరులకు పుట్టిన వారికి మాత్రమే కాకుండా.. అమెరికాలో జన్మించిన ప్రతి ఒక్కరికీ అక్కడి పౌరసత్వం లభిస్తుంది. అమెరికాలో పుట్టినవారంతా ఈ దేశ పౌరులే అనే ఉద్దేశంతో 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగింది. అయితే, తాజాగా ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో దీనికి బ్రేక్ పడింది. ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం.. బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒక వేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోయినా పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం రాదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ.. తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటున్నా అదే నియమం వర్తిస్తుంది.

### ఎన్ఆర్ఐలపై ప్రభావమెంత?

అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుల సంఖ్య చాలా వేగంగా పెరుగుతోంది. 2024 చివరి నాటికి 5.4 మిలియన్ల మంది ఎన్నారైలు అక్కడ నివసిస్తున్నారు. అమెరికా మొత్తం జనాభాలో సుమారు 1.47 శాతం భారతీయులే. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టినవారు. మిగతావారంతా వలసదారులు. ఈ నేపథ్యంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం భారతీయులపై ప్రభావం చూపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాత్కాలిక వీసాపై అమెరికా వెళ్లి.. గ్రీన్ కార్డుకోసం వేచిచూస్తున్న వారికి పుట్టిన పిల్లలెవరికీ అమెరికా పౌరసత్వం లభించదు.ఇప్పటికే గ్రీన్ కార్డు రాక ఇబ్బంది పడుతున్న చాలా మంది భారతీయ వలసదారులు, వారి పిల్లలకు కూడా అక్కడి పౌరసత్వం రాకపోతే.. గ్రీన్ కార్డు జారీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతుంది. దీనివల్ల తల్లిదండ్రులు భారత్లో, పిల్లలు అమెరికాలో ఉండాల్సి వస్తుంది. చట్టపరమైన సమస్యలు ఎదురుకావొచ్చు. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాపై అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థులకు జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించడం దాదాపు అసాధ్యం. అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థుల్లో ఎక్కువ మంది భారతీయులే. ప్రత్యేకంగా ఇంజినీరింగ్, టెక్నాలజీ విభాగాల్లో ఎక్కువగా ఉంటారు. వీరిలో కొందరు ఇతర దేశాలకు చెందిన వారిని అక్కడే వివాహం చేసుకుంటారు. ఇలాంటి వారు ఇకపై పిల్లల విషయంలో చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. 2011లో అమెరికా ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్ విడుదల చేసిన వాస్తవ పత్రం ప్రకారం.. ఒక వేళ జన్మతః పౌరసత్వాన్ని నిలిపివేస్తే దాని ప్రభావం దాదాపు అందరిపైనా పడుతుంది. అమెరికా ప్రజలు కూడా తమ పిల్లలు ఈ దేశానికి చెందిన వారే అని నిరూపించుకోవాల్సి వస్తుంది.

# రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న గ్రామసభలు

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుంది. ఈనెల 24 వరకు ఇవి కొనసాగనున్నాయి. గ్రామ సభల్లో ప్రభుత్వ సంకల్పం, పథకాల వివరాలను ఆయా శాఖల అధికారులు ప్రజలకు వివరిస్తున్నారు. నిజమైన లబ్దిదారులను ఎంపిక చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, కొన్ని చోట్ల స్థానికంగా కాంగ్రెస్ నేతలు చెప్పిన వారినే ప్రభుత్వ పథకాలకు లబ్దిదారులుగా ఎంపిక చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు కొన్ని చోట్ల గ్రామసభలను స్థానికులు బహిష్కరిస్తున్నారు. మరికొన్ని చోట్ల గ్రామసభల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల మాటేమిటని ప్రశ్నిస్తున్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా మోతె, జనగామ జిల్లా పాలకుర్తి మండలం అయ్యంగారిపల్లెలో అధికారులు నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు ఆరు గ్యారెంటీలపై నిలదీయడంతో సభల్లో గందరగోళం ఏర్పడింది.

### మహిపాల్ రెడ్డికి నిరసన సెగ

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది కాంగ్రెస్ గూటికి చేరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి సొంత పార్టీ నేతల నుంచి ప్రతిఘటన ఎదురైంది. మంగళవారం ఐడీఏ బొల్లారంలో అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన ఎమ్మెల్యేను కాంగ్రెస్ నేతలే అడ్డుకున్నారు. అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించిన శిలాఫలకంపై కొంత మంది పేర్లు లేకపోవడంతో ఎమ్మెల్యే కార్యక్రమాన్ని స్థానిక అధికార పార్టీకి చెందిన నేతలు బహిష్కరించారు. ఆ తరువాత సొంత పార్టీ కార్యకర్తల నిరసనల మధ్యే ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వెళ్లిపోయారు.

# బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో సిత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నిక తరువాత క్రియాశీల సభ్యులను ఎంపిక చేసి ఆ తరువాత పట్టణ, మండల అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. కానీ, జోగులాంబ గద్వాల జిల్లాలో పార్టీ నిబంధనలకు విరుద్ధంగా యాక్టివ్ మెంబర్షిప్ ఇవ్వడం జరిగిందనీ, ఏకాభిప్రాయంతో ఎన్నుకోవాల్సిన జిల్లా అధ్యక్ష పదవిని సైతం జిల్లాకు చెందిన ఓ కీలక నేత తనకు సన్నిహితంగా ఉండే వ్యక్తికి కట్టబెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 32 జిల్లాల్లో బీజేపీ కార్యాలయంలో ఏకాభిప్రాయం ద్వారా జిల్లా అధ్యక్షుని ఎంపిక జరుగగా కేవలం గద్వాల జిల్లాలో మాత్రం అధ్యక్షులు కావాలనుకున్న వారి ఇంట్లోనే జరిగిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిద్ధాంతంతో కూడిన కార్యకర్తలను తయారు చేసే పార్టీగా పేరున్న బీజేపీలో మాత్రం ఓ నేత తనకు సన్నిహితునికి మాత్రమే జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెడుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. జిల్లాలో పార్టీకి ఎవరూ లేనప్పుడు పార్టీ జెండా పట్టి పని చేసిన సీనియర్ నాయకులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా సమావేశాలకు పిలిచి సముచిత గౌరవం ఇవ్వకపోవడంతో వారు గత కొద్ది రోజులుగా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలోనే బలమైన నాయకురాలుగా ఉండి జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో ఓట్లు రాబట్టుకోవడంలో విఫలమైనప్పటికీ తమను కాదని కొత్త వారిని ప్రోత్సహిస్తున్నదని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నుంచి వచ్చిన నిధులను జిల్లా అధ్యక్షుడు తన దగ్గర పెట్టుకోవడంతో ఆ నియోజకవర్గంలోని జిల్లా ఉపాధ్యక్షుడు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న సునీల్ బన్సల్‌కు ఫిర్యాదు చేయడంతో అప్పుడు బూత్‌లలో ఏజెంట్ల నియామకానికి, మిగతా ఖర్చులకు డబ్బులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేస్తున్నారు. నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఆధిపత్యం చెలాయిస్తే పార్టీలోకి కొత్తతరం నేతలు ఎవరు వస్తారనీ, ఒకే కుటుంబానికి సంబంధించిన వ్యక్తులు మాత్రమే రాజకీయాలు చేయాలా అని ఆ జిల్లాకు చెందిన కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.



# యూనీలివర్‌తో ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

యూనిలివర్ కంపెనీ ముందుకు వచ్చింది. తెలంగాణలో యూనిట్లను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అగ్రిమెంట్ కుదుర్చుకున్నాయి. తొలి విడతలో భాగంగా రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లాలో పాయాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కంపెనీ...అలాగే, రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్ నెలకొల్పేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. కాగా, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు యూనిలివర్ కంపెనీ ముందుకు రావడంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యూనిలివర్ కంపెనీ పెట్టుబడుల ద్వారా యువతకు ప్రత్యక్షంగా,




పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మరోవైపు, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు సాంబనోవా కంపెనీ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ సూలేతో చర్చలు జరిపారు. ప్రధానంగా సెమీ కండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన అవకాశాలపై చర్చించారు. కాలిఫోర్నియాకు చెందిన సాంబనోవా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కంపెనీ ఏఐ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ అందించడంలో పేరొందిన సంస్థతో జరిగిన చర్చలు సానుకూలంగా ముగిశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో దావోస్ పర్యటనకు వెళ్లిన రాష్ట్ర బృందం దాదాపు రూ.40 వేల కోట్ల పెట్టుబడులను రాబట్టిన విషయం తెలిసిందే. ఈసారి పర్యటనలో అంతకంటే ఎక్కువ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకు రావాలన్న పట్టుదలతో ఉంది.

# ఆర్థికాభివృద్ధిలో మైనింగ్ కీలకం

హైదరాబాద్, జనవరి 21 (మనం న్యూస్): దేశంలో ఆర్థిక కార్యకలాపాలు, పారిశ్రామికీకరణ వేగంగా పెరుగుతోందనీ, దీనికి అనుగుణంగా విద్యుత్ అవసరాలు కూడా పెరుగుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా బొగ్గు ఉత్పత్తిని పెంచే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. మంగళవారం ఒడిశాలోని కోణార్క్‌లో రాష్ట్రాల బొగ్గు, గనుల శాఖ మంత్రుల జాతీయ సదస్సులో కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశ జిడిపిలో బొగ్గు, గనుల రంగం భాగస్వామ్యం 2 శాతంగా ఉందన్నారు. పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, తయారీ రంగం వంటి వివిధ రంగాల్లో బొగ్గుతో పాటు వివిధ ఖనిజాలు పోషించే పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గనుల రంగం లేకుండా దేశ ఆర్థిక కార్యకలాపాలు దాదాపు అసాధ్యమనీ, ప్రస్తుతం దేశంలోని 72 శాతం విద్యుదుత్పత్తి బొగ్గు ద్వారానే జరుగుతోందని వెల్లడించారు. బొగ్గు రంగంలో దాదాపు 5 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతోందనీ, ఈ రంగంలో ఉపాధి అవకాశాలను మరింతగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య నిర్మాణం పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి మొత్తం విలువ దాదాపు రూ.1.86




లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నామనీ, 2024లో 997 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు. 2014తో పోల్చుకుంటే ఏకంగా 76 శాతం మేర ఉత్పత్తి పెరిగిందనీ, 2030 నాటికి 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం కలిసి పనిచేసినప్పుడే మనం అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు వీలు కలుగుతుందన్నారు. వీలైనంత ఎక్కువగా గనుల వేలం నిర్వహించడం, సరైన సమయంలో గనుల్లో తవ్వకాల పనులు ప్రారంభించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి, కార్మికుల సంక్షేమం కేంద్రంగా ఓ సర్వ ఆమోదయోగ్యమైన మోడల్ తయారు చేసుకుని ముందుకెళ్తామనీ, రానున్న తరాల కోసం ఓ ఆదర్శవంతమైన విధానం తీసుకొస్తామని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# 27గురు మావోయిస్టుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

రివార్డు కలిగిన ఎనిమిది మంది కేంద్ర కమిటీ సభ్యులున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కేంద్ర కమిటీ సభ్యులు, ఆంధ్ర - ఒడిషా రాష్ట్ర కార్యదర్శి చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, మోహిత్, ప్రమోద్ మిశ్రా, పాక మంతయ్య అలియాస్ హన్మంతు, ప్రతాప్ రెడ్డి, రాబందుల అమర్, పతిరాం మంగి, సంజయ్ దీపక్‌లున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఘటనా ప్రాంతాల్లో ఏకే 47, ఎస్ఎల్ఆర్, రైఫిల్స్, రాకెట్ లాంచర్స్‌తో పాటు భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర నిత్యావసర వస్తువులను భద్రతా బలగాలు స్వాధీన పరుచుకున్నాయి. అయితే, ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతున్నట్టు సమాచారమందుతున్నది.

# రియల్ బ్రోకర్ చెంప ఛెళ్లు

హైదరాబాద్, జనవరి 21 (మనం న్యూస్): మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఓ రియల్ ఎస్టేట్ దళారి చెంప ఛెళ్లుమనిపించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఈ ఘటన జరిగింది. తమ ఇంటి స్థలాల భూములను కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని నిలువ నీడ లేకుండా చేస్తున్నారంటూ పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్ వాసులు ఎంపీ ఈటలకు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై ఈటల స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో ఈటల స్వయంగా ఏకశిలానగర్‌లో పర్యటించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల భూములను దౌర్జన్యంగా ఎందుకు ఆక్రమించుకుంటున్నారని నిలదీశారు. వెంటనే స్థలం నుంచి వెళ్లిపోవాలని ఆదేశించడమే కాకుండా ఆయనపై చేయి చేసుకున్నారు. దీంతో ఈటలతో పాటు వచ్చిన బీజేపీ కార్యకర్తలు కూడా అతనిపై దాడి చేయడంతో పోలీసులు అతడిని అక్కడి నుంచి పంపించివేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ తన 25 ఏళ్ల జీవితంలో ఎవరిపై చేయి చేసుకోలేదనీ, కానీ న్యాయం కోసం ఈరోజు తప్పలేదని వివరించారు. పోచారం మున్సిపాలిటీలోని 149 ఎకరాల్లో ఏకశిలానగర్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఉందనీ, 1985లో వివిధ సంస్థలలో పనిచేసే చిన్న ఉద్యోగులు ఈ లాండ్ కొనుగోలు చేశారనీ, అయితే, 2006లో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసే వ్యక్తులు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

# ఇది ఖూనీకోర్ సర్కార్

- రైతన్నల మనోవేదనలే మీ సర్కారుకు మరణ శాసనం
- ఆత్మహత్యలు కావు.. అవి ముమ్మాటికీ మీరు చేసిన హత్యలే
- రుణమాఫీ చేయకుండా తీసిన ప్రాణాలు
- రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు
- ఒకే రోజున నలుగురు రైతులను పొట్టన పెట్టుకుండ్రు?
- రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి: ఈ దుష్ట కాంగ్రెస్ ప్రభుత్వంలో రోజురోజుకు రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. తెలంగాణలో రైతు రాజ్యం లేదని... రైతు వంచన ప్రభుత్వం పాలిస్తోందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఒకే రోజున నలుగురు రైతులను రేవంత్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకే రోజు నలుగురిని పొట్టన పెట్టుకున్న ప్రభుత్వమిది.. రైతు రాజ్యం కాదిది... రైతు వంచన కొనసాగిస్తున్న రాజ్యమిది! అంటూ కామెంట్ చేశారు. ముమ్మాటికీ రైతులను ఆదుకునే సంక్షేమ ప్రభుత్వం కాదిది... తోడేళ్లలా ప్రాణం తీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమిది! అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

- డీపీవో సురేష్ మోహన్.

**చేవెళ్ల, జనవరి 21(మనం న్యూస్ ):** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీపీవో సురేష్ మోహన్ అన్నారు. చేవెళ్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాపాలనలో భాగంగా రేషన్కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా వంటి పథకాలను అర్హులకు అందించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. గ్రామ సభలో ప్రజలు పాల్గొని దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. రేషన్కార్డులో తప్పుఒప్పులు, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకునేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి ప్రభుత్వ పథకాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించి లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో హిమబిందు, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, మాజీ ఎంపీటీసీలు సున్నపు వసంతం, గుండాల రాములు, నాయకులు గంగి యాదయ్య, నారాయణ, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.




## ప్రజా పాలన ప్రత్యేక గ్రామసభ



**సైదాపూర్, జనవరి 21(మనం న్యూస్):** ప్రజాపాలన ప్రత్యేక గ్రామసభ మండల మండలంలోని దుద్దెనపల్లి, బొమ్మకల్, రాములపల్లి, నల్లరామయ్యపల్లి, ఎలా బోతారం, జాగిరిపల్లి, ఆరేపల్లి, గుజ్జులపల్లి, గ్రామాలలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. సభలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, పథకాల డ్రాఫ్ట్ లిస్ట్ చదివి వినిపించారు. లిస్టులో పేరులేని వారు ఆందోళన చెందవద్దని, గ్రామసభలో మరోసారి అప్లై చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, ఎంపీడీవో భూక్య యాదగిరి, సంబంధిత అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆర్థిక సాయం అందజేత

**చేవెళ్ల, జనవరి 21(మనం న్యూస్ ) :** చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట గ్రామానికి చెందిన గొల్లగూడెం యాదయ్య కు బ్రెయిన్లో బ్లడ్ క్లాత్ అయినట్లు డాక్టర్లు గుర్తించారు. పూర్తిగా కోలు కోలేకపోవడంతో తనవంతు ఆర్థిక సాయంగా బీఆర్ఎస్ నాయకుడు కందికొండ విగ్నేష్ గౌడ్ రూ.10వేలను బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు.

## ఆలయ నిర్మాణానికి దాతల సహకారం అవసరం

- ఆలయ కమిటీ సభ్యులు.
- శ్రీ వీరభద్ర ఆలయ నిర్మాణానికి రూ .లక్ష విరాళం.

**చేవెళ్ల జనవరి 21 (మనం న్యూస్):** ఆలయ నిర్మాణానికి దాతల సహకారం ఎంతో అవసరమని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని పామెన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వీరభద్ర ఆలయ నిర్మాణానికి ముడిమ్యాల సొసైటీ చైర్మన్ గోనె ప్రతాపరెడ్డి రూ.1లక్ష విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ఆలయ నిర్మాణానికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంలో



భాగస్వాములు కావాలన్నారు. అనంతరం గ్రామస్తులు సహకార సంఘం చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పామెన మాజీ సర్పంచ్ దవల్ గారి గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ మండల కార్యదర్శి ఎర్ర గోపాల్, మాజీ ఎంపిటిసి సత్యనారాయణ , కృష్ణ ,సుందర్ ,రఘు , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చర్ చికితకు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు చేయూత





**హైదరాబాద్, జనవరి 20(మనంన్యూస్):** ఆర్చర్ చికితకు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు చేయూత అందించేందుకు ముందుకొచ్చారు. అక్షర విద్యాసంస్థల నుంచి 10 లక్షల స్పోర్ట్స్ స్కాలర్షిప్ అందించారు.ఆర్చరీ వరల్డ్కప్, ఆసియాకప్కు ఎంపికైన పెద్దపల్లి యువ ఆర్చర్ టి.చికితరావుకు జగన్ మోహన్ రావు చేయూత అందించారు. సాధారణ రైతు కుటుంబ నుంచి అంతర్జాతీయ స్థాయి ఆర్చర్గా ఎదిగిన చికితకు సరైన ప్రోత్సాహం లేక ఇబ్బంది పడుతుందని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆమెకు అన్ని విధాలా అండగా ఉంటానని అన్నారు. అక్షర విద్యా సంస్థల నుంచి చికితకు 10 లక్షల స్పోర్ట్స్ స్కాలర్షిప్ ఇస్తున్నాం.. తొలి విడతగా 50 వేల చెక్కు అందించామన్నారు. వచ్చే ఫిబ్రవరి నుంచి చికిత శిక్షణ నిమిత్తం ప్రతి నెల 15 వేల ఉపకార వేతనం ఐదేళ్ల పాటు అక్షర విద్యా సంస్థల నుంచి ఇవ్వనున్నామని జగన్మోహన్ రావు చెప్పారు.తెలంగాణ స్టేట్ జూనియర్ ఆర్చరీ చాంపియన్షిప్లో పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆర్చర్ టి. చికిత రావు గోల్ మెడల్ గెలిచింది. కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో సోమవారం జరిగిన కాంపౌండ్ విభాగం ఫైనల్లో చికిత అందరికంటే ఎక్కువగా 697 పాయింట్లు సాధించి స్వర్ణం ఖాతాలో వేసుకుంది.

## అండర్-16లో సత్తా చాటిన జోగు సాయి అక్షిత్, జోగు సాయి చరిత్

**చేవెళ్ల, జనవరి 21(మనం న్యూస్ ) :** దుబాయిలో జరిగిన అండర్-16 క్రికెట్ పోటీల్లో బడ్లగూడ జాగిర్ టైం ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు షాబాద్ మండలం నాగర్ గూడ చెందిన జోగు సాయి అక్షిత్ (9వ తరగతి), జోగు సాయి చరిత్ (8వ తరగతి) విద్యార్థులు అండర్-16 క్రికెట్ టోర్నమెంట్లో సత్తా చాటారు. పాకిస్తాన్ బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ జట్లపై ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలిపించారు. అండర్-16 లో సత్తా చాటిన విద్యార్థులకు మంగళవారం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లో తాత జోగు వెంకటయ్య తాలపల్లి మాజీ ఎంపీటీసీ, తండ్రి డాక్టర్ జోగు అశోక్ ఘన స్వాగతం పలికి అభినందించారు. తమ పిల్లలు క్రీడల్లో రాణించేందుకు మరింత ప్రోత్సాహం అందిస్తామని, క్రికెట్ లో సత్తా చాటి దేశానికి మంచి పేరు తీసుకురాలన్నదే తమ పిల్లల కళ జోగు డాక్టర్ అశోక్ తెలిపారు.



## భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు

- ఎల్లమ్మ తల్లి బోనాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే .
- ప్రతేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం.

**చేవెళ్ల, జనవరి 21(మనం న్యూస్ ):** మండలంలోని కేసారం గ్రామంలో ఎల్లమ్మ బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులందరూ కలిసి అమ్మవారికి బోనాల పండగను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకపూజలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. డోలు వాయిద్యాలు, బోనాల్లో మహిళలు గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ శివారులో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 20(మనంన్యూస్):** శివారు ప్రాంతమైన మొయినాబాద్‌లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.మొయినాబాద్లో ల్యాండ్ కబ్జాకు యత్నించిన ఓ వ్యక్తిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రంగంలోకి దిగిన పోలీసులకు అసలు విషయం తెలిసింది. ల్యాండ్ కబ్జాకు ప్రయత్నించింది మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ సయ్యద్ అని.. దీంతో సయ్యద్ సహా తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. అనంతరం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించి సయ్యద్ రౌడీషీట్ ఓపెన్ చేశారు.హైదరాబాద్ శివారులో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్ట్ఇటీవలే రాహుల్ గాంధీ పీఏను అంటూ జార్ఖండ్ సీఎంవోలో సయ్యద్ హల్చల్ చేసిన సంగతి తెలిసిందే. సీబీఐ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులను మేనేజ్ చేస్తానంటూ ఓ వ్యాపారి నుంచి ఇటీవల రూ.కోట్లు కొల్లగొట్టాడు. ప్రస్తుతం అతని వద్ద నుంచి బెంజ్ కారు సహా ఇతర సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి సోదరుడి కొడుకును హనీట్రాప్లోకి దించి.. అతన్ని బ్లాక్మెయిల్ చేసి రూ.25 లక్షలు వసూలు చేశాడు. సయ్యద్ మీద మొత్తం 15 కేసులు ఉండగా.. కేవలం హైదరాబాద్లోనే 11 కేసులు.. ఇతర



రాష్ట్రాల్లో మరో 4 కేసులు ఉన్నట్లు గుర్తించారు. తాజాగా అతని మీద మరో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## 24న కరీంనగర్‌కు కేంద్ర మంత్రి ఖట్టర్ రాక

- పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నమంత్రి

**కరీంనగర్ బ్యూరో, జనవరి 21 (మనం న్యూస్):** కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈనెల 24న కరీంనగర్ కు రానున్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ప్రధానంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హౌజింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన 24 గంటల పాటు నిరంతరాయంగా తాగు నీటి సరఫరా కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. వీటితోపాటు అంబేద్కర్ స్టేడియంలో రూ.22 కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, అనుబంధ పనులను ప్రారంభిస్తారు. రూ.8.2 కోట్లతో మల్టీపర్పస్ స్కూల్ లో చేపట్టిన పార్క్ పనులను ప్రారంభిస్తారు. అనంతరం రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన రాజీవ్ పార్క్ అభివృద్ధి పనుల ప్రారంభిస్తారు. నగరంలోని ఆంబోతు వీర్యం కేంద్రం వద్ద పద్మానగర్‌లో రూ.14 కోట్లతో నిర్మించిన 'ఇంటిగ్రేటెడ్ మార్కెట్' భవనాన్ని ప్రారంభిస్తారు. దీంతోపాటు రూ.10.2 కోట్లతో నిర్మించిన స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ప్రారంభిస్తారు. సుభాష్ నగర్ పాఠశాలలో రూ.10.2 కోట్లతో నిర్మించిన స్మార్ట్ డిజిటల్ క్లాస్ ను ప్రారంభిస్తారు. అనంతరం కరీంనగర్ బైపాస్ రోడ్డు వద్దనున్న డంప్ యార్డ్ ను సందర్శిస్తారు. డంప్ యార్డ్ వల్ల ప్రజలు



ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటారు. అక్కడి నుండి నేరుగా హౌజింగ్ బోర్డు కాలనీ విచ్చేసి బహిరంగ సభలో పాల్గొంటారు. కేంద్ర మంత్రి ఖట్టర్ రాకను పురస్కరించుకుని స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సునీల్ రావు, కమిషనర్ చాహత్ బాజ్ పేయి అంబేద్కర్ స్టేడియం వద్ద నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, మార్వాడీ గవర్నమెంట్ స్కూల్, హౌజింగ్ బోర్డులో నిర్వహించబోయే బహిరంగ సభా స్థలి, డంప్ యార్డ్ ప్రాంతాలను సందర్శించారు. అభివృ ద్ధి పనులను పరిశీలించారు. హౌజింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభాస్థలి ప్రాంగణాన్ని సందర్శించారు. కేంద్ర మంత్రి ఖట్టర్ తొలిసారి కరీంనగర్ వస్తున్న నేపథ్యంలో ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా బండి సంజయ్ కోరారు.

# హైదరాబాద్లో ఇక నీటి సమస్య ఉండదు



## మరో కీలక అడుగు, రెండ్రోజుల్లో ఉత్తర్వులు

**హైదరాబాద్, జనవరి 20(మనంన్యూస్):** నగరవాసులకు గుడ్న్యూస్. త్వరలోనే నీటి కష్టాలు తీరనున్నాయి. ఎటువంటి సమస్యలు లేకుండా నిరంతరాయంగా తాగునీరు సరఫరా కానుంది. ఈ మేరకు రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి నుంచి అదనంగా మరో 20 టీఎంసీల నీటిని నగర తాగునీటి అవసరాలకు వాడుకోనున్నారు. అందుకు అవసరమైన పనుల కోసం ప్రతిపాదించిన గోదావరి రెండో దశ ప్రాజెక్టుకు వారంలో టెండర్లు పిలవనున్నారు.హైదరాబాద్ మహానగరం దాహార్తిని తీర్చేందుకు గోదావలి జలాలను వాడుకోవాలని డిసైడ్ అయింది. 20 టీఎంసీల గోదావరి జలాలను నగరానికి తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. గోదావరి రెండో దశ ప్రాజెక్టుకు వారంలో టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.7,360 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టనుండగా.. రానున్న 24 నెలల్లో పూర్తిచేసేలాకార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు మరో రెండ్రోజులు వెల్లడికానున్నాయి. గోదావరి నుంచి రెండో దశలో 15 టీఎంసీలు, మూడో దశలో 5 టీఎంసీలు నీటికి తీసుకురావాలని గతంలోనే నిర్ణయించారు. అయితే నగర తాగునీటి అవసరాలు భారీగా పెరిగిన నేపథ్యంలో రెండో దశలోనే 20 టీఎంసీలు తీసుకురావాలని తాజాగా డిసైడ్ అయ్యారు.హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చటంతో పాటుగా రేవంత్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టులో భాగంగా జంటజలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్కు గోదావరి జలాలు తీసుకురానున్నారు. మొత్తం నగర ప్రజల తాగునీటి అవసరాలకు 30 టీఎంసీలు కేటాయించగా.. ప్రస్తుతం 10 టీఎంసీలు వినియోగించుకుంటున్నారు. మరో 20 టీఎంసీల నీటి తరలింపునకు తాజాగా ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం రోజుకు 550 ఎంజీడీల నీటిని నగరానికి సరఫరా చేస్తున్నారు. నగర ప్రజల అవసరాలకు ఇవి ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రతిపాదించిన గోదావరి జలాలు తరలిస్తే.. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం లభించనుంది.



మనం Manam Editorial
సంపాదకీయం

## మనసు చేష్టలు

కళ్ళెం లేని గుర్రంలా
వాయువేగాన్ని మించిన వేగంతో
ఎక్కడెక్కడికో దౌడుతీసే మనసు...

గగనాన విహరించే విహంగంలా
ఊహాలోకంలో స్వేచ్ఛగా విహరిస్తూ
వాంఛా మృగతృష్ణల వెంట
కాంక్షగా పరుగులెడుతుంది

భూతకాలంలోకి వెళ్ళి
గత స్మృతుల జ్ఞాపకాల

దొంతరలో తిరుగాడుతూ
మధురాతి మధుర అనుభవాలను
నెమరువేసుకుంటుంది
చేదు జ్ఞాపకాల గాయాలను
గుర్తుచేసుకుంటుంది

భవిష్యత్తులోకి అరుదెంచి
ఆశల మోసులతో
బంగారు కలలు గంటుంది
గాలిలో మేడలు కడుతుంది

వర్తమానంలో వాస్తవిక జీవితాన
సుఖ సంతోషాలు వెల్లివిరిస్తే
ఆనంద డోలికల్లో తేలియాడుతుంది
కష్టాలు కడగండ్లు దాపురిస్తే
దిక్కుతోచక మౌనంగా రోదిస్తుంది

మనిషికి మనసే ప్రధానం
మనిషి చోదకశక్తియైన మనసుకి
మంచీ చెడ్డా లక్షణాలుంటాయ్
నాణేనికి బొమ్మా బొరుసుల్లా..

మనసుకి మనిషి లోబడితే
కోరికలే గుర్రాలౌతాయ్!
మనిషికి మనసు లోబడితే
ఉన్నత శిఖరాలు అందుతాయ్!!

- పి.వి.ప్రసాద్
9440176824

# జాతి గర్వించదగ్గ మహోన్నత శిఖరమే మహాత్మ జ్యోతిరావు పూలే!



కులాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నకాలం, అశాస్త్రీయ నమ్మకాలతో, మూడాఛారాలతో, ఆధిపత్య కులాల ఆగడాలతో, నిమ్నకులాలను అంటరాని వారిగా, బానిసలుగా చిత్రీకరించి, ఎలాంటి అవకాశాలు కల్పించకుండా మనుగడ సాగిస్తున్న రోజులవి. దానికితోడు చిత్ర, విచిత్రకరమైన మూడాఛారాలతో మహిళలను వంటింటికే పరిమితంచేసి, బానిసలుగాచూసే తరుణంలో ఈ వింతపోకడలను జీర్ణించుకోలేక, ఎందరో మహనీయులు, సంఘ సంస్కర్తలు తమ జీవితాలను ధారపోసి మెరుగైన సమాజంకోసం అహర్నిశలు పోరాడి, నూతన ఆలోచన విధానాలతో భవిష్యత్ తరాలకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచేటటువంటి కార్యకలాపాలకు పూనుకోని చైతన్యం రగిలించిన మహానుభావుల చరిత్ర ఎంతో ఘణనీయమైనది .అలాంటి మహానుభావుల చరిత్రను శాశ్వితంగా భద్రపరుస్తూ, రాబోవుతరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైననే ఉంటుంది. బాల్య వివాహాలు , సతీసహగమనం , వెట్టి , అంటరానితనం , అస్ప ృశ్యత , వివక్షత లాంటి వాటి నిర్మూలనకై పూనుకోని తమజీవితాలను త్యాగం చేసిన మహనీయులలో ఒకరైన జ్యోతిరావు పూలే జీవితం సైతం ఆదర్శనీయం. స్వాతంత్ర్య భారతావనిలో రాజ్యాంగాన్ని రచించి వెనుకబడిన, నిమ్న కులాల పాలిట రిజర్వేషన్ కల్పించి, సమాజంలో తలెత్తుకుని తిరిగే పరిస్థితులు కల్పించినందుకు ఏ విధంగా ఆరాధించ బడుతున్నారో అందరికీ తెలిసిన విషయమే. అలాంటి అపరజ్ఞాని పూలేను గురువుగా భావించి, ఆయన ఆలోచనా విధానాన్ని అనుకరించారు అంటే ఎలా మార్గదర్శకులు అయ్యారో తెలియకనే తెలుస్తుంది. అలాంటి తొలితరం చరిత్ర సృష్టించిన మహానుభావుడు జీవితం గురించి యావత్తు సమాజానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైన ఎంతైనా ఉన్నది.

భారతీయ సమాజంలో బ్రాహ్మణ ఆధిపత్య కులాల చెర నుంచి నిమ్నవర్గాలకు చెందిన పీడిత ప్రజల విముక్తికోసం తన జీవితాన్ని అంకితం చేసి, సమాజంలోని అస్ప ృశ్యత, అంటరానితనం, అసమానత, మూఢనమ్మకాల నిర్మూలనకై విశేష కృషి చేస్తూ, బహుజనుల ఆరాధ్యదైవంలా పేరుగాంచిన పూలేను సాక్షాత్తు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురువుగా భావించాడు అంటే, అతనికి సమాజం పై గల మక్కువ, నిస్వార్థత, దయాగుణం, పోరాట పటిమ, ధైర్యం, పట్టుదల, నిర్విరామ కృషి ఎలాంటిదో తెలియకనే తెలుస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. జ్యోతిరావు పూలే ఖానవాడి , పురంధర్, పూణే జిల్లా, మహారాష్ట్రకు చెందిన కూరగాయలు వ్యాపారం చేసుకునే గోవిందరావు, చిమ్నాబాయి దంపతులకు 11 ఏప్రిల్ 1827 న జన్మించాడు. కాలక్రమేణా తన తండ్రి పీష్వా పరిపాలన కాలంలో పూలవ్యాపారం చేయడం మూలంగా వారి ఇంటిపేరు పూలేగా మార్పు చెందింది. పూలేకు ఏడాది వయసున్న కాలంలోనే తనతల్లి మరణించడంతో మాతృప్రేమకు దూరం అయ్యాడు. ఏడు సంవత్సరాల వయస్సు వరకు మరాఠీ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించి, పేదరిక కారణంతో చదువు మానేసి వ్యవసాయంలో తండ్రికి సాయంగా ఉండేవారు. అతి తక్కువ కాలం పాఠశాలకు వెళ్లినప్పటికీ, చదువుపై ఎనలేని మక్కువ ఏర్పరచుకొని, లాంతరు వెలుతురు మధ్యన పుస్తక పఠనం కొనసాగించి ఎన్నో విషయాలపట్ల జ్ఞానం పొందుతూ ఉండటాన్ని, ఇంటి ప్రక్కనే ఉన్న క్రైస్తవ పెద్దమనిషి గమనించి, ఆయన తండ్రి గోవిందరావునొప్పించి, 1841లో స్కాటిష్ మిషన్, పూణేలో నడుపుతున్న పాఠశాలలో చేర్పించగా తదుపరి విద్యాభ్యాసం అక్కడ ఆంగ్లంలో కొనసాగింది.

13 సంవత్సరాల వయసులోనే తొమ్మిది సంవత్సరాల వయసు కలిగిన సావిత్రిబాయి పూలే వివాహమాడి, తన విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత, తన కుటుంబ వ్యాపారమైన పూల వ్యాపారం ప్రారంభించారు. ఉన్నప్పటినుండే పుస్తక పఠనం ద్వారా మానవ హక్కుల ప్రాథమిక సూత్రాలపై జ్ఞానం పొంది, తను అభిమానించే నుంచి చత్రపతి శివాజీ, జార్జ్ వాషింగ్టన్ లా జీవిత చరిత్ర ఈ ప్రభావం వలన దేశభక్తి, నాయకత్వ గుణాలు అలవాటయ్యాయి. తామస్ రచించిన మానవ హక్కులు అనే పుస్తకం అతని ఆలోచనలను ఎంతగానో ప్రభావితం చేసిందని చెప్పవచ్చు. అలాగే అమెరికా స్వాతంత్ర్య పోరాటం పూలేను ప్రభావితం చేయడమే కాకుండా మానవత్వపు విలువలు అయిన స్వేచ్ఛ సమానత్వం గురించి లోతుగా ఆలోచింపజేసింది.


తన బాల్యంలోనే బ్రాహ్మణ కులానికి చెందిన సదాశివ బిలాల్ గోవింద్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి జీవితకాలం స్నేహంగా మారింది. ఆ చొరవతోనే మిత్రుడు ఆహ్వానం మేరకు 1848లో బ్రాహ్మణ కుటుంబంలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరై బీసీ 'మాలి' కులానికి చెందినవాడు కావడం మూలంగా కులవివక్షతకు గురయ్యాడు. ఆక్షణం నుండి కులవివక్షతపై పోరాడాలని నిర్ణయించుకొని బ్రాహ్మణులను విమర్శించడమే గాకుండా సమాజంలోని వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, జ్ఞాన సంపదను అందరికీ అవకాశం ఇవ్వక పోవడానికి అభ్యంతరం తెలుపుతూ, కుల వివక్షత, అంటరానితనంపై పోరాడి సమసమాజ నిర్మాణానికి పూనుకోవడం జరిగింది. సమాజంలో స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజాభివృద్ధి జరగదని భావించి, ముందు స్త్రీలకు అక్షరజ్ఞానం నేర్పాలనే తలంపుతో తన భార్య సావిత్రిబాయి పూలేను పాఠశాలకు పంపడం జరిగింది.1848లో బాలికలకోసం పాఠశాలను ప్రారంభించి అన్ని కులాల వారికి అవకాశం కల్పించారు. కానీ అందులో బోధించడానికి గురువులు ముందుకు రాకపోవడంతో తానే బోధకుడిగా చేరారు. తర్వాత ఆర్థికపరమైన ఇబ్బందులతో కొంతకాలం పాఠశాలను నిర్వహించలేక మూసివేసిన, కొద్ది కాలంలోనే తన మిత్రులు గోవింద్ వల్వేకర్ ల సహాయంతో మరల ప్రారంభించడం జరిగింది. అనతి కాలంలోనే 1851-52 లో మరో రెండు పాఠశాలలను ప్రారంభించి మరింత మందికి విద్యను చేరువచేశారు. ఆసమయంలోనే బ్రిటిష్ ప్రభుత్వం ప్రాథమిక విద్య పై చూపిన నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ విమర్శించడం జరిగింది. 1853 లో వితంతు మహిళల అనాథ శిశువుల కోసం సేవా సదనం ప్రారంభించి, ఈ సమాజం పట్ల తన సేవా తత్వాని చాటుకున్న మహనీయులు. అలాగే 1864లో బాలహత్య, ప్రతిబంధక్ గృహ స్థాపించి చిన్నారులపట్ల తనప్రేమను చాటుకుంటూ, వితంతువుల అయిన గర్భిణీ స్త్రీలకు అండగా నిలుస్తూ వారికోసం ప్రత్యేక గృహాలను ఏర్పాటు చేయడం ఆయనకే దక్కింది. దేశంలో ఇటువంటి కార్య కలాపాలకు పూనుకున్న మొదటి వ్యక్తి అనడంలో ఎలాంటి అనుమానం అక్కరలేదు. అంటరానితనం విచ్చలవిడిగా అమలవుతున్న సమయంలో, బడుగు,బలహీన వర్గాల ప్రజలు అస్ప ృశ్యతకు గురవుతున్న సమయంలో 1868న తన ఇంటి వద్దనున్న స్నానాలతొట్టి వద్ద స్నానం చేయడానికి అంటరాని వారిగా భావించబడే ప్రతి ఒక్కరికి వాడుకోవడానికి అవకాశం కల్పించి, తన మానవీయతను చాటుకున్నారని చెప్పవచ్చు.

1869 లో పౌరోహిత్యం యొక్క బండారం అనే పుస్తకాన్ని రచించి, బ్రాహ్మణుల వైఖరిని ఎండగడుతూ, నిమ్న వర్గాల ప్రజలను చైతన్య పరుస్తూ, సమానత్వం, సమాన అవకాశాలు, మనిషిని మనిషిగా చూసే సమాజం కోసం తన పోరాట స్ఫూర్తి కొనసాగిస్తూ వచ్చారు.1872లో తాను స్థాపించిన దేశంలో మొట్టమొదటి బాల హత్య ప్రతిబందక్ గృహ నుంచి 1872లో ఒక బ్రాహ్మణ వితంతువుకు జన్మించిన కుమారుని దత్తత తీసుకోని ఆదర్శప్రాయులుగా నిలుస్తూ, యావత్తు సమాజాన్ని ఆలోచింప చేయడానికి కృషి చేశారు. శూద్రులను బ్రాహ్మణుల భారీ నుండి కాపాడుటకు 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక సమాజాన్ని స్థాపించి కార్యక్రమాలలో భాగంగా దేశంలో మొట్ట మొదటగా సంస్కరణోద్యమానికి తెరలేపారని చెప్పవచ్చు. ఈ సంస్థలో చేరిన ప్రజలందరూ పురోహితులు అవసరం లేకుండా దేవుళ్ళను పూజించడానికి దోహదపడ్డారు. అలాగే 1877లో 'సత్యశోధక సమాజం' తరపున దీనబంధు అనే వార పత్రికను ప్రారంభించి, తాముచేసే, చేయబోయే కార్యకలాపాలతో పాటు, ఉత్తేజాన్ని కల్పిస్తూ, చైతన్యం చేసేటటువంటి సమాచారాలతో పాటు, ఎలాంటి అణిచివేతకు గురవుతున్నారో అక్షరాల సహాయంతో యుద్ధాన్ని తలపించే విధంగా ఉపయోగపడిందని చెప్పవచ్చు.

సమాజంలో అంటరానితనంతో పాటు మూఢాచారాలు,ఆర్థికసమస్యలతో నిమ్నవర్గాల ప్రజలు అష్టకష్టాలు పడుతూ, ఆధిపత్య కులాల కారణంగా అణచివేతకు గురవుతున్న సందర్భంలో అన్యాయాలను చూడలేక చైతన్యపరచడంలో అతిప్రధానమైన అంశం విద్యను అందించి, పరిపూర్ణ జ్ఞాన వంతులను చేయడమని కాంక్షించి, ఆనాడు దానికితగిన సౌకర్యాలు లేకపోవడం, అలాంటి వాతావరణం కలుగనీయకుండా అడ్డుపడిన, పట్టుదల,ధైర్యంతో ఒక్కడై ప్రారంభించి, తదనంతరం విత్తనంతో పెద్ద చెట్టు అయినట్టు అలాంటి సేవాతత్వ భావజాలం కలిగిన అనుచరులు, మిత్రులను సంపాదించి, ఒక్కొక్క సమస్య నిర్మూలనకు ఒక వ్యవస్థను ఏర్పాటుచేస్తూ, ప్రణాళికాయుతంగా అమలు పరుస్తూ, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంతో ఎదుర్కొంటూ పీడిత ప్రజల పక్షాన నిలుస్తు, అండగా ఉండటంతోపాటు తర్వాత జరిగిన పలురకాల మార్పులకు బాటలువేసే విధంగా ఆదర్శప్రాయుడుగా నిలిచారు అనడంలో ఎలాంటి ఆవాస్తవం లేదు.

తన గులాంగిరి, పూనే సత్యశోధక సమాజ నివేదిక, తృతీయ రత్న, చత్రపతి శివాజీ,రాజ్ భోంస్లే యాలన్ , విద్యా కథాతిల్ , బ్రహ్మన్ పంతొజి లాంటి రచనలుచేస్తూ యావత్తు సమాజం నివ్వెరపోయే విధంగా ప్రేరణకలిగిస్తూ తనతోపాటు తనజీవిత భాగస్వామి అయిన సావిత్రిబాయి పూలేకు సైతం సమాజాన్ని ఒక కుటుంబంగా పరిచయం చేయడం, అణచివేతకు గురయ్యే ప్రజలను పిల్లలుగా భావించేటట్లు చేసి, మనసులో సేవాతత్వాన్ని రంగరించిపోసి, ఇరువురు తమ జీవితాలను సమసమాజ నిర్మాణంకోసం ధారపోసి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలుస్తూ, నేటికీ ఆదరించ బడుతున్నారు అంటే కారణం కేవలం వారి నిస్వార్థ, నిష్పక్షపాత, సేవాతత్వం గుణాలే కారణమని చెప్పక తప్పదు.

కాలక్రమేణా పరిణామక్రమంలో భాగంగా సామాజిక పరివర్తన చెందుతూ ఉన్నదంటే దాని వెనకాల చరిత్రయొక్క ప్రాధాన్యత ఎంతో సంతరించుకొని ఉంటుంది. ఒక విషయంపట్ల పోరాటంచేసి విజయం సాధించాలంటే చరిత్రలోకి వెళ్లి అలాంటి విజయాలను పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిస్థితులకు తగినట్లుగా నిర్ణయాలు తీసుకుంటూ, దాన్ని ఆధారం చేసుకుని ప్రణాళికాయుతంగా అడుగులు వేస్తూ పలు విషయాలలో విజయకేతనం ఎగురవేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఎ కార్యాన్ని తలపెట్టిన గతంలో దానివి జయాపజయాలను బేరీజు వేసుకుని తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటూ ముందుకు వెళ్లడం జరుగుతుంది. అంటే ఇక్కడ చరిత్ర యొక్క ప్రాధాన్యత ఏం మేరలో ఉపయోగపడుతుందో అర్థంకాక మానదు. ఇదే కాకుండా ఒక వ్యక్తి యొక్క నిస్వార్థత, నిబద్ధత, పట్టుదల, సామాజిక సేవ, ధైర్యం, పోరాటపటిమ లాంటి ఎన్నో గుణాలు పలువురికి అర్థమవుతాయి. కావున చరిత్రను కనుమరుగు చేయకుండా, విద్యలో భాగంగా పాఠ్యాంశాలలో చేర్చి, విద్యార్థుల ఆలోచన వైఖరిలో సకారాత్మకమైన మార్పు తేవడానికి పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆనాడు బహుజనులను చైతన్య పరచుటకు ఇలాంటి మహానుభావులు తమజీవితాలను అంకితంచేసి పోరాడి వారికంటూ సమాజంలో గుర్తింపు తెచ్చిన తరువాత నేడు అ జ్ఞానాన్ని తమ స్వార్థపూరిత ఆలోచనలతో వివిధ వర్గాలకు పాల్పడి తమ స్వంత లాభార్జనకై అగ్రవర్ణాల వంతు పాటపాడుతూ రాజ్యాధికారానికి దూరం అవుతున్నారని చెప్పవచ్చు. కావున ఒక్కసారి అలాంటి మహనీయులను కలుసుకొని వారి జీవితాలను చదివి అడుగుజాడల్లో నడవాలని కోరుకుందాం.




- డా. పోలం సైదులు
9441930361

# డొనాల్ జాన్ ట్రంప్ వివాదాస్పద జీవితం - గెలుపోటముల సమ్మిళితం



రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త, మీడియా పర్సనాలిటీ, రచయిత అయిన డొనాల్ జాన్ ట్రంప్ జీవితం ఆద్యంతం జయాపజయాల సమ్మిళితం. పడిన ప్రతి సారి నూతనోత్తేజంతో ఆకాశమంత ఎత్తు ఎగిరే విచిత్ర, వివాదాస్పద తత్వం ట్రంప్ది. 70వ ఏట 2017-21 మధ్య అమెరికా 45వ అధ్యక్షుడిగా సేవలు అందించిన డొనాల్ ట్రంప్, నేడు తన 78 ఏండ్ల వయస్సులో రెండవ సారి అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అత్యంత వయస్సు కలిగిన యూఎస్ అధ్యక్షుడిగా రికార్డు నెలకొల్పుతూ తన ప్రజాదరణతో పాటు ప్రత్యేకతను చాటుకున్నారు.




**బాల్యం, విద్యాభ్యాసం:**

ఫ్రెడ్రిక్ క్రిస్ట్ (ఫ్రెడ్) ట్రంప్-మేరీ అన్నేమాక్లియార్డ్ ట్రంప్ దంపతులకు 14 జూన్ 1946న న్యూయార్క్ క్వీన్స్లో మధ్య తరగతి కుటుంబంలో ఐదుగురి సంతానంలో 4వ సంతానంగా (మెరిసాన్నే, ఫ్రెఢ జూనియర్, ఎలిజబెత్, రాబర్ట్) జన్మించారు. తండ్రి 'ఫెడ్ ట్రంప్' రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పేరు గడించారు. బాల్యంలో డొనాల్ ప్రవర్తన విచిత్రంగా, సమస్యాత్మకంగా ఉండేది. అతి చురుకుదనంతో కీవ్-ఫారెస్ట్/సందేహం స్కూల్-మ్యాన్హట్టన్ పాఠశాల్లో ఇతరులతో ఇమడడం కష్టంగా ఉండేది. డొనాల్ ట్రంప్ ప్రవర్తనకు విసిగిపోయిన తండ్రి ఫ్రెడ్ ట్రంప్ మరో మార్గం దొరక్క డొనాల్ ట్రంప్ క్రమశిక్షణారాహిత్యాన్ని గాడిలో పెట్టడానికి న్యూయార్క్ మిలటరీ అకాడమీలో చేర్పించారు. మిలటరీ అకాడమీలో క్రమశిక్షణను మెరుగుపరుచుకొని విద్యార్థి నాయకుడిగా, క్రీడాకారుడిగా పేరు తెచ్చుకున్నాడు. తన మోకాలి ఎముకల సమస్యతో వియత్నాం యుద్ధంలో పాల్గొనడానికి అర్హత కోల్పోయారు. పాఠశాల విద్య తర్వాత పోర్డమ్ యూనివర్సిటీ, పెన్సిల్వేనియా యూనివర్సిటీల్లో చదివి 1968లోఎకనమిక్స్ బాచిలర్స్ డిగ్రీ పొందారు.

**రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ట్రంప్ సంస్థల సామ్రాజ్యం:**

డిగ్రీ అనంతరం తండ్రి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చేరి మెలకువలు నేర్చుకొని, మాన్హట్టన్ ప్రాంతంలో తనదైన శైలిలో ఆకాశహర్మ్యాలు నిర్మించి మంచి రియల్ ఎస్టేట్ డెవలప్పర్గా పేరు గడించారు. అనతి కాలంలోనే న్యూయార్క్ సిటీలో సర్వాంగ సుందరంగా గ్రాండ్ హయత్ హోటల్, ట్రంప్ టవర్స్, ట్రంప్ వరల్ టవర్, ట్రంప్ ఇంటర్నేషనల్ లాంటి అనేక ఆకాశహర్మ్యాలను విజయవంతంగా నిర్మించి తనదైన ముద్ర వేశారు. శ్వేత జాతి అమెరికన్లకు మాత్రమే పరిమితం అంటూ సంపన్నులకు విలాసవంతమైన గృహాలను నిర్మించి వివాదస్పదంగా మారారు. 2003-15 మధ్య ట్రంప్ నిర్వహించిన ది అప్రెంటిస్, ది సెలబ్రిటీ అప్రెంటిస్ అనే రెండు టీవీ రియాలిటీ షోల ద్వారా తన కంపెనీలో ఉద్యోగాల ఎంపిక కార్యక్రమం విజయవంతంగా నడిపి అందరు అమెరికన్ల ఆదరణను పొందారు. గృహ సముదాయాలు, ఆకాశహర్మ్యాలు, హోటల్స్, క్యాసినోలు, గోల్ఫ్ కోర్సులు, అందాల పోటీలు(మిస్ యూఎస్ఏ, మిస్ టీన్ యూఎస్ఏ), పలు బ్రాండెడ్ ఉత్పత్తుల రంగాలతో తన ట్రంప్ ఆర్గనైజేషన్స్ బ్రాండ్ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ, అత్యంత సంపన్నుడిగా ఖ్యాతి గడిస్తూ విలాసవంచమైన జీవితాన్ని గడిపారు, నేడు గడుపుతున్నారు.

**వివాదాలు, విలక్షణతలు తన ప్రత్యేకతలు:**

తన సోదరుడు జూనియర్ ఫ్రెడ్ తాగుబోతుగా మారి అకాల మరణం చెందడంతో చలించిన డొనాల్ ట్రంప్ తన జీవితాంతం ఆల్కహాల్, పొగ తాగనని ప్రతినబూనారు. డొనాల్ ట్రంప్ సహ-రచయితగా ది ఆర్ట్ ఆఫ్ ది డీల్, థింక్ లైక్ ఏ చాంపియన్, ది ఆర్ట్ ఆఫ్ ది కమింగ్ బ్యాక్ లాంటి పుస్తకాలు రచించారు. తన వ్యాపార జీవితంలో పలు మార్లు తన కంపెనీలు దివాళా తీయడం, అధిక నష్టాలపాలు కావడం, ఆర్థికంగా చితికిపోవడం, బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరించడం, పన్నుల ఎగవేత, నిధుల దుర్వినియోగం లాంటి పలు కష్టనష్టాలను దాటుకుంటూ పడిన చోటే లేచి నిలబడి తన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నిలదొక్కుకున్నారు. 2015లో తన వ్యక్తిగత అకడమిక్ వివరాలను బహిర్గతం చేయవద్దంటూ తాను చదివిన పాఠశాలలు, కాలేజీ బోర్డులను హెచ్చరించడం కూడా ట్రంప్కే చెల్లింది. రిపబ్లికన్ అధ్యక్షుడిగా రెండు సార్లు గెలిచిన డొనాల్ ట్రంప్ 2001-09 మధ్య డెమెక్రాటిక్ పార్టీలో, 2011-12 మధ్య స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయాల్లో పనిచేశారు. తొలి దశలో అధ్యక్షుడిగా పలు కుంభకోణాలు, పక్షపాత దోరిణిలు, విచారణలు, అక్రమ లైంగిక సంబంధాలు లాంటివి ఎదుర్కొని అత్యంత వివాదస్పద అధ్యక్షుడిగా 'అన్ప్రెసిడెంటెడ్ (తనదైన కొత్తదనం)' అని పిలువబడ్డారు.

ముగ్గురు భార్యలతో (ఇవానా జెలినికోవా(1977-90), మర్లా మాపిల్స్(1990-99), మెలానియా నాస్(2005 నుంచి నేటి వరకు) సంసారం చేసిన ట్రంప్కు ఐదుగురు (డొనాల్ జూనియర్, ఇవాంకా, ఎరిక్, టిఫెనీ, మరియానె బారాన్) సంతానం ఉన్నారు.


20 జనవరి 2025 రోజున అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన డొనాల్ ట్రంప్ 2.0 అమెరికా ఫస్ట్, అమెరికా ది గ్రేట్ అగైన్, ఇక స్వర్ణయుగమే, మూడవ ప్రపంచ యుద్ధం వద్దు, అక్రమ వలసలపై ఉక్కుపాదం, ఉగ్రవాద సంస్థల మెడపై కత్తులు అంటూ చేసిన ప్రసంగం రానున్న రోజుల్లో నిజం కావాలని 78 ఏండ్ల టెంపర్ ట్రంప్కు శుభాకాంక్షలు తెలియజేద్దాం.

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## రాజ్యాంగమా.. మా ప్రాణమా!



జయహో జయహో భారత రాజ్యాంగమా
జయహో జననీ భారతి మా ప్రాణమా
శాంతి సత్యం త్యాగం తథాగత తత్వమా
సమత మమత జనతా నీ చిరునామా..




అంబేద్కర్ సృష్టించిన హక్కుల అమృత భాండమా
సంబరమే కొని తెచ్చిన సర్వజన నేస్తమా
మనువాదం గుండెలపై పేలిన రణ నినాదమా
జనవాదం విన్పించగ జయ భేరి నాదమా
'రాజు'ను ఓడించిన ఓ యుద్ధ తౌత్రమా
'ప్రజ'నే రాజును చేసిన అక్షర శాసనమా
ప్రజాస్వామ్య పరిరక్షణ అర్జున గాండీవమా
ప్రజ స్వేచ్ఛా స్వాతంత్రముల అంబరమా
డెబ్బై ఐదేళ్ల ఘన చరిత నీదేనమ్మా
శత కోటి జన భారతి జేజేలమ్మా
మా హక్కుల కనుపాపల కాపాడగ నీవమ్మా
ఈ పాలకుల పాపాలు కడుగగ రావమ్మా
జయహో జయహో భారత రాజ్యాంగమా
జయహో జననీ భారతి మా ప్రాణమా
**(భారత 76వ గణంత్రదినోత్సవం నేపథ్యంలో)**

- వై. నరసింహులు
సెల్: 9398212217

# ఆచరణీయం భారత రాజ్యాంగం


1950 జనవరి 26 న అమలులోకి వచ్చిన మన రాజ్యాంగం నేడు ఇతర దేశాలకు ఆదర్శమవుతోంది. రాజ్యాంగం లోని ప్రతి పదం ఎంతో ఉన్నతమైనవి. ముఖ్యంగా భారత దేశాన్ని లౌకిక రాజ్యంగా ప్రకటించడం అనేది అపూర్వం. నేడు మన పొరుగు రాజ్యాలు మత రాజ్యం గా ఉంటున్న తరుణంలో భారత్ లో మత సామరస్యం వెల్లి విరియుట చూస్తున్నదే. అందుకే భారత దేశం లో అనేక మతాలు పుట్టుకొచ్చాయి. మతాలకు పుట్టినిల్లు భారత్.సోదర భావం భారత్ లో మిక్కుటం. అన్ని మతాల వారు ఎంతో సఖ్యతగా మసలుకుంటారు. అందుకే భారత్ ను ప్రతి దేశం కొనియాడుతూ ఉంటాయి. రాజ్యాంగంలో కూడా భారత్ ను సర్వసత్తాక,సామ్య వాద, ప్రజాసామ్య, లౌకిక, గణ త్రంత రాజ్యంగా కీర్తించారు. ఇందులో ఒక్కో పదం ఒక్కో అర్థం ను సూచిస్తుంది. సర్వసత్తాక అంటే... సొంత బలం కలిగి ఉండి ఇతర దేశాలపై ఆధార పడుకుండ ఉండటం.ఏ ఇతర దేశాల అజమా యుషి లేకుండా స్వతంత్ర 0గా మసలుకోవడం, ఏ దేశ నియంత్రణకు లోనుకకుండా ఉండటం. సొంత విదేశీ విధానం అనుసరించటం ముఖ్యం.సామ్య వాదం అనగా.. దోపిడీ వ్యవస్థ లేని రాజ్యం, ప్రతి వారు సొంత పని కలిగి ఉండటం. ప్రజా స్వామ్యం అనగా.. ప్రజలే పాలకులుగా ఉండి ప్రభుత్వానికి తొడ్పాటు నందించటం, భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరు గడించటం. ఇక లౌకిక అంటే ఇంతకు ముందు చెప్పినట్లు మత ప్రమేయం లేని రాజ్యం. మతం చాలా సున్నితమైన విషయం. మత సామరస్యం మనకు కావాలి కాని మత మౌఢ్య0 ఉండరాదు. గణత్రంత అనగా.. దేశాధినేత అయినా రాజు ప్రజలచేత పరోక్షంగా ఎన్నిక కావడం. వంశపారాంపర్య విధానం భారత్ లో లేదు. ఏ రాజకీయ పదవి అయినా ఎన్నిక ద్వారా అధికారం చేపట్టవలసిందే. అందుకే భారత్ గణత్రంత దేశం అయింది. ఈ అంశాలన్నీ 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చడం జరిగింది. (42 వ రాజ్యాంగ సవరణనే మినీ రాజ్యాంగ సవరణ అంటారు )రాజ్యంగా పిత డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ నేతృత్వం లో ఏర్పడిన రాజ్యంగా ముసా యుదా కమిటీ వివిధ దేశాల రాజ్యాంగ అమలు తీరు పరిశీలించి, పరిశోధించి ఏ అంశాలు అయితే భారత్ దేశానికి అనుగుణంగా ఉంటాయో, ఏవి పరిపాలనకు అనువుగా ఉంటాయో కూలంకషంగా చర్చించి రాజ్యాంగంలో పొందుపరచటం జరిగింది.నేడు ప్రతి అంశం రాజ్యాంగానికి అనుగుణంగానే కొనసాగుతావుంది.అయితే భారత రాజ్యాంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని, సమూలంగా మార్చాలని కేంద్రం లోని భారతీయ జనతా పార్టీ భావిస్తోంది.రాజ్యాంగాన్ని మార్చాలి అంటే పెద్ద కస రత్తే చేయాలి. రాజ్యాంగ మూలం దెబ్బ తినకుండా సవరణ చేయాలి. అప్పుడే అందరూ హర్షిస్తారు. కొన్ని అంశాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయనే విమర్శ ఉంది. ఉదాహరణకు మణి పూర్ లో హింస రాజ్యాంగ వ్యతి రేకం అనే ధోరణి కనిపిస్తావుంది. సామ్య వాద సూత్రాలు అసలు ఏ కోశానా అమలులో లేవు. అవినీతి, నిరుద్యోగం పెరిగిపోతావుంది.అయినా భారత్ లో పరిపాలన వ్యవస్థ పటిష్టంగా ఉంది. కొన్నిటిని అమలు చేయాలి అంటే వయ్య ప్రయాసలు ఉంటాయి. సువిశాల భారతవని లో వనరులు ఉన్నా అలసత్వం బాగా పెరిగింది. అయితే ఒక్కటి మాత్రం చెప్పవచ్చు. భారత్ శాంతికాముక దేశం స్వాతహగ దాడి చేయదు. మరో దేశాన్ని ఆక్రమించదు. రాజ్యాంగం ప్రకారమే నడచుకుంటుంది. ఇతర దేశాలు అవి పొరుగున ఉన్నవి కావొచ్చు, ఇతర ఖండ దేశాలు కావొచ్చు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోదు. మానవతా దృక్పథం తో ఆదుకుంటుంది. ఇది భారత రాజ్యాంగంలో ఇతర దేశాల పట్ల ఉన్న గౌరవభావం.ప్రతి ఏడాది గణ తంత్ర వేడుకలకు విదేశీ నేతలను భారత్ కు ఆహ్వా నించడం అన వాయితి. ఎప్పటిలా ఈ సారి ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవ్ సుబియం భారత్ కు రాబోతున్నారు. ఒక ఘనతంత్రం వేడుకలకు విదేశీ నేతలను పిలువడం భారత్ లోనే మొదలు. అది భారత్ కు విదేశాల తో ఉన్న సంబంధం. ప్రతి దేశాన్ని గౌరవ భావంగా చూస్తుంది.మంచి సంభంధాలు నెరపుతుంది.




రష్యా, ఉక్రైన్ యుద్ధం, గాజ లో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఆగి పోవాలని మనసారా కోరుకుంటుంది. విశ్వం శాంతిగా ఉండటమే భారత్ కోరుకునేది. కొన్ని అంశాలు రాజ్యాంగం ప్రకారం కాక పోయినా, చాలా వరకు రాజ్యాంగం కు అనుకూలంగానే భారత్ నడచుకుంటుంది. అందుకే భారత రాజ్యాంగం ఆచరణీయం అని ప్రతి దేశం విశ్వషిస్తూవుంటాయి. మనది చాలా పెద్ద రాజ్యాంగం. దీని గుర్తు ఇంద్రుని వాహనం అయిన ఐరావతం. ఐరావతం అనగా ఏనుగు అని అర్థం. భారత్ రాజ్యాంగం దృఢమైనది కాబట్టి ఐరావతం తో పోల్చారు. భారత్ వంటి రాజ్యాంగం విశ్వం లో ఎక్కడా లేదు.నేడు ప్రపంచ దేశాలకు స్ఫూర్తి భారత దేశమే.

- కనుమ ఎల్లారెడ్డి
93915 23027

ఎడిట్ పేజీ కోసం మీ మీ వ్యాసాలు, సామాజిక విశ్లేషణలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
– ఎడిటర్



## కర్షకుడి వ్యథ

మట్టికింద సేద్యగాడు
దాచిపెట్టుకున్న ఆశల
గుండె
ఆగి ఆగి కొట్టుకుంటున్న
శబ్దం
వినపడుతున్నప్పుడల్లా
కాపాడుకుంటున్న నేల
ప్రాణం
ఆగిపోతుందన్న దిగులు
రైతును మెతుకు
ముట్టనివ్వదు .
మట్టికి అతడు తోడు
అతనికి మట్టీ మరియూ
పైరు తోడు !
నీరందని నేలతో
దిగులు చెలక
దుఃఖపు చెలిమి !!

- మండాది గోపీనాథ్
సెల్ - 9885045344

# అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- జాబితాల్లో పేర్లు లేని వారి నుండి మళ్లీ దరఖాస్తుల స్వీకరణ
- ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం
- ఎమ్మెల్యే విజయరమణ రావు





**సుల్తానాబాద్, జనవరి 21 (మనం న్యూస్):** అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ అన్నారు.సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ప్రజా పాలన గ్రామ సభకు ఎమ్మెల్యే విజయరమణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ ప్రజాపాలన గ్రామసభల్లో చదివిన జాబితాల్లో వివిధ పథకాల కింద పేర్లు రాని అర్హులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అధికారులు దరఖాస్తులపై తక్షణమే విచారణ జరిపి వారిని ఎంపిక చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణ రావు స్పష్టం చేశారు. దరఖాస్తు దారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గత బీఆర్ఎస్ సర్కార్ పదేళ్ల తమ పాలనలో ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందించిన పాపాన పోలేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు దశల వారిగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, రూ. 500 లకే వంట గ్యాస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 10 లక్షలకు పెంపు, ఇండ్లకు ఉచిత కరెంటు వంటి పథకాలను ఇప్పటికే అమలు చేయడం జరిగిందని, ప్రస్తుతం కొత్తగా ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నెలకు రూ1 వెయ్యి చొప్పున వారి ఖాతాల్లో జమ, పంటలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పెంపు వంటి సంక్షేమ పథకాలను ఈనెల 26 నుండి అందించడం జరుగుతుందని, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. ఈ విషయంలో ఎలాంటి అవినీతికి, అనుమానాలకు తావు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. తమ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, సన్నవడ్ల కు రూ.500ల చొప్పున బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలిచిందని అన్నారు. ఇలాంటి ఏ సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయని బీఆర్ఎస్ రైతు దీక్షల పేరిట మొసలి కన్నీరు కారుస్తోందని ఎమ్మెల్యే విజయరమణ రావు ధ్వజమెత్తారు. 10 ఏళ్ల పాటు ప్రజలను మభ్యపెట్టి, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అధోగతి పాలు చేసిన ఆ పార్టీ అగ్రనాయకత్వం ఆత్మ పరిశీలన చేసుకోకుండా ఆందోళనలు చేయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గొల్లపల్లి గ్రామంలో తాను ఇచ్చిన హామీ మేరకు సిసి రోడ్లను నిర్మిస్తున్నామని, గ్రామానికి త్వరలోనే బస్సు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, దాన్నాయక దామోదర్ రావు, చిలుక సతీష్, జాని, శ్రీగిరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి రమేష్, పన్నాల రాములు, సంపత్ రావు, సందీప్, రాజు, రాజీ రెడ్డి, ఎంపీడీవో, ఎమ్మార్వో, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్యానల్ ఇన్స్పెక్షన్

**సుల్తానాబాద్, జనవరి 21 (మనం న్యూస్):** సుల్తానాబాద్ మండలం గర్రపల్లిలో తెలంగాణ మోడల్ స్కూల్ పెద్దపెల్లి జిల్లా మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్ ప్యానల్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. (పర్యవేక్షణ బృందం) మంగళవారం పాఠశాల నిర్వహణ, పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజన నిర్వహణ, మౌలిక వసతులతో పాటు గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు, ఉపాధ్యాయుల బోధన అభ్యసన ప్రక్రియ విధానం, విద్యార్థుల ప్రతిభను, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. జులాగే తగు సూచనలను సలహాలను ఇవ్వడంతో పాటు పాఠశాల నిర్వహణ విధానం పట్ల ప్యానెల్ బృంద సభ్యులు ఈ. రాజ్ కుమార్, ఎండి. శాదుల్, పి. సదానందం, ఎల్. సత్యనారాయణ, డాక్టర్ సంతోష్ కేసరి, జి. శ్రీనివాస్, గర్రెపల్లి ప్రిన్సిపాల్ గోల్డీ బల్బిర్ కౌర్ పాఠశాల నిర్వహణ విధానం పట్ల అభినందనలతో పాటు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పానెల్ ఇన్స్పెక్షన్ బృందం చేతుల మీదుగా విద్యార్థులకు హౌస్ యూనిఫారమ్స్ పంపిణీ చేశారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన సంజన



**జైపూర్, జనవరి 21 (మనం న్యూస్):** రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని మంగళవారం మండల అధికారులు అభినందించారు. జైపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఈసం సంజన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఎంపిక అయింది. జనవరి 22 నుండి 24 వరకు ఖమ్మంలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని ప్రధాన ఉపాధ్యాయులు నాగోతు శ్యాంసుందర్ సిరంగి గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో ముందుంటూ క్రీడల్లో తన ప్రతిభను చాటుతున్నారని అన్నారు. ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో సంజన తన ప్రతిభను కనబరిచి ఎంపికైందని తెలిపారు.

ఈ సందర్భంగా ఆమెను తహసీల్దార్ వనజ రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీ ఓ శ్రీపతి బాపూరావు, ఎస్సై శ్రీధర్, ఎం బి ఓ బోనగిరి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు అందరూ కలిసి అభినందించారు. క్రీడలతోపాటు చదువులో ముందుండాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు.

## ప్రజా పాలన గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీఓ

- జాబితాలో పేర్లు రాని వారు దరఖాస్తు చేసుకోవాలి



**జైపూర్, జనవరి 21 (మనం న్యూస్):** జైపూర్ మండల కేంద్రంలోని మొత్తం 20 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజా పాలన గ్రామ సభలు ప్రారంభం అయినట్లు మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మండలంలోని పెగడపల్లి గ్రామంలో మంగళవారం ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ హాజరు కాగా జనవరి 21 నుండి 24వ వరకు ప్రజా పాలన గ్రామసభలు జరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడి నాలుగు రకాల ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. జాబితాలో కొందరి పేర్లు చేర్చలేదని స్థానికులు ఆరోపించగా జాబితాలో పేర్లు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్, పంచాయతీ కార్యదర్శి పావని, కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, ధనాల మహేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పల్లె నిద్ర కార్యక్రమం

- సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్సై



**జైపూర్, జనవరి 21 (మనం న్యూస్):** సైబర్ నేరాల పట్ల గ్రామ ప్రజలకు ఎస్సై శ్రీధర్ అవగాహన కల్పించారు. సోమవారం రాత్రి జైపూర్ మండలంలోని రామారావు పేట గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సైని గ్రామస్తులు ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ మేరకు ఆయన ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వారికి అవగాహన కల్పించారు. యువకులతో స్నేహభావం పెంచుకొని మత్తు పానీయాలకు యువత దూరంగా ఉండాలని తన లక్ష్యాన్ని ముందు ఉంచుకొని విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. గ్రామంలోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకునే దళారుల మాటలు నమ్మకూడదని మహిళలు బాలబాలికల పై నేరాల గురించి సైబర్ మోసాల బారిన పడకూడదని అపరిచితుల కాల్స్ లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు ఎవరికి చెప్పకూడదని ప్రజలకు అవగాహన కలిగించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. శ్యామ్ కుమార్‌తో పాటు రాజ్ కుమార్ లు గ్రామ యువకులకు స్పాన్సర్ గా అందజేసిన వాలీబాల్ కిట్ ను ఎస్సై యువతకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెద్దల బాపు, ఉప సర్పంచ్ వెంకటేశం, మండల నాయకులు నామాల తిరుపతి, నామాల నాగరాజు, యూత్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, గ్రామ పెద్దలు యువత తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 21(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ జిల్లా 2025 క్యాలెండర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కడారి ఐలయ్య, రాష్ట్ర కోశాధికారి కాల్వ శ్రీనివాస్ యాదవ్, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మా యాదవ్, దుండ్ర రాజన్న యాదవ్, జిల్లా కార్యదర్శి గీతాంజలి యాదవ్, బుస అంజన్న యాదవ్, జిల్లా అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండువేని రాజులు కరీంనగర్ ప్రెస్ భవన్లో క్యాలెండర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో సొసైటీలలో ఏడు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు కూడా ఎన్నికలు పూర్తిస్థాయిలో జరగలేదు ఒకేసారి అన్ని గ్రామ సొసైటీలలో ఎన్నికలు జరిపించి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు చైర్మన్ పదవులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ ఈ ప్రభుత్వము చేస్తామని చేయలేదని, వెంటనే 80% సబ్సిడీతో గొర్రెల కొనుగోలు చేసి ఇప్పించాలని ప్రభుత్వ పథకాలు అన్ని వర్తింప చేయాలని, గొల్ల కురుమలకు 50 సంవత్సరాల వారికి 6000 పెన్షన్ ఇవ్వాలని దేవాదాయ చైర్మన్ పదవులు గొల్ల కురుమలకు కేటాయించాలని సర్పంచ్, జెడ్పిటిసి, ఎంపిటిసి గొల్ల కురుమలు అధిక సంఖ్యలో గ్రామాలలో గెలిపించుకోవాలి 18 శాతం ఉన్న గొల్ల కురుమలకు రాజకీయంగా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రిజర్వేషన్స్‌లో అవకాశాలు కల్పించాలని మండల కేంద్రాలలో కమిటీ హాలు నిర్మాణ స్థలముతో పాటు భవనాలు నిర్మించి ఇవ్వాలి, మాంస విక్రయాలు సంతలు ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 559 జీవో నెంబర్ 1000 లను సవరించి ప్రతి గ్రామాన 5 ఎకరాల భూమి గొర్రెల మేతకు కేటాయించాలని, ఫారెస్ట్ అధికారులు మేతకు అనుమతులు ఇవ్వాలని, గొల్ల కురుమలు ప్రమాదవశాత్తు చనిపోతే బీమా 10 లక్షలు చెల్లించాలని, ఈ కార్యక్రమంలో మంచాల రవీందర్ యాదవ్, సందవేని ప్రసాద్ యాదవ్ జంగ కొమురయ్య యాదవ్, గజ్జి ఐలయ్య, మండే రాజు యాదవ్, బండి మల్లన్న యాదవ్, ఆవుల మల్లేష్ యాదవ్, కడారి రాయుడు, నల్లంగి కొమురయ్య, మర్రి వెంకట మల్లు, జంగ తిరుపతి యాదవ్, నన్నవేని కొమురయ్య యాదవ్, బండ అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ అచ్చివ్మెంట్ సర్వేలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



**గంభీరావుపేట, జనవరి 21 (మనం న్యూస్):** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల చదువుతున్న 36 మంది విద్యార్థులు ఇటీవల భారత కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన, నేషనల్ అచీవ్మెంట్ సర్వే లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని వివిధ గ్రామాలలో ని పాఠశాలలో విద్యా ప్రామాణికతను తెలుసుకోవడానికి నిర్వహించిన పరీక్షలలో డిగ్రీ విద్యార్థులను ఇన్విజిలేటర్ గా నియమించారు. వీరు తమ సమర్థతతో తమకు అప్పజెప్పిన పనిని సమర్థవంతంగా నిర్వహించారు. వీరికి కళాశాలలో నస్ స్టేట్ కోఆర్డినేటర్ జె. మనోహర్ రెడ్డి, డిస్టిక్ కోఆర్డినేటర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి చేత ఒక్కొక్కరికి 3000 రూపాయల చొప్పున గౌరవ వేతనం అందించడం జరిగింది.

వీరిని కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక బృందం అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల వలన డిగ్రీ విద్యార్థులకు పాఠశాల విద్యా విధానం, సమాజం పట్ల అవగాహన కలుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పిఓ పాక ధర్మపురి ఐక్యూ ఏసీ ఆర్డినేటర్ డాక్టర్ వై. ఆంజనేయులు, టీఎస్ కేసి కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్, డాక్టర్ ఆది విష్ణువుతోపాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## నేడు మంచిర్యాల కౌన్సిల్ సభ్యులకు, కో ఆప్షన్ సభ్యులకు వీడ్కోలు సమావేశము




**మంచిర్యాల, జనవరి 21(మనం న్యూస్):** మంచిర్యాల మున్సిపాలిటీ, ప్రస్తుత కౌన్సిల్ పదవీ కాలము ఈ నెల 26 తేదీతో ముగుస్తునందున నేడు బుధవారము ఉదయము 11.30 గంటలకు మంచిర్యాల కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సభ్యులకు, కో ఆప్షన్ సభ్యులకు వీడ్కోలు సమావేశము నిర్వహించబడుచున్నదని మంచిర్యాల పురపాలక సంఘం చైర్ పర్సన్ రావుల ఉప్పలయ్య, మంచిర్యాల కమిషనర్ ఎ. మారుతీ ప్రసాద్‌లు తెలిపారు.

# 9వ వార్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్ ఏర్పాటు



**మంచిర్యాల, జనవరి 21(మనం న్యూస్):** మంచిర్యాల మున్సిపాలిటీ 9వ వార్డు ఆండాలమ్మ కాలనీలో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈ వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత కిషన్ ప్రారంభించారు. లోఓల్టేజ్ సమస్య విషయంలో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వార్డు ప్రజలు కౌన్సిలర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ఎడ్ల మల్లేష్, జక్కుల కుమార్, మహేందర్ రెడ్డి, తిరుపతి, స్వామి, రసీదు, లడ్డు ప్రజలు పాల్గొన్నారు.

# బీసీ ఉద్యమంలో మహిళలు భాగస్వామ్యం కావాలి

- సావిత్రిబాయి పూలే అభినందన సభలో బీసీ నాయకులు పిలుపు



**మంచిర్యాల, జనవరి 21(మనం న్యూస్):** బీసీ ఉద్యమంలో మహిళల పాత్ర ఉండాలని, చట్టసభలలో మహిళల రిజర్వేషన్ కూడా సాధించాలని, సమాజంలో సగభాగమైన స్త్రీలను కూడా సామాజిక రాజకీయ ఆర్థిక రంగాలలో ఎదగాలని బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా నాయకులు అన్నారు. మంగళవారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా శ్రీహర్ష డిగ్రీ కాలేజీలో 2025 సంవత్సరానికి గాను సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీతలైన మంచిర్యాల జిల్లాకు చెందిన అలేఖ్య, ఆడెపు శ్యామల లను ఘనంగా సత్కరించడం జరిగింది. బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా నాయకులైన వడ్డేపల్లి మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము తీసుకోవస్తున్న చట్టసభల్లో మహిళ బిల్లులో కూడా బీసీ మహిళల శాతం ఎంతో తేల్చాల్సిన అవసరం ఉన్నదన్నారు. దేశవ్యాప్త కుల జనగణలో బీసీలకు అన్యాయం చేస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలలో ఆత్మగౌరవం కాపాడడం కోసం చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ చేయాలని బీసీ రాజ్యాధికారం కోసం జరుగుతున్న ఉద్యమంలో మహిళలు కూడా కలిసి రావాలని, న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాల పైన పోరాటం చేస్తు, ఉస్మానియా యూనివర్సిటీలో బీసీ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాల పైన పోరాటం చేసిన అడ్వకేట్ అలేఖ్యకు ఈ అవార్డు రావడం చాలా సంతోషదాయకమని అన్నారు. అదేవిధంగా రాజకీయరంగంలో తన వృత్తి ధర్మమైన నర్సువృత్తులో కూడా సమాజంలో, మంచి ప్రతిభ కనబరిచిన 2014 నుంచి బీసీ ఉద్యమంలో పని చేసిన ఆడపు శ్యామలకు ఈ అవార్డు రావడం సంతోషదాయకమని అన్నారు. ఈ స్ఫూర్తితోనే సమాజంలో మహిళలు ఎదిగి బీసీ ఉద్యమంలో కదిలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు డాక్టర్ రఘునందన్, సీనియర్ అడ్వకేట్ కర్రే లచ్చన్న, మాజీ మాజీ మార్కెటింగ్ చైర్మన్, పల్లె భూమేష్, గౌడ సంఘం నాయకులు, రాజేశ్వరం గౌడ్, బీసీ జేఏసీ నాయకులు గుమ్ముల శ్రీనివాసు, గజ్జెల్లి వెంకటయ్య, వివిధ రంగంలో ఉన్న బీసీ నాయకులు అడ్వకేట్ నటేశ్వర్ గోపతి లక్ష్మణ్, వేముల మల్లేష్, ఎం.డి లతీఫ్, పెద్దల చంద్రకాంత్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ఇందల్ రాథోడ్, ఓయూ జేఏసీ నాయకులు చర్ల వంశీ, రాళ్ల బండి రాజన్న, రామగిరి రాజన్న చారి, మెండ మల్లేష్ యాదవ్, బండి రాజలింగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**గంభీరావుపేట, జనవరి 21 (మనం న్యూస్):** గంభీరావుపేట మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా బర్కటం తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా శనిగరపు నరేష్, ఉపాధ్యక్షులుగా జోగు జగన్, ఇరిగి సందీప్, అక్కి మహిపాల్, కార్య దర్శులుగా ఇరిగి పర్శ రాములు, గద్దల గణేష్, సంయుక్త కార్యదర్శులుగా గుండెల్లి కళ్యాణ్, పంగా బాలరాజు, ప్రచార కార్యదర్శిగా కుడెల్లి భరత్ కుమార్ లను నియమించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు అవునూరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఎలాగందుల బిక్షపతి, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు కనపురం లక్ష్మన్, జిల్లా నాయకులు మంగలి చంద్రమౌళి, ఇరిగి బాను, ఎర్రోళ్ల శంకర్‌తో పాటు వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



**కొండపాక, జనవరి 21, మనం న్యూస్:** అర్హత ఉన్న వారందరిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కొండపాక మండలం దర్గా గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 వ తేదీ వరకు మూడు రోజులు ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు ఫీల్ వెరిఫికేషన్ చేయడం జరిగిందన్నారు. వెరిఫికేషన్ జాబితాను గ్రామ సభలలో సభ్యులకు వినిపించి అనర్హులు, అర్హత ఉండి జాబితాలో లేని వారి గురించి ఏర్పాటు చేసిన కౌంటర్లో దరఖాస్తులను స్వీకరించి మళ్లీ ఫీల్ వెరిఫికేషన్ చేసి తుది జాబితాను రూపొందించడం జరుగుతుందన్నారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు ఈజీఎస్లో కూలీలుగా పనిచేసి భూమిలేని రైతు కూలీలను ఎంపిక చేసి సంవత్సరానికి 12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ఇవ్వడం జరుగుతుందని, వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించి రైతు భరోసా కింద సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయలు చొప్పున అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా వ్యవసాయ యోగ్యం కాని భూములకు రైతు భరోసా ఇవ్వడం కుదరదని తెలిపారు. ఇల్లు లేని వారిలో సొంత ఇంటి స్థలం ఉండి, నివాసానికి యోగ్యం కాని ఇండ్లలో ఉంటున్న వారు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ఫీల్ వెరిఫికేషన్ చేసి లిస్టు తయారు చేయడం జరిగిందని



ఆ లిస్టులో పేరు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులందరికీ ప్రాధాన్యత క్రమంలో ఇండ్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దిలీప్ నాయక్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి

**మిరుదొడ్డి, జనవరి 21, మనం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో ఎన్.ఆర్.ఈ.జీఎస్ నిధులు రూ.5 లక్షలు, వీరారెడ్డిపల్లి గ్రామంతోపాటు బండమల్లన్న దేవాలయా వద్ద రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలతోపాటు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుకుగా నడుస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న నాలుగు గ్యారంటీల్లో ప్రజలు భాగస్వాములై సంక్షేమ పథకాలు అందుకోవాలని సూచించారు. కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అక్బర్ పేట భూంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు వెంకట్ స్వామి, ప్రతాప్ తోపాటు తదితరులు ఉన్నారు.

# పోలీస్ బందోబస్తు మధ్య గ్రామసభ





**నంగునూరు, జనవరి 21, మనం న్యూస్:** అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇండ్లను మంజూరు చేయాలని గ్రామ సభలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. నిజమైన లబ్ధిదారులకు, నిరుపేదలకు ఇవ్వకుండా అధికారులు నాయకులు తమ ఇష్టానుసారం తమకు అనుకూలంగా ఉన్న వారికే ఇస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నాడు మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఆత్మీయ భరోసా పథకాలపై తహసిల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రేషన్ కార్డుల లిస్టును గ్రామపంచాయతీ కార్యదర్శి చదవగా అందులో నిజమైన నిరుపేదలకు ఇవ్వకుండా ఇందిరమ్మ ఇల్లు కూడా ఒక్కో ఇంట్లో ఇద్దరు ముగ్గురు చొప్పున అధికారులు తమ ఇష్టానుసారం లిస్టు తయారు చేయడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు నాయకులకు ఎవరు అనుకూలంగా ఉంటే వారి పేర్లే లిస్టులో వచ్చాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించాలని అధికారులకు సూచించారు. డిపిఓ, తాసిల్దార్ లు మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులందరికీ పథకాలను అందే విధంగా చూస్తామన్నారు. అలాగే లిస్టులో పేర్లు రానివారు గ్రామపంచాయతీ లో ఏర్పాటుచేసిన కౌంటర్లలో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ దేవకీదేవి హౌసింగ్ అధికారితో పాటు ఏఈవో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- స్పెషల్ ఆఫీసర్ గణేష్ రామ్



**మిరుదొడ్డి, జనవరి 21, మనం న్యూస్:** ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పథకాలు అమలు చేయడం జరుగుతుందని స్పెషల్ ఆఫీసర్ గణేష్ రామ్ అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని అందె, లింగుపల్లి గ్రామాలలో అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి, మోతె గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు విన్నవించారు. రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమ పేర్లు రాలేదని అధికారులపై మండిపడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అర్హులైన నిరుపేదలకు కాకుండా భూమి ఉన్న వారి పేర్లే నమోదు చేయడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అర్హులైన వారి జాబితాను తయారు చేసి అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను వేడుకున్నారు. అనర్హుల పేర్లు రావడంతో అధికారులకు, గ్రామస్తులకు కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, అర్హులై ఉండి తమ పేరు రాని వారు దరఖాస్తు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గణేష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఏఓ మల్లేశం, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పై శ్రీనివాస్ రెడ్డి విమర్శలు హాస్యాస్పదం

- ఏ హోదాతో శంకుస్థాపనలు చేస్తున్నారో తెలపాలి
- బీ.ఆర్.ఎస్. నాయకులు

**మిరుదొడ్డి, జనవరి 21, మనం న్యూస్:** దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేతిలో డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్ నాయకులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అక్బర్ పేట భూంపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రవి అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రోటోకాల్ లేకున్నా కొబ్బరికాయలు కొడుతూ నీతులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రజల పన్నులతో, ఉపాధి హామీతో మంజూరైన పనులకు ఏ హోదాలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నోరు తెరిస్తే చెరుకు ముత్యం రెడ్డి పేరు చెబుతూ ప్రోటోకాల్ ఉల్లంఘించి ముత్యం రెడ్డికి మాయని మచ్చ తెస్తున్నాడని మండిపడ్డారు. కరువు కాటకాలతో ఉన్న తెలంగాణలో గోదావరి జలాలు పారించి సస్యశ్యామలం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకుంటే అడుగడుగునా అడ్డుకున్న చరిత్ర శ్రీనివాస్ రెడ్డిదని ఎద్దేవా చేశారు.
ఇదేవిధంగా నోరు జారితే బిఆర్ఎస్ నాయకులు చూస్తూ ఊరుకోమన్నారు. ఈ సమావేశంలో మండల బిఆర్ఎస్ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, కైలాస్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, సురేష్, శ్రీను, పర్శరాములు, బిక్షపతి తదితరులు ఉన్నారు.



## విద్యాభివృద్ధిలో మండలాన్ని ఆదర్శంగా నిలుపుదాం

- ఎం.ఈ.ఓ. సత్తయ్య

**కొండపాక, జనవరి 21, మనం న్యూస్:** విద్యారంగంలో కుకునూరుపల్లి మండలాన్ని ఆదర్శంగా నిలుపుదామని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరు పల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఓ. మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని అంశాల్లో గుణాత్మకమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కనీస సామర్థ్యాలతో పాటు పరిశీలనాత్మక బోధన సాగాలన్నారు. సమాజ భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తల్లిదండ్రుల సమావేశాలను పకడ్బందీగా నిర్వహించి పిల్లల సామర్థ్యాలను చూపించాలన్నారు. అపార్ కార్డులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. ఇంగ్లీష్ పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించిన రవీందర్ ను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ , సి ఆర్ పి సంతోష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పోలీస్ బందోబస్తుతో గ్రామసభలు



- అర్హులందరికీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



**దౌల్తాబాద్, జనవరి 21, మనం న్యూస్:** అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయాలని గ్రామ సభల్లో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అధికారులు గ్రామాలలో నిరుపేదలను గుర్తించి లబ్ధిదారులకే ఇందిరమ్మ గృహాలను ఇవ్వాలని సూచించారు. మంగళవారం మండల పరిధిలోని లింగరాజు పల్లి, ముత్యంపేట మహ్మద్ షాపూర్, కోనాపూర్, కోనాయిపల్లి తదితర గ్రామాలలో పోలీస్ బందోబస్తుతో గ్రామసభలను నిర్వహించారు. ముత్యంపేట గ్రామంలో ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ గ్రామసభలో పాల్గొని లబ్ధిదారులకే పథకాలను అందజేస్తామని గ్రామ సభలో మాట్లాడారు. వ్యవసాయం లేని కూలీలు 2023-2024 సంవత్సరంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు కూలి పని చేసే వారికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం 12 వేల రూపాయలు వర్తిస్తుందని తెలియజేశారు. గ్రామసభలో ఎంపిక చేసిన లబ్ధిదారులకే పథకాలను అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి సాయి కిరణ్, ఎం పి ఓ గఫూర్ ఖాద్రి, డిప్యూటీ తాసిల్దార్ జహీర్ ఎస్.ఐ. శ్రీరామ్ ప్రేమ్ దీప్, ఏఎస్ఐ సాయిలు తోపాటు పంచాయతీ కార్యదర్శులు వ్యవసాయ విస్తరణ, స్పెషల్ ఆఫీసర్లు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# బదిర విద్యార్థిని ఉన్నత చదువుకు ప్రభుత్వం అండ

- రూ. లక్ష 40 వేల చెక్కును అందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**సిరిసిల్ల, జనవరి 21(మనం న్యూస్):** జిల్లా సమీకృత కార్యాలయంలో మంగళవారం బదిర విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన దోమకొండ లహరి తండ్రి పోచయ్య. ఈమె కరీంనగర్ జిల్లాలోని బధిరుల పాఠశాలలో 10వ తరగతి వరకు చదివారు. ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దృష్టిలోకి వచ్చింది. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థి వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష 40 వేల ఆర్థిక సహాయాన్ని సీఎం ఆర్ఎఫ్ సహాయం కింద పంపింది. మంగళవారం దోమకొండ లహరికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చెక్కు అందజేశారు. ఉన్నత విద్య అభ్యసించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ కూతురు చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం, సహకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు దోమకొండ లహరి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అర్హులందరికీ పథకాలు అందించేందుకే గ్రామసభలు

- కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్ బ్యూరో, జనవరి 21 (మనం న్యూస్):** అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రభుత్వ పథకాల అమల్లో భాగంగా జిల్లాలోని చొప్పదండి మండలం భూపాలపట్నం, రామడుగు మండలం మోతే గ్రామాల్లో, కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డులో నిర్వహించిన గ్రామ, వార్డు సభలకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలో ఏర్పాటుచేసిన వార్డు సభలో మాట్లాడుతూ అర్హులై ఉండి జాబితాలో పేరు లేని వారు దరఖాస్తులను గ్రామ వార్డు సభల్లో సమర్పించాలని సూచించారు. అధికారులు దరఖాస్తుల రిజిస్టర్ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. ప్రస్తుతం గ్రామసభలో ప్రకటించిన జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని అన్నారు. ప్రజలు ఏ పథకం కోసం అయినా తెల్లకాగితంపై దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ప్రజా పాలన సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తు సమర్పించవచ్చని అన్నారు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేరు చేర్చేందుకు కూడా గ్రామసభలో దరఖాస్తు చేయవచ్చని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, కొత్తపెల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, ఏఈఓలు పాల్గొన్నారు.

## లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని

- ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి



**గంభీరావుపేట, జనవరి 21 (మనం న్యూస్):** గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత గంభీరావుపేట, లింగన్నపేట సందర్శించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణంలో ఉన్న భవనాలను తొందరగా పూర్తి చేయాలని భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు సూచించినారు. ప్రాథమిక కేంద్ర వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్య కార్యక్రమాలలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమం, ఎన్సీడీలో క్యాన్సర్, రక్తపోటు, మధుమేహ నమోదు కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు కార్యక్రమంలపై దిశా నిర్దేశం చేసినారు. ఈ కార్యక్రమంలో గంభీరావుపేట వైద్యాధికారులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డిపిఓ రాజేందర్, డి డి ఎం కార్తీక్ పాల్గొన్నారు.



# నకిలీ వీసాలతో మోసం చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు

**జగిత్యాల ప్రతినిధి, జనవరి 21 (మనం న్యూస్):** గల్ఫ్ పంపిస్తానని అమాయకులను మోసం చేస్తూ నకిలీ ఏజెంట్లు నిరుపేదల దగ్గర కొట్టేస్తూ పబ్లిక్‌గా తిరుగుతున్నట్లు ఏజెంట్ పై కేసు పెట్టిన బాధితుడు చివరకు నెగ్గాడు. న్యాయం గెలిచింది గల్ఫ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకొని నకిలీ వీసా ఇచ్చి మోసం చేసిన కేసులో నిందితుడికి 3 సంవత్సరాలు జైలు శిక్ష 1000 రూపాయల జరిమాన విధిస్తు జగిత్యాల జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాగోజిపేట గ్రామానికి చెందిన రాపల్లి నాగేష్ కు నిజామాబాద్ జిల్లా, పిప్పరి మండలం, భీమ్ గల్ గ్రామానికి చెందిన ఎగోలము మనోజ్ కుమార్‌తో దుబాయ్‌లో పరిచయం ఏర్పడింది. మనోజ్ తన దగ్గర దుబాయి దేశానికి చెందిన అలికో కంపెనీకి చెందిన వీసాలు ఉన్నాయని నమ్మించి రాపల్లి నాగేష్ అదే గ్రామానికి చెందిన మరో ఆరుగురు దగ్గర ఒక్కొక్కరి దగ్గర 40,000 రూపాయల చొప్పున మొత్తం 2,40,000/- రూపాయలు తీసుకొని నకిలీ వీసాలు ఇచ్చినట్లు న్యాయస్థానం ముందు రుజువయింది.. తమకు ఇచ్చిన వీసాలు నకిలీవని గమనించిన రాపల్లి నాగేష్ మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా నిందితుడు ఎగోలము మనోజ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు కేసు విచారణలో భాగంగా జడ్జి పావని జుడీష్యల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, సాక్షులను విచారించిన అనంతరం నిందితుడు మనోజ్ కుమార్ కు 3 సంవత్సరాలు జైలు శిక్ష 1000 రూపాయల జరిమానా విధించారు. ఈ కేసులో ఏపీపీగా ప్రణయ్ కుమార్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా ఎస్సైలు శ్యామ్ రాజ్, వెంకటేశ్వర్ రావు,
ఎస్సై శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ మహేశ్వర్, నిందితునికి శిక్ష పడడంలో గౌరవ కోర్టుకు సాక్షాధారాలు అందించడంలో తీవ్రంగా కృషి చేశారని ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# హృదయం ఉప్పొంగిన క్షణం

- ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల ఆనందభాష్పాలు



**సుల్తానాబాద్ జనవరి 21 (మనం న్యూస్):** పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు జాబితాలో తన పేరు ఉండి తన సొంతింటి కళ నెరవేరబోతుంది అని నిరుపేద వికలాంగురాలు వాలకట్ల భూమమ్మ ఆనందభాష్పాలతో ఇందిరమ్మ రాజ్యానికి మరియు ఎమ్మెల్యే విజయరమణ రావుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

# సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- మద్దుకూరు గ్రామసభలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి
- ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మకండి
- ఇటుక బట్టీలు బ్రిక్స్ కంపెనీలు ఇతర కమర్షియల్ భూములకు, రైతు భరోసా వర్తించదు
- వలస ఆదివాసీలకు విద్యా వైద్యం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం



**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 21 (మనంప్రతినిధి):** సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. మంగళవారం చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ సభలలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు, అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు.

ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. ఇటుక బట్టీలు బ్రిక్స్ తయారీ కంపెనీలు, ఇతర కమర్షియల్ భూములకు రైతు భరోసా వర్తించదని ఆయన తెలిపారు. ఎవరైతే తిరిగి మళ్లీ ఆ భూముల్లో వ్యవసాయం చేస్తారో అప్పుడు వారికి కూడా రైతు భరోసా కల్పిస్తామన్నారు.అదే విధంగా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా కనీసం 20 రోజులు ఉపాధి హామీ పథకంలో పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పిస్తామని వచ్చే దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ అన్నారు. వలస ఆదివాసీల అభివృద్ధి కోసం విద్యా వైద్యం ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఆదివాసీలు పోడు పేరుతో అడవులు నరక వద్దని, నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, తహసిల్దార్ బి.సంధ్యారాణి, ఎంపీడీవో బి. అశోక్, సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## డిప్లొమా ఫలితాల్లో యస్.బి.ఐ.టి విద్యార్థుల విజయ దుందుభి

**ఖమ్మం, జనవరి 21(మనం న్యూస్):** స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు ప్రకటించిన డిప్లొమా ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలలో యస్.బి.ఐ.టి. కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలను సాధించారు. సి.యస్.సి. విభాగము నుండి 4 గురు, ఈ.సి.ఈ., విభాగము నుండి 3 గురు, ఈ.ఈ.ఈ. నుండి 2 విద్యార్థులు 9.8 మార్కులు సాధించారు. సి.యస్.సి. నుండి 11 మంది, ఈ.సి.ఈ., నుండి 7 గురు, ఈ.ఈ. ఈ. నుండి 4 గురు విద్యార్థులు 9.5 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి, ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, డాక్టర్ జె. రవీంద్రబాబు, డాక్టర్ యస్. శ్రీనివాసరావు, ఏ.ఒ. జహారుద్దీన్, అధ్యాపకులు అభినందనలు తెలియజేసారు.



## సమగ్ర జాతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



- రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కొత్వాల

**పాల్వంచ, జనవరి 21(మనం న్యూస్) :** తెలంగాణా రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా సాగిస్తున్నదని రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణా ప్రభుత్వం ఈ నెల 26 తేదీ నుండి అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక కోసం వార్డు సభలు చేపట్టడం జరిగింది. మొదటిరోజు మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 1 వార్డు గడియకట్ట, 2 వార్డు పాత పాల్వంచ, 3 వార్డు నవభారత్, 4 వార్డు సీతారాంపట్నం, 5 వార్డు సబ్ స్టేషన్ ఏరియా, 6 వార్డు వడ్డుగూడెం ప్రాంతాల్లో జరిగిన వార్డు సభల్లో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ఆరు గ్యారంటీలను ప్రకటించిందని, వాటిలో ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విధ్యుత్ వంటి పథకాలను నిర్విఘ్నంగా అమలు చేస్తున్నదన్నారు. ఇటీవల రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆదరించాలని కొత్వాల కోరారు.

కొత్వాలను సన్మానించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు వార్డు సభల సందర్భంగా ఆయా ప్రాంతాల మహిళలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొత్వాల ను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమీషనర్ కె సుజాత, మేనేజర్ ఎల్ వీ సత్యనారాయణ, డీ ఈ స్వరూపారాణి, ఏ ఈ రాము, టీ పీ ఓ నవీన్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ ఖిఃఖః ఆచార్యులు, కందుకూరి రాము, దారా చిరంజీవి, చింతా నాగరాజు, వాసుమల్ల సుందర్ రావు, డిష్ నాగేశ్వరరావు, అజిత్, వజ్జల రాము, మాలోత్ కోటి నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య గ్లోబల్ విస్తా స్కూల్లో ఉడాన్ క్రీడలు ఆరంభోత్సవ వేడుకలు:

ఖమ్మం, జనవరి 21(మనం న్యూస్)ః స్థానిక పుట్టకోట రోడ్డున గల ఆరు ఎకరాల సువిశాల ప్రాంగణంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్తా స్కూల్లో ఉడాన్ క్రీడల ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య, పాఠశాలల డి.జి.యం చేతన్ మాథుర్ ఈ సందర్భంగా పోస్టర్ను విడుదల చేశారు. ఈ నెల 24, 25 తేదీలలో జరగనున్న ఈ ఓపెన్ ఉడాన్ క్రీడోత్సవాలకు ముఖ్యఅతిధిగా ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడకారిని, అర్జున ఆవార్డు గ్రహీత కుమారి సిక్కిరెడ్డి విచ్చేయుచున్నారు. ఓపెన్ టోర్నమెంట్లో భాగంగా భారీ మొత్తంగా క్రీడాకారుల్లో బాస్కెట్ బాల్, టెన్నిస్, వాలీబాల్, చెస్, కారమ్స్, అథ్లెటిక్స్ లలో సభ్యత్వం నమోదు చేసుకోగా, ఇంకా మిగిలిన ఉత్సాహవంతులు పాల్గొనవచ్చునని విద్యాసంస్థల యాజమాన్యం తెలిపినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జయసుధ, శ్రీచైతన్య కళాశాల ఏ.జి.యం. బ్రహ్మం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఐఐటి, జేఈఈ ప్రవేశాల ఆన్లైన్ కోచింగ్ తీసుకుంటున్న
- విద్యార్థినులకు నిపుణులతో గైడెన్స్ అందించాలి
- కళాశాల ప్రాంగణంలో ప్రతి బ్యాచ్‌కు గుర్తుగా మొక్కలు నాటాలి
- డా. బి.ఆర్. అంబేద్కర్ సెంటినరీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ఖమ్మం, జనవరి 21(మనం న్యూస్):** విద్యార్థినులు విద్యావకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, స్థానిక డా. బి.ఆర్. అంబేద్కర్ సెంటినరీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాలలో డిజిటల్ ల్యాబ్ లో ఆన్ లైన్ ద్వారా ఐఐటి, జేఈఈ వంటి వివిధ పోటీ పరీక్షలకు అందిస్తున్న శిక్షణను పరిశీలించి, కళాశాలలో మౌళిక సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఐఐటి, జేఈఈ ప్రవేశాలపై ఆన్లైన్ కోచింగ్ తో పాటు వివిధ కెరియర్ గైడెన్స్ పై విద్యార్థులకు నిపుణులచే అవగాహన కల్పించాలని, అదే విధంగా పోటీ పరీక్షలకు అందిస్తున్న శిక్షణలో కూడా నిపుణులను ఏర్పాటు చేసి పిల్లలకు మెరుగైన అవగాహన అందేలా చూడాలని తెలిపారు. కళాశాలలో మౌళిక సదుపాయాల కల్పన విషయంలో కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్లు సరిపోను ఉన్నట్లు, త్రాగునీటికీ ఇబ్బంది లేదని, కిచెన్ రూమ్ వర్షానికి కురుస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో జిమ్ సామాగ్రి నీడలో ఏర్పాటు చేయాలని, పిల్లలు వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. కళాశాల కాంపౌండ్ చుట్టూ గ్రీనరీ ఉండే విధంగా మొక్కలు నాటాలని, ప్రతి విద్యార్థుల బ్యాచ్ కు గుర్తుగా కిచెన్ గార్డెన్ లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కళాశాలలో ఎక్కడైనా విద్యుత్ లూజ్ వైర్లు ఉంటే గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. కళాశాలలో చేపట్టాల్సిన మరమ్మత్తులు, సౌకర్యాల విషయమై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆడపిల్లలకు గతంలో చదువుకునే అవకాశం ఉండేది కాదని, ప్రస్తుతం ఉన్న విద్య అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు.మనం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ప్రతి రోజు గుర్తుకు తెచ్చుకోవాలని, జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగిన తర్వాత మనం మరో 10 మందికి మార్గదర్శనం చేస్తూ, వారు ఎదిగేలా సహాయ సహకారాలు చేయాలని అన్నారు . మంచి ఆహారం తీసుకుంటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం కలెక్టర్, శిక్షణా సహాయ కలెక్టర్ లు విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. జిల్లా కలెక్టర్ తనిఖీ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, అధ్యాపకులు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## గుర్తింపు లేని మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీల మోసాల బారిన పడకండి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- అప్రమత్తతే ఆయుధం.. సైబర్ నేరాల బారినపడి మోసపోకుండా జిల్లా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి




**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 21 (మనంప్రతినిధి):** మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలపై అలర్ట్ గా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బిరుదురాజు రోహిత్ రాజు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు, హెర్బల్, హెల్త్ కేర్, ఇతర గృహోపకరణాల మార్కెటింగ్ పేరుతో కొత్త తరహా మోసాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఇస్తామని మళ్లీ మల్టీ లెవెల్ మార్కెటింగ్ (పిరమిడ్ మోసాలు) మళ్ళీ ప్రారంభమయ్యాయని అన్నారు. గొలుసుకట్టుగా అమాయకులను వల వేసి మోసం చేస్తున్నారని హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఈ విధమైన మోసాలకు కొంతమంది వ్యక్తులు పాల్పడుతున్నారని,అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ తరహా మోసాల బారిన పడకుండా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తతతో వ్యవహరించాలని కోరారు.

విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, రకరకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి,ప్రజల నుండి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి,వారితో మరికొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త టెక్నిక్ లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారు. ఇలాంటి స్కీం లలో తొలుత చేరిన తక్కువ మందికి లాభాలు చూపించి, మిగిలిన అందరి సొమ్ము కొల్లగొడతారని తెలిపారు. ఇలాంటి నూతన స్కీం ల పట్ల, నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.మనకు ఎటువంటి సంబంధం లేని వాళ్ళు మనకు ఏ విధమైన ఆర్థిక ప్రయోజనం ఊరికే చెయ్యరనే విషయాన్ని గ్రహించాలని తెలిపారు.మనల్ని నమ్మించి,మభ్యపెట్టి, వంచించి మన దగ్గరి,మన ద్వారా మరికొందరి కష్టార్జితాన్ని కొల్లగొట్టడమే మోసగాళ్ల పని అని తెలిపారు.

కాబట్టి ఇలాంటి నేరాల పట్ల మొబైల్ ఫోన్లను చూసే మనకు ఫేస్ బుక్,వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, ఈ-మెయిల్, ఫోన్ కాల్ ల ద్వారా మీ దృష్టిని ఆకర్షించే ఇటువంటి కుట్రలకు ఎట్టిపరిస్థితుల్లో లొంగవద్దని తెలుప్పారు.తొందరపడి బాధలను,నష్టాలను కొని తెచ్చుకోవద్దన్నారు.ఒకవేళ మీరు అన్ని జాగ్రత్తలను తీసుకున్నా కూడా మోసపోయిన పక్షంలో ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్ కి గానీ, డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు.సైబర్ క్రైం.జిఒవి.ఇన్ ద్వారా కానీ లేదా మీ సమీప పోలీస్ స్టేషన్ లో నైనా వెంటనే పూర్తి వివరాలతో ఫిర్యాదు చెయ్యాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడిన బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేయగలిగితే అంత త్వరగా వారు కోల్పోయిన నగదును తిరిగి పొందవచ్చని తెలిపారు.

## ప్రతి దరఖాస్తులను ఆన్లైన్ చేస్తాం

తహశీల్దార్ సునీల్ కుమార్ రెడ్డి,

కురవి, జనవరి 21( మనం న్యూస్)ః రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం అధికంగా దరఖాస్తులు అధికంగా వచ్చాయని తహశీల్దార్ సునీల్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలు తండాల్లో అధికారులు దరఖాస్తుల స్వీకరణకు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఆయా గ్రామ పంచాయతీ ఆఫీసులోనే ఉన్నట్లు తాసిల్దార్ సునీల్ కుమార్ తెలిపారు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్ పర్యవేక్షణ చేసినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేస్తామని తెలిపారు. మూడు రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ ః ఎంపిడిఓ మండల అభివృద్ధి అధికారి కే వీరబాబు, ఎంపీ ఓ గౌస్, పాల్గొని దరఖాస్తులను స్వీకరించి పేర్కొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ అత్యధికంగా రేషన్ కార్డులు కొరకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నేడు రేపు ఎల్లుండి మూడు రోజులు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు. రెవెన్యూ ఉద్యోగులు పంచాయతీరాజ్ ఏఈలు ఏపీవోలు ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సభలలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**మహబూబాబాద్, జనవరి 21(మనం ప్రతినిధి) :** ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. మహబూబాబాద్ మండలం సంద్రాల్లగూడెం, బలరాం తండ గ్రామ పంచాయతీలలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో విడుదల చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలు ప్రజల నుండి సేకరిస్తూ నమోదు చేస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. అర్హులై ఉండి పేరు రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారు మండల కేంద్రాల్లో గాని కలెక్టరేట్లో కానీ తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికి పథకాలు అమలుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు, ఈ కార్యక్రమలో ప్రత్యేక అధికారి జెడ్.పి. సీఈ ఓ పురుషోత్తం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

- సంక్షేమ పథకాల పంపిణీలో రాజకీయలొద్దు...
- సీఎం రేవంత్ రెడ్డి కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక దృష్టి....
- త్వరలో కల్వకుర్తి మున్సిపాలిటీలో డబలు బెడ్ రూం ఇళ్ల పంపిణీ..
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి..





**కల్వకుర్తి జనవరి21(మనం న్యూస్):** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 1వ,15వ వార్డులలో నిర్వహించిన ప్రజా పాలన,వార్డు సభలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు.గత పాలకులు 7.5 లక్షల కోట్ల అప్పు చేశారనీ పేర్కొంటూ ప్రజా ధనం దుర్వినియోగం కావడం వల్ల సంక్షేమ పథకాలు కుంటుపడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి మున్సిపాలిటీలో గతంలో నిర్మించిన డబులు బెడ్ రూం ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు.కల్వకుర్తి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని తాను ప్రత్యేకంగా మంత్రులను కలిసి అదనంగా మరో 1000 ఇల్లు మంజూరు చేయించానని అన్నారు.త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను కలిసి మరిన్ని ఇండ్లు మంజూరు చేయిస్తానని తెలిపారు.కల్వకుర్తి మండలంలో 59,054 ఎకరాల భూమికి ఇందిరమ్మ రైతు భరోసా వచ్చిందని పేర్కొన్నారు.గత పాలకులు 7 వేల ఎకరాలకు అప్పనౌగా రైతు బంధుతో పాటు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు.సీఎం రేవంత్ రెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలఅమలులో ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు.త్వరలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకి 12,000/- రూపాయలను రెండు విడుతలుగా అందజేస్తామని తెలిపారు.గత ప్రభుత్వ పాలనలో గుట్టలకు,వెంచర్లకు రైతుబంధు అందజేసి అప్పనంగా ప్రజా ధనాన్ని దుర్వినియోగానికి చేశారని పేర్కొన్నారు.పదేళ్ల టిఆర్ఎస్ పార్టీ పాలనలో ప్రజలకు ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో మున్సిపాలిటీలో అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్ కార్డులను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కల్వకుర్తి మున్సిపాలిటీలో రేషన్ కార్డులకు 2073 మంది దరఖాస్తు చేసుకున్నారని అందులో 397మందికి మొదటి విడతగా రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అర్హులైన లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం,ఆర్డీఓ శ్రీను,మున్సిపల్ కమీషనర్ షేక్ మహమూద్, కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్,కౌన్సిలర్లు బాలునాయక్,రవీందర్,మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు నేరటి చిన్న, షానవాజ్ ఖాన్,చంద్రకాంత్ రెడ్డి,సంతు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలి





- జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కోటానాయక్...
- క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది...
- కల్వకుర్తి మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి..

**కల్వకుర్తి జనవరి21(మనం న్యూస్):** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి కనబరచాలని క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కోటానాయక్,కల్వకుర్తి మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి,లు పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద సేవా బృందం,మై భారత్ జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలతో పాటు కబడ్డీ పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కోటానాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొనడం వల్ల కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహంపై విద్యార్థులకు వివరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దేహదారుఢ్యం పెంపొందుతూనని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్పోర్ట్స్ కిట్స్, ప్రశంస పత్రాలు,మెడల్స్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివ కుమార్,సభ్యులు,కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోయిన విలువైన ఫోనును దొరికిచ్చిన పోలీసులు

- కృతజ్ఞతలు తెలిపిన భద్రు నాయక్

**బాలానగర్ జనవరి 21 (మనం న్యూస్ ):** గత మూడు నెలల క్రితం బాలానగర్ మండలం పెద్దయ్య పల్లి చౌరస్తాలో సుమారు 1,60,000 ఫోను పోవడం జరిగిందని, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని, ఎస్సై తిరుపాజి ఆధ్వర్యంలో విచారణ చేసి దొరికించడం చాలా సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భద్రు నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. విలువైన ఫోను పోవడంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి సుమారు మూడు నెలలు తర్వాత కొడంగల్ ప్రాంతంలోని కర్ణాటక బార్డర్లో పోయిన ఫోనును రాబట్టారని తెలిపారు. మంగళవారం స్థానిక బాలనగర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై తిరుపాజి చేతుల మీదుగా తన ఫోనును స్వీకరించడం జరిగిందని ఆయన వివరించారు. ప్రజలకి ఎన్నో రకాలుగా సేవలు చేస్తున్న పోలీసు సిబ్బందికి భద్రు నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# జగిత్యాల అభివృద్ధే మా ఎజెండా

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల ప్రతినిధి, జనవరి 21 (మనం న్యూస్):** పట్టణ అభివృద్ధే మా ఏకైక ఎజెండాగా తాము పనిచేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. మంగళారం జిల్లా కేంద్రంలోని 11, 12, 29, 30 వార్డులో టీయూఎఫ్ఐడిసి నిధులు 85 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ భూమి పూజ చేశారు. జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపట్ల ప్రత్యేక దృష్టిసారించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. జగిత్యాల పట్టణంలోని 4500 మంది పేదలకు నిర్మించిన నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీని త్వరలో జగిత్యాల మున్సిపాలిటీలో విలీనం చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ..పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కృషి చేస్తున్నారన్నారు. మున్సిపల్ పరిధిలోని 48 వార్డుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ.. ప్రగతి పథంలో ముందుకెళ్తున్నామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చైర్ పర్సన్ సూచించారు. పలు వార్డుల్లో ప్రజలు రేషన్ కార్డులు లిస్ట్లో పేరు రాలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలు మళ్లీ ఫీల్ సర్వేయర్ వార్డు ఆఫీసర్ వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు.

అర్హత గల ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించే ప్రయత్నం చేస్తామని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరినాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు బాలే లత శంకర్, నక్క జీవన్, పంబాల రాము, దుర్గయ్య, నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, దుమాల రాజకుమార్, మేక పవన్, మేనేని ప్రవీణ్ రావు, ఎఇ శరన్, కౌన్సిలర్లు, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు



- కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం..

**కల్వకుర్తి జనవరి21(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం పేర్కొన్నారు.మంగళవారం కల్వకుర్తి మండలంలోని హౌజుగుల గ్రామంలో రేషన్ కార్డులు,రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు,ఆత్మీయ భరోసా పథకాలపై గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో తహసిల్దార్ ఇబ్రహీం మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జాబితా తయారు చేయడం జరిగిందని అన్నారు.గ్రామ సభలో అర్హులైన వారికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నూతనంగా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకకౌంటర్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ,రవూఫ్,వ్యవసాయ శాఖ అధికారి మసూద్,పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య,తదితరులు పాల్గొన్నారు.

## క్యాట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన చైతన్య

# విద్యార్థులకు నగదు పురస్కారం



**కరీంనగర్ టౌన్, జనవరి 21 (మనం న్యూస్):** స్థానిక బోయవాడ శ్రీ చైతన్య విద్యార్థులు నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచి, నగదు పురస్కారం, మెరిట్ సర్టిఫికెట్స్ అందుకున్నారని ఏ జి యం, యం.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ న్యాలకొండ పద్మజ రెడ్డి మాట్లాడుతూ 7మంది విద్యార్థులకు నగదు పురస్కారం, 65 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారని తెలిపారు. అవార్డు గ్రహీతలుగా సంశిత, సహన్ యాదవ్, త్రినైనా, కార్తికేయ, శ్రీనిధి, శ్రీ శ్రేష్ట, అన్విత. వీరంతా క్యాష్ అవార్డు పొందారని, మిగిలిన వారంతా సర్టిఫికెట్స్ పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రవీణ్, పాఠశాల డీన్ విజయకృష్ణ, ఒలంపియాడ్ ఇన్చార్జ్ స్వప్న, జోనల్ పిఈ టీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లబ్దిదారుల గుర్తింపు

**గంగాధర, జనవరి 21 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పథకాలు జారీ కోసం అర్హుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని గంగాధర ఎంపీడీవో ధమ్మని రాము పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చర్లపల్లి(ఆర్), బూరుగుపల్లి, ముప్పిడి నరసింహులపల్లి, గంగాధర, లింగంపల్లి, మధురానగర్, కొండాయపల్లి, నరసింహులపల్లి గ్రామాలలో ప్రజాపాలనలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలకు ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శ్రీకారం చుట్టిందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ జనార్దన్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ వినయ్ కుమార్, ఏఈఓ రమ్య, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్ అసిస్టెంట్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మంచిర్యాల మున్సిపాలిటీలో

# నేటి నుంచి వార్డు సభలు

- మంచిర్యాల మున్సిపాలిటీ కమిషనర్ ఏ మారుతి ప్రసాద్





**మంచిర్యాల, జనవరి 21 (మనం న్యూస్):** రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మొదలగు అంశాలను పరిశీలించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారము మంగళవారం నుంచి ప్రారంభం అయిన సభలు కొన్ని చోట్ల ఉద్రిక్తలు, గొడవలకు దారి తీస్తుండటంతో మంచిర్యాల మున్సిపాలిటీలో ఈనెల నేటి నుంచి 24 వరకు మున్సిపాలిటీ లోని 36 వార్డులలో ఎలాంటి ఉద్రికతలు చోటు చేసుకోకుండా సాఫీగా జరగడానికి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మొదలగు అంశాలను పరిశీలించడానికి వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల మున్సిపాలిటీ కమిషనర్ ఏ. మారుతి ప్రసాద్ తెలిపారు. వార్డు సభ ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం అవుతుందని 22వ తేదీన మున్సిపల్ వార్డు 1 నుంచి 6 వార్డు వరకు, ఇదే తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి 7 వార్డ్ నుంచి 12 వార్డ్ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. అదేవిధంగా 23వ తేదీన వార్డు నెంబర్ 18 వరకు ఉదయం 9 గంటలకు, వార్డు నెంబర్ 19 నుంచి 24 వరకు మధ్యాహ్నం 3 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. ఇక 24వ తేదీన వార్డు నెంబర్ 25 నుంచి 30 వరకు ఉదయం 9 గంటలకు, వార్డు నెంబర్ 31 నుంచి అఖరి వార్డు 36 వరకు మధ్యాహ్నం 3 గంటలకు దరఖాస్తులను స్వీకరిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమీషనర్ కోరారు. ఈ సభల్లో మున్సిపల్ చైర్మన్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ కౌన్సిల్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు పాల్గొంటారని, వార్డుల వారిగా వార్డు సభల వివరాలపట్టిక సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. వివిధ తేదీలతో ఆయా వార్డులలో జరిగే వార్డు సభలలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు వారికి కేటాయించిన తేదీన ఆఫీసర్తో పాటు అందరూ పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


# అర్హులందరికీ తప్పకుండా సంక్షేమ పథకాలు అందించడానికే గ్రామ సభ

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్



**మెట్ పల్లి, జనవరి 21 (మనం న్యూస్):** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసిందని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. మంగళవారం మెట్ పల్లి మండలం జగ్గసాగర్, కొండ్రికర్ల గ్రామాలలో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకే ఈ గ్రామ సభలో ఏర్పాటు చేశారని ఈ గ్రామసభల్లో అర్హులను గుర్తించి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపుతారని అన్నారు. ప్రజల కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమని ఆయన తెలిపారు. ప్రజలు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యం. లింగ రెడ్డి, అధికారులు, కోరుట్ల నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల భరత్ రాజ్, ముద్దం ప్రశాంత్, మెట్ పల్లి పట్టణ వైస్ ప్రెసిడెంట్ సమీర్ సర్కార్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ తెలుగు యువ పురస్కారం అందుకున్న యువకుడు



**జైపూర్, జనవరి 21 (మనం న్యూస్):** జాతీయ తెలుగు యువ పురస్కారాన్ని మంగళవారం మంతెన రవితేజకు అందించారు. జైపూర్ మండలంలోని బెజ్జాల గ్రామానికి చెందిన మంతెన రవితేజ తెలుగు సాహిత్యం పట్ల చేస్తున్న కృషికి గాను నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్ అంతర్జాతీయ సాహిత్య సామాజిక సేవ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ తెలుగు యువ పురస్కారన్ని విజయవాడ కేంద్రంగా సంప్రదాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్, తెలుగు రాష్ట్రాల కవులు పాల్గొన్నారు.

# రావణుడి వారసులు తక్షణమే స్పందించారు..

**● ఆప్ సీనియర్ నేత సిసోడియా**

ఢిల్లీ,జనవరి 21: దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్ష పార్టీలైన ఆప్, బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈక్రమంలో రామాయణంలో మాయ లేడి లాంటి బీజేపీ నేతలను చూసి మోసపోవద్దని ఆప్ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. తాజాగా ఆయన వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ నేతలను ఉద్దేశిస్తూ.. ఆప్ పార్టీ సీనియర్ నేత మనీశ్ సిసోడియా ఓ పోస్ట్ చేశారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలకు రావణాసురుడి వారసులు వెంటనే స్పందించారంటూ ఎద్దేవా చేశారు.

నిన్న కేజ్రీవాల్ ఓ బహిరంగ సభలో రావణుడికి సంబంధించిన వ్యాఖ్యలు చేశారు. రావణుడి వారసులు ఈ వ్యాఖ్యలపై తక్షణమే స్పందించారు. వారి అసలు ఉద్దేశం గ్రహించాలని ఢిల్లీ వాసులకు విజ్ఞప్తి చేస్తున్నా. వారితో జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం. వారి ఎజెండా అధికారాన్ని పొందడం, ప్రజల భూములను ఆక్రమించడం. జాగ్రత్తగా ఉండి.. సరైన నిర్ణయాలు తీసుకోండి అని సిసోడియా రాసుకొచ్చారు.

సోమవారం విశ్వాస్ నగర్లోని మురికివాడలో కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన బీజేపీని ఉద్దేశిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల అనంతరం ఆ పార్టీ మురికివాడ ప్రజల భూములన్నీ అమ్మేస్తుందని ఆయన ఆరోపించారు. రామాయణంలోని సీతాపహరణ ఘట్టాన్ని కేజ్రీవాల్ ఈసందర్భంగా ప్రస్తావించారు. ఆ సమయంలో వచ్చిన మాయలేడిని బీజేపీనేతలతో పోల్చారు. వారి ఉచ్చులో చిక్కుకోవద్దంటూ ఓటర్లను హెచ్చరించారు.

ఇక, ఈ మాటలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. కేజ్రీవాల్ సనాతన ధర్మాన్ని అవమానించారని, ఆయన రామచరితమానస్ను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ పేర్కొన్నారు. కాగా.. దిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి.



# ట్రంప్ కార్యవర్గం నుంచి వివేక్ రామస్వామి ఔట్..

వాషింగ్టన్, జనవరి 21: అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన కొన్ని గంటల్లోనే భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి కీలక నిర్ణయం ప్రకటించారు. ట్రంప్ కార్యవర్గం నుంచి వైదొలిగారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించారు.



ఇటీవలే జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం వివేక్ రామస్వామి పోటీ పడిన విషయం తెలిసిందే. చివరికి రేసు నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత ట్రంప్ గెలుపుకోసం తీవ్రంగా శ్రమించారు. ఈ నేపథ్యంలోనే తన గెలుపులో కీలక పాత్ర పోషించిన వివేక్ రామస్వామితోపాటు ఎలాన్ మస్కుకు తన కార్యవర్గంలో ట్రంప్ కీలక పదవులను కట్టబెట్టారు. తన కార్యవర్గంలో కీలకమైన డోజ్ (డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ) బాధ్యలను వారిద్దరికీ అప్పగించారు. మెరుగైన పాలన, ప్రభుత్వంలో వృథా ఖర్చుల్ని తగ్గించే ఎఫిషియెన్సీ శాఖకు వారిద్దరూ నేతృత్వం వహిస్తారని ట్రంప్ తెలిపారు. అయితే, ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన గంటల వ్యవధిలోనే రామస్వామి ఈ అనూహ్య నిర్ణయం ప్రకటించడం గమనార్హం. రామస్వామి నిర్ణయం వెనుక పెద్ద కారణమే ఉందని తెలిసింది. ఒహైయో గవర్నర్‌గా పోటీ చేసేందుకు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో వివేక్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒహైయో గవర్నర్ ఎన్నికలు వచ్చే ఏడాది నవంబర్లో జరగనున్నాయి.

# మమత తొందరపాటు చర్యలు సరికాదు: ఆర్జీకర్ మృతురాలి తండ్రి

కోల్‌కత, జనవరి 21: ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సర్కారు తీరును మృతురాలి తండ్రి తప్పుపట్టారు. ఈ వ్యవహారంలో సీఎం మమతా బెనర్జీ తొందరపాటు చర్యలు అవసరం లేదని అన్నారు.



''రేపు మాకు తీర్పు కాపీ వస్తుంది. దానిని పరిశీలించిన తర్వాత ఏమి చేయాలో నిర్ణయించుకుంటాం. అప్పటివరకు సీఎం మమతా బెనర్జీ తొందరపాటు చర్యలు తీసుకోకూడదు. ఆమె ఎన్నో మాటలు చెప్పి.. సాక్ష్యాలను తారుమారు చేశారు. వాటిని తారుమారు చేసిన వారిలో పోలీస్ కమిషనర్, ఇతరుల ప్రమేయం ఉంది. ఇవన్నీ మమత చూడలేదా..?'' అని సూటిగా ప్రశ్నించారు. సీబీఐ సరైన సాక్ష్యాధారాలు సమర్పించలేకపోవడం వల్లే..స్థానిక కోర్టులో జీవిత ఖైదు పడినట్లు భావిస్తున్నామని వెల్లడించారు.


దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు కారణమైన కోల్కతా వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌కు న్యాయస్థానం సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

మరణించే వరకూ జైలు జీవితం గడపాలని పేర్కొనింది. దోషికి రూ.50 వేల జరిమానా కూడా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది. గత ఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్.జి.కర్ ప్రభుత్వ ఆసుపత్రి-వైద్య కళాశాల సెమినార్ రూమ్‌లో నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసులో శనివారం న్యాయస్థానం పౌర వాలంటీర్ సంజయ్‌ను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. సోమవారం అతనికి శిక్ష ఖరారు చేసింది. ఈ తీర్పుపైనే బెంగాల్ ప్రభుత్వం కలకత్తా హైకోర్టుకు వెళ్లింది.

# డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలిగిన అమెరికా

**● మేం అండగా వుంటాం: చైనా**

బీజింగ్,జనవరి 21: ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ నిర్ణయించిన నేపథ్యంలో చైనా కీలక ప్రకటన చేసింది. యూఎస్ఏ వైదొలిగినా డబ్ల్యూహెచ్‌వోకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత అనూహ్య నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అందులో ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా వైదొలగడం కూడా ఉంది. కొవిడ్ వ్యాప్తి సమయంలో ఈ సంస్థ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో చైనా స్పందించింది. డబ్ల్యూహెచ్‌వోకు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించింది. ''ప్రపంచ ఆరోగ్య సంస్థను మరింత బలోపేతం చేయాలి తప్ప.. బలహీన పరచకూడదు'' అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జియాకున్ పేర్కొన్నారు. డబ్ల్యూహెచ్‌వో కార్యకలాపాలకు చైనా సహకారం ఉంటుందన్నారు. ఆరోగ్యకర ప్రపంచం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు.



# పేపర్ లీక్ యువత హక్కులను హరించడమే

**● బీజేపీపై రాహుల్ ఆరోపణ**

ఢిల్లీ, జనవరి 21: బీజేపీపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ ఘటనలు నమోదవుతున్నాయన్నారు. పేపర్ లీకేజీలు యువత హక్కులను కాలరాసే ఆయుధంగా కాషాయ పార్టీ మార్చుకుందని ఆరోపించారు.



''బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిత్యం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నిరసనలు చేపట్టిన బీపీఎస్సీ అభ్యర్థులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. అభ్యర్థులను కలిసినప్పుడు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. పేపర్ లీక్ అయితే.. కచ్చితంగా అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంది. ప్రస్తుతం అభ్యర్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గాంధేయ మార్గంలో నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడికి యత్నించారు. బాధితులపై కేసులు పెట్టారు'' అని రాహుల్ గాంధీ తన యూట్యూబ్ ఛానెల్లో వీడియో పోస్టు పెట్టారు.

''28 పరీక్షా కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగినా ప్రభుత్వం ఇంకా అంగీకరించేందుకు సిద్ధంగా లేదు. ఇది కేవలం బిహార్‌కు సంబంధించిన సమస్య కాదు. యావత్ దేశానికి చెందిన సమస్య. అభ్యర్థుల నిరసనల అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతాం'' అని హామీ ఇచ్చారు. కాగా.. గతేడాది డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్సీ కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

# వదిలింది కార్యాలయాన్నే.. పోరాటాన్ని కాదు

**● అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్**

వాషింగ్టన్, జనవరి 21: అమెరికా అధ్యక్షుడి బాధ్యతల నుంచి జో బైడెన్ వైదొలిగారు. ఈనేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తాను వీడింది కార్యాలయాన్నే కానీ.. పోరాటాన్ని కాదు అని వ్యాఖ్యానించారు.

అమెరికాకు 47వ అధ్యక్షుడిగా డొనాల్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. దీనికి ముందు జో బైడెన్ దంపతులు, ట్రంప్ దంపతులకు సంప్రదాయం ప్రకారం తేనీటి విందునిచ్చారు. బైడెన్ 'వెల్కమ్ హోం' అంటూ ట్రంప్‌నకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా ట్రంప్‌నకు సంప్రదాయబద్ధంగా లేఖ రాశారా అని విలేకరులు ప్రశ్నించగా.. అవునని బైడెన్ బదులిచ్చారు. అయితే, అందులో ఏముందనేది రహస్యమన్నారు.




ట్రంప్ బాధ్యతల స్వీకరణ అనంతరం బైడెన్ కాలిఫోర్నియాకు పయనమయ్యారు. ఈక్రమంలో 'మేము వీడింది కార్యాలయాన్నే కాని, పోరాటాన్ని కాదు' అని వ్యాఖ్యానించారు. అంతేకాక.. 'ఈరోజు ప్రారంభోపన్యాసం విన్నాం.. మనం ఇంకా చేయాల్సింది చాలా ఉంది' అని పేర్కొన్నారు. అనంతరం బైడెన్ దంపతులు హెలికాప్టర్ ఎక్కి వెళ్లిపోయారు.

తాను రాజకీయాల నుంచి వైదొలగబోనని, ప్రజా జీవితంలో కొనసాగుతానని జో బైడెన్ గతంలో స్పష్టంచేశారు. సాధారణంగా అమెరికా అధ్యక్షులుగా పని చేసినవారు పదవి నుంచి వైదొలగగానే ప్రజా జీవితానికి దూరంగా ఉంటారు. కానీ బైడెన్ తాను అలా చేయనని పేర్కొనడం గమనార్హం.

# 'సింధు నదీ జలాల' ఒప్పందం..

**● విభేదాలను పరిష్కరించే అధికారం తనకు ఉంది: మైకేల్ లీనో**

ఢిల్లీ, జనవరి 21: జమ్ముకశ్మీర్‌లో నిర్మిస్తున్న కిషన్ గంగ, రాట్లే జలవిద్యుత్కేంద్రాల విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య విభేదాలను పరిష్కరించే అధికారం తనకు ఉందని ప్రపంచ బ్యాంకు నియమించిన తటస్థ నిపుణుడు మైకేల్ లీనో స్పష్టం చేశారు. దీనిని భారత్ స్వాగతించింది. ఈ మేరకు భారత విదేశాంగశాఖ ప్రకటన విడుదల చేసింది. నిపుణుడి నిర్ణయం భారత వైఖరిని సమర్థించిందని పేర్కొంది. సింధు జలాల ఒప్పందం ప్రకారం.. తటస్థ నిపుణుడికి మాత్రమే విభేదాలను పరిష్కరించే సామర్థ్యం ఉందని భారత్ విశ్వసిస్తోందని పేర్కొంది. దీనిపై పాకిస్థాన్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.



సింధు నదికి ఉపనదులైన జీలం, చినాబ్ భారత్ జల విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తుండటాన్ని పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కానీ, భారత్- పాక్ మధ్య 1960లో సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం ప్రకారం.. ఈ ఉపనదుల జలాలను భారత్ సాగు కోసం పరిమితంగా, జలవిద్యుత్ కోసం గరిష్ఠంగా ఉపయోగించుకోవచ్చు. అయినప్పటికీ.. కిషన్‌గంగ, రాట్లే ప్రాజెక్టులపై పాకిస్థాన్ వివాదం లేవనెత్తి, మధ్యవర్తిత్వ కోర్టును ఏర్పాటు చేయాల్సిందిగా ప్రపంచబ్యాంకును కోరింది. ఏ వివాదాన్ని పరిష్కరించుకోవాలన్నా తటస్థ నిపుణుడిని నియమించాలని ఒప్పందం నిర్దేశిస్తోంది. ఈ అంశాన్నే భారత్ గుర్తు చేసింది.

అయినా 2022లో ప్రపంచబ్యాంకు అటు భారత్ కోరిన ప్రకారం మైకేల్ లీనోను తటస్థ నిపుణుడిగా, పాకిస్థాన్ కోరిన ప్రకారం షాన్ మర్ఫీ అధ్యక్షతన మధ్యవర్తిత్వ కోర్టునూ నియమించింది. ఇలా ఒకే సమస్యపై రెండు రకాలుగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా, ఆచరణపరంగా సమస్యలకు దారితీస్తుందన్నది భారత్ వాదన. అందరూ సింధు జలాల ఒప్పందం ప్రకారమే నడుచుకోవాలని భారత్ స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో తటస్థ నిపుణుడు చేసిన ప్రకటనను భారత్ స్వాగతించింది.

# ఢిల్లీ ఎన్నికలు.. బీజేపీ నుంచి మరో మ్యానిఫెస్టో

ఢిల్లీ, జనవరి 21: అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న ఢిల్లీలోని రాజకీయ పక్షాలన్నీ ఓటర్లపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా బీజేపీ మరో మ్యానిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే నిరుపేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అమలుచేస్తామని వాగ్దానం చేసింది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ.15 వేల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించింది.

భీమ్‌రావ్ అంబేడ్కర్ స్టైఫండ్ పథకం కింద ఐటీఐలు, పాలిటెక్నిక్ స్కిల్‌సెంటర్లలో టెక్నికల్ కోర్సులు అభ్యసిస్తున్న షెడ్యూల్ కులాల విద్యార్థులకు ప్రతినెలా రూ.1,000 చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తామని తెలిపింది. తాము అధికారంలోకి వస్తే.. ఆప్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి, కుంభకోణాలపై దర్యాప్తు చేసేందుకు సిట్ ఏర్పాటుచేస్తామని ఈసందర్భంగా ఠాకూర్ వెల్లడించారు. ఈమేరకు 'సంకల్ప పత్రా' పార్ట్-2ను బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ విడుదల చేశారు.



ఇదివరకే 'సంకల్ప పత్రా' పార్ట్-1 పేరుతో బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ మ్యానిఫెస్టోను ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. గర్భిణులకు రూ.21వేల ఆర్థికసాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై ఎల్‌పీజీ సిలిండర్లను రూ.500కే ఇస్తామని పేర్కొన్నారు. 'మహిళా సమృద్ధి యోజన' కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు.

**మేం ఇప్పటికే ఉచిత విద్య అందిస్తున్నాం: ఆప్**

బీజేపీ మ్యానిఫెస్టో ప్రకారం.. ఢిల్లీ ప్రభుత్వంలో అర్హులైన విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్య లభిస్తుందా..? అని ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రశ్నించారు. ''ఆప్ ప్రభుత్వంలో ప్రతిఒక్కరికీ ఉచిత విద్య లభిస్తోంది. తమ పిల్లలను విద్యాసంస్థల్లో చేర్చేందుకు తల్లిదండ్రులు బీజేపీ కార్యాలయాల చుట్టూ తిరగాలని వారు కోరుకుంటున్నారు. ఢిల్లీ ప్రజలారా జాగ్రత్తగా ఉండండి'' అని కేజ్రీవాల్ విమర్శలు చేశారు.

# ఢిల్లీ ఎన్నికల బరిలో 699 మంది అభ్యర్థుల

**● ఆ సీటు నుంచే ఎక్కువ మంది పోటీ!**

ఢిల్లీ, జనవరి 21: దేశ రాజధాని నగరం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. అధికార, విపక్ష పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయాలు వేడెక్కాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గాను 699 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం వెల్లడించారు. 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోటీ చేసేవారి సంఖ్య కాస్త అధికంగానే ఉన్నట్లు తెలిపారు. ఢిల్లీ ఎన్నికల ప్రధాన అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈసారి 981 మంది అభ్యర్థులు 1522 నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు పూర్తి కావడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను తాజాగా ప్రకటించారు. ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీలోనే అత్యధికంగా 23మంది పోటీలో ఉన్నారు. ఆ తర్వాత జనక్‌పురిలో 16మంది, రోహ్తాస్ నగర్, కర్వాల్‌నగర్, లక్ష్మీనగర్‌లలో 15మంది చొప్పున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇకపోతే, పటేల్‌నగర్, కస్తూర్బా నగర్‌లలో అత్యల్పంగా కేవలం ఐదుగురు అభ్యర్థులు మాత్రమే పోటీ చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 70 నియోజకవర్గాలు ఉండగా.. 38చోట్ల 10మంది కన్నా తక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. తిలక్‌నగర్, మంగోల్‌పురి, గ్రేటర్ కైలాస్ సీట్లలో ఆరుగురు చొప్పున; చాందినీ చౌక్, రాజేంద్రనగర్, మాలవీయనగర్‌లలో ఏడుగురు చొప్పున అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ మొత్తంగా అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తుండగా.. బీజేపీ 68 చోట్ల తన అభ్యర్థుల్ని బరిలో దించింది. మిగతా రెండు సీట్లను తన మిత్రపక్షాలైన జేడీ(యూ), ఎల్‌జేపీలకు కేటాయించింది. మరోవైపు, బీఎస్పీ 69 చోట్ల అభ్యర్థుల్ని పోటీలో ఉంచింది.




**439 కేసులు నమోదు**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వ్యవహారంలో 439 కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. జనవరి 7 నుంచి 20 మధ్య ఈ కేసులు నమోదైనట్లు తెలిపారు. అక్రమ కార్యకలాపాలు, ఆయుధాలు, మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు వీలుగా బోర్డర్ చెక్‌పాయింట్ల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అలాగే, ఎన్నికల నేపథ్యంలో రూ.కోటి విలువ చేసే 38,075 లీటర్ల మద్యం, రూ.17కోట్ల విలువైన 104.90కిలోల డ్రగ్స్, 1200 నిషేధిత ఇంజెక్షన్లతో పాటు రూ.3.55 కోట్ల నగదు, 37.39 కిలోల వెండిని సీజ్ చేసినట్లు వివరించారు.

# అమెరికాతో తాలిబన్ ప్రభుత్వం డీల్

**● అమెరికాకు, తాలిబన్లకు మధ్య ఖైదీల మార్పిడి ఒప్పందం**

ఇస్లామాబాద్, జనవరి 21: అమెరికాకు, తాలిబన్లకు మధ్య ఖైదీల మార్పిడి ఒప్పందం కుదిరినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికాలో ఖైదీగా ఉన్న అఫ్గాన్ ఫైటర్ ఖాన్ మహమ్మద్‌ను విడిపించుకోవడానికి తమ వద్దనున్న అమెరికా ఖైదీలను విడుదల చేస్తామని తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది. రెండు దశాబ్దాల క్రితం అరెస్టయిన అఫ్గాన్ ఫైటర్ ఖాన్ మహమ్మద్ ప్రస్తుతం కాలిఫోర్నియాలోని జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు.

ఖాన్ మహమ్మద్‌ను తమకు అప్పగిస్తే.. తమ వద్దనున్న ఇద్దరు అమెరికా ఖైదీలను విడుదల చేస్తామని విదేశాంగ శాఖ పేర్కొంది. యూఎస్‌తో తాము జరిపిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ సమస్య పరిష్కారమైందని తాలిబన్ అధికారులు పేర్కొన్నారు. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఈ మార్పిడి ఒప్పందం కుదిరిందని.. ఇరుదేశాల మధ్య సంబంధాలు సాధారణ స్థితికి రావడానికి ఈ చర్యలు ఎంతగానో దోహదం చేశాయన్నారు.



ఈనేపథ్యంలో అమెరికా ఖైదీలలో ఒకరైన ర్యాన్ కార్బెట్ కుటుంబం మీడియాతో మాట్లాడుతూ.. ర్యాన్ దూరమైన ఈ 894 రోజులు తమ జీవితంలో అత్యంత సవాలుతో కూడుకున్నవని అన్నారు. 2022లో తాము విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో తాలిబన్లు ఆయనను కిడ్నాప్ చేశారని తెలిపారు. ఇన్నాళ్లకు తిరిగి ర్యాన్‌ను తమకు అప్పగిస్తున్నందుకు అమెరికా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా తమ వారిని విడిపించుకునేందుకు తాలిబన్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పలుమార్లు తెలిపారు. ఇటీవల బాధితుల కుటుంబసభ్యులతో కూడా ఆయన ఫోన్లో మాట్లాడుతూ తాలిబన్ల చెరలో ఉన్న తమ వారి విడుదలకు చేస్తున్న ప్రయత్నాలు చివరిదశకు వచ్చాయని అన్నారు.

# స్కీయింగ్ రిసార్టు హోటల్లో అగ్నిప్రమాదం.. 66 మంది మృతి

**● 51 మందికి గాయాలు**

అంకారా, జనవరి 21: టర్కీలోని స్కీయింగ్ రిసార్టు హోటల్లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 66 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 51 మందికి గాయాలైనట్లు మంత్రి అలీ వెల్లడించారు. 32 మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీనికి గల కారణాలు తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు. ఘటనాసమయంలో హోటల్లో 234 మంది అతిథులు బస చేసినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలికి చేరుకొని మంటలు అదుపుచేశారు. బోలో ప్రావిన్సులో ఉన్న గ్రాండ్ కర్తాల్ హోటల్లో ప్రమాదం జరిగింది. హోటల్ మంటల నుంచి తప్పించుకునే క్రమంలో దూకిన ఇద్దరు బాధితులు కూడా మృతిచెందారు. ప్రమాద సమయంలో హోటల్ కస్టమర్లు కొందరు బెడ్ షీట్లు, బ్లాంకెట్ల సాయంతో రూమ్ల నుంచి కిందకు వచ్చే ప్రయత్నంచేశారు. నిద్రలో ఉన్నప్పుడు నిప్పు అంటుకున్నదని, వెంటనే బయటకు పరుగులు తీశామని ఓ స్కీయింగ్ ఇన్‌స్ట్రక్టర్ తెలిపారు. హోటల్ గదుల్లో పొగ కమ్ముకుపోవడంతో.. గెస్టులు ఫైర్ ఎస్కేప్‌ను లొకేట్ చేయడం కష్టంగా మారిందన్నారు. హోటల్‌కు చెందిన రూఫ్‌తోపాటు టాప్ ఫ్లోర్లు కూడా అగ్నిప్రమాదంలో ఆహుతయ్యాయి. గ్రాండ్ కర్తాల్ హోటల్లో మొత్తం 161 రూమ్లు ఉన్నాయి. దేశ రాజధాని ఇస్తాంబుల్‌కు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొరొగ్లు పర్వతాల్లో స్కీయింగ్ రిసార్టు ఉన్నది. స్కూళ్లకు సెమిస్టర్ సెలువులు ఇవ్వడంతో.. రిసార్టులన్నీ పూర్తిగా గెస్టులతో నిండిపోయాయి. ప్రమాదం జరిగిన హోటల్ వద్దకు 30 ఫైర్ ట్రక్కులు, 28 అంబులెన్సులను పంపారు.

# అయి..పాయే..!

- మున్సిపల్ పాలకవర్గ సమయం సరి
- కొంత లాభపడిన పలువురు కౌన్సిలర్లు..... అప్పుల పాలైన మరికొందరు
- అసంపూర్తిగా కొన్ని వార్డుల పనులు
- చివరి సమావేశంలో ప్రతి వార్డుకు
- పది లక్షల నిధుల కేటాయింపు
- చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్ల కుయో ..మురో




**సూర్యాపేట జనవరి 20 (మనం ప్రతినిధి):** మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం రేపో మాపో ముగుస్తుంది.... ఈ నేపథ్యం రాజకీయ భవిష్యత్తుపై పరువురు కౌన్సిలర్లు తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తుంది. అయితే గత గడిచినా ఐదు సంవత్సరాల కాలంలో తమ వార్డు పరిధిలో చేసిన అభివృద్ధి పనుల తీరు తెన్నుపై... తమ పనితీరుపై బేరీజు వేసుకునే పనిలో నిమ్మరమైనట్లు తెలుస్తుంది. జరగబోయే తాజా మున్సిపల్ ఎన్నికల్లో తాము పోటీ చేసే విషయమై వార్డు ప్రజల నుంచి లభించెస్పందన ఏమిటనే విషయమై ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్ల లో కొంత ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.ఇది ఇలా ఉండగా.... మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం పూర్తి కానున్న నేపథ్యంలో ప్రభుత్వం కడసారిగా మంగళవారం పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసింది . ఈ చివరి సమావేశంలో ప్రతి వార్డు కౌన్సిలర్ కు అభివృద్ధినిధుల కింద కు చివరిగా రూ 10 లక్షల రూపాయలను ప్రభుత్వ కేటాయించి.పనులు చేసుకునే అవకాశాన్ని అధికారులు కల్పించడం జరిగింది ఇప్పటికే సూర్యాపేట పట్టణ మున్సిపల్ పరిధిలో చాలా వార్డుల్లో ముఖ్యంగా వెళ్లిన గ్రామాలైన వార్డుల్లో సమస్యలు పరిష్కారం పూర్తిస్థాయిలో కాలేదని చెప్పవచ్చు.₹ఏడాదినర కాలంగా నిధుల లేమిపురపాలక సంఘం ద్వారా చేపడుతూ వస్తున్న అభివృద్ధి పనులకు ఏడాదిన్నర కాలంగా నిధుల మంజూరు కాకుండా పోవడంతో అటు పనులు చేసిన కాంట్రాక్టర్లు కొందరు... కౌన్సిలర్లు లబోదిబో అంటున్నారు సుమారు ఐదు కోట్లకు పైగా పెద్ద ఎత్తున మున్సిపల్ ద్వారా బకాయిలు పేరుకపోయి ఉన్నట్లు సమాచారం సుమారు 30 మంది పైగా పనులు చేసిన కాంట్రాక్టర్లకు కొందరు కౌన్సిలర్లకు పెద్ద ఎత్తు న మున్సిపల్ అధికారులు బకాయిలు పెట్టినట్టు తెలుస్తోంది ఈ నేపథ్యంలో అనేకచోట్ల చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొన్ని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కనిపిస్తున్నాయి అసంపూర్తిగా ఉన్న పనులను ఎప్పుడు ప్రభుత్వం పూర్తి చేస్తుందో అనే పెద్ద సమస్యగా మారింది నేనే పద్యంలో తుది విడతలో జరిగిన మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో ప్రతి వార్డు అభివృద్ధి కోసం కౌన్సిలర్ కు 10 లక్షల అభివృద్ధి పనులను అప్పగించడం విశేషం పాత వాటికే చేసిన పనులకు బిల్లులు రాక కుయోమురో అంటున్న కాంట్రాక్టర్ల దయనీయ స్థితిని గమనిస్తున్న పట్టణ ప్రజలు అభివృద్ధి కోసం ప్రతి వార్డుకు కేటాయించిన 10 లక్షల పనులు ఎప్పుడు జరుగుతాయో లేదో అనే సందేహం మెండుగా వినిపిస్తుంది.

# ప్రభుత్వ పథకాల అమలుకు పారదర్శకంగా అర్హుల ఎంపిక

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- పథకాల అమలు నిరంతర ప్రక్రియ
- లబ్ధిదారుల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి
- గోళ్ళపాడు సభలో పాల్గొన్న కలెక్టర్



**ఖమ్మం, జనవరి 21(మనం బ్యూరో):** ప్రభుత్వ పథకాల అమలుకు పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామం, ఖమ్మం నగరం 6వ డివిజన్ లో నాలుగు నూతన పథకాల అమలుపై నిర్వహించిన గ్రామ/ వార్డు సభలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న నాలుగు పథకాల అర్హుల ప్రాథమిక జాబితాను పరిశీలించి చేర్పులు, మార్పులు ఏవైనా ఉంటే చర్చ పెట్టుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల మార్గదర్శకాలను గ్రామ వాట్సప్ గ్రూపులు, న్యూస్, అధికారుల ద్వారా తెలియజేశామని అన్నారు. 4 నూతన కార్యక్రమాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి లబ్ధిదారుల యొక్క ప్రాథమిక జాబితా గ్రామసభలలో పెడుతున్నామని, ఎక్కడ ఎటువంటి దాపరికాలు లేకుండా, పూర్తి పారదర్శకంగా ప్రజలకు తెలిసేలా పథకాల అమలు ఉంటుందని, జాబితాలో అనర్హులు ఎవరైనా ఉంటే వివరాలు అందించాలని మళ్లీ విచారణ చేయిస్తామని అన్నారు. ప్రాథమిక జాబితాలో అర్హులు ఎవరైనా లేని పక్షంలో గ్రామ సభలలో లేదా ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయాలలో ఉన్న ప్రజా పాలన కేంద్రాలలో మళ్లీ దరఖాస్తులను తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి పథకాల లబ్ది చేకూరుస్తామని అన్నారు. గ్రామ సభ/వార్డు సభల వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసినట్లు, జాబితా లో పేర్లు సరిచూసుకోనుటకు, జాబితాలో పేర్లు లేని వారికి దరఖాస్తు పెట్టుకొనుటకు అధికారులు సహకరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం గ్రామ సభలలో పెట్టిన జాబితా, ప్రాథమిక జాబితా మాత్రమేనని తుది జాబితా కాదని, ప్రజలు ఎవరు ఆందోళన చెందకుండా ఉండాలని, పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ పథకాలు అందుతాయని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం రూరల్ మండల ప్రత్యేక అధికారిణి/జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఏపీఎం శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ మండల అధ్యక్షునిగా తల్లాడ చంద్రమోహన్

**మరిపెడ, జనవరి 21 (మనం న్యూస్):** వాసవి క్లబ్ ఉమ్మడి వరంగల్ జిల్లా గవర్నర్ వేమిశెట్టి. కిషోర్ కుమార్, ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ అధ్యక్షులు మాలే. యోగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన తల్లాడ. చంద్రమోహన్ ను మరిపెడ వాసవి క్లబ్ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శి- గర్రెపల్లి. నగేష్, కోశాధికారి- కటకం. కిషోర్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు- తల్లాడ. స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి- గర్రెపల్లి. హరిత, కోశాధికారి - కటకం. స్వాతి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ! పేద ప్రజలకు అండగా నిలుస్తూ మా వంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. మా ఎన్నికలకు సహకరించిన వాసవి క్లబ్ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.



ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఉప్పల.నాగేశ్వరరావు, గర్రెపల్లి. వెంకన్న, ఉప్పల. వెంకన్న, గర్రెపల్లి. సత్యనారాయణ, కటకం. కిషోర్, సకినాల.పురుషోత్తం, రామారావు, వుల్లి. విజయకుమార్, తల్లాడ. రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అపోహాలు వద్దు..

- అర్హులందరికీ పదకాలు అందచేస్తాం
- ఇది నిరంతర ప్రక్రియ
- తాలిపేరు లిఫ్ట్ ఇరిగేషన్ కు కృషి
- గ్రామసభలో ఎం ఎల్ ఏ తెల్లం వెంకట్రావు

**చర్ల, జనవరి 21 (మనం న్యూస్) :** ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపిక గుర్తింపు కొరకు నిర్వహిస్తున్న గ్రామసభల విషయంలో ప్రజలకు ఎటువంటి అపోహలు వద్దని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకట్రావు అన్నారు. మంగళవారం చర్ల మండలం సుబ్బంపేట గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక గుర్తింపు గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిం చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి దక్కుతుందని, దామాషా పద్ధతి ప్రకారం కొద్దిగా ఆలస్యం అయితే ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇంద్రమ్మ ఆత్మీయ భరోసా పథకాలు ప్రతి ఒక్కరికి అందజేసే వరకు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రైతు భరోసా క్రింద వ్యవసాయ భూములలో పంటలు సాగుచేసిన వారికి మాత్రమే ఎటువంటి షరతులు లేకుండా రూ. 12 వేల నగదును అందచేస్తామ న్నారు. గతంలో మాదిరి బంజరు భూములు, పంట సాగుచేయని భూములకు రైతు భరోసా ఇచ్చే ప్రసక్తేలేదని స్పష్టం చేసారు. ఇజదిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా 20 ఉపాధి పని దినాలు చేసిన భూమిలేని నిరు పేదలకు రూ. 12 వేల నగదును చెల్లించనున్నట్లు వివరించారు. గుడిసెలో నివసించే పేదలకు మొదట గా ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని, ఆతర్వాత ప్రాదాన్యత క్రమం అనుగుణంగా ప్రతి నిరుపేదకు ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చర్ల మండలం క్రాంతిపురం రహదారి, వంతెన నిర్మాణం విషయంలో అదికారుల నుండి వివరాలు సేకరించి వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. బి ఎస్ రామయ్య నగర్ వాసులకు సోలార్ విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేసించారు. తాలిపేరు ప్రాజెక్ట్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మంజూరయ్యేలా కృషిచేసి 22 గ్రామాలలోని సుమారు పది వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాలని ఎం ఎల్ ఏ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో కనపర్తి ఈదయ్య, ఏఈవో అఫ్రీద్, కార్యదర్శి సర్వేశ్వరావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వరూప రాణి పాల్గొన్నారు. కాగా మంగళవారం మండలంలోని సి కత్తిగూడెం, కొత్తపల్లి, బోదనెల్లి, గొమ్ముగూడెం, గొంపల్లి, పెద్దిపల్లి, పులిగుండాలలో సైతం గ్రామ సభలు నిర్వహించారు.




# తెలంగాణలో ఆర్టీసీ ప్రైవేటీకరణ!

- పావులు కదుపుతొన్న కాంగ్రెస్ సర్కార్
- రేవంత్ సర్కార్ ప్రజా రవాణా నుంచి తప్పుకోవాలని చూస్తుంది
- ఆర్‌టీసీ పరిరక్షణకు బీఆర్ఎస్ పోరాటం చేస్తాం
- ప్రైయివేటీకరణ నిర్ణయం ఆర్టీసీ ఉద్యోగులకు పెద్ద గొడ్డలిపెట్టు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్.. కార్మికుల పక్షాన కొట్లాడుతాం
- డిజీల్ బస్సుల స్థానంలో ఈవీని తెచ్చేందుకు భారీ ప్లాన్
- ఎలక్ట్రిక్ వెహికిల్స్ ముసుగులో ఆర్టీసీని ప్రైవేటీకరించే యోచనలో సర్కార్
- పువ్వాడ అజయ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణ రాష్ట్రంలో.. ఆర్టీసీ ప్రైయివేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున పావులు కదుపుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అందులో బాగంగా.. ఓ రహస్య ఎజెండాతో ముందుకు వెళ్తుందని.. ప్రైయివేటీకరణ యత్నాలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే వరంగల్ డిపోను జేబీఎం అనే సంస్థకు అప్పజెప్పిందని, సూర్యాపేట, నల్లగొండ, హైదరాబాద్‌లోని పలు డిపోలను కూడా ప్రైయివేటీకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందని పువ్వాడ అజయ్ పేర్కొన్నారు. ప్రజా రవాణా నుంచి తప్పుకోవాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తుందని, ఆర్టీసీని పరిరక్షించుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎంతవరకైనా పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రైయివేటీకరణ నిర్ణయం ఆర్టీసీ ఉద్యోగులకు పెద్ద గొడ్డలిపెట్టు లాంటి సమస్య. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. కార్మికుల పక్షాన గట్టిగా నిలబడి కొట్లాడుతాం అని పువ్వాడ అజయ్ తేల్చిచెప్పారు.

డిజీల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వెహికిల్స్ ముసుగులో ఆర్టీసీని ప్రయివేటీకరించే అజెండాతో ఈ ప్రభుత్వం ముందుకు పోతుందని, దీన్ని తీవ్రంగా తాము పూర్తిగా ఖండిస్తున్నామని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేంద్రం ద్వారా ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించి ఫేమ్ 1, 2 అనే స్కీమ్ల ద్వారా రాష్ట్రంలో ఈ బస్సులకు సంబంధించి కోటి రూపాయాలు సబ్సిడీ పొంది ఆర్టీసీ ఆధ్వర్యంలో 40 బస్సులు తీసుకున్నాం. ఎలక్ట్రిక్ బస్సులను నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు నడిపాం.

ఏ డిపోను కూడాల ప్రైవేటు కంట్రోల్‌కు ఇవ్వలేదు అని పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు.

మేజర్‌గా సిటీలోనే కాలుష్య నియంత్రణ కోసం, నగరం ఇమేజ్ దృష్ట్యా ఇక్కడే ఎలక్ట్రిక్ బస్సులను నడిపాం. ఆర్టీసీకి ఓనర్షిప్ ఉండే విధంగా సొంతంగా 650 డిజీల్ బస్సులు కొన్నాం. ఒక వైపు సంస్థను బలోపేతం చేసుకుంటూనే.. కార్గో పార్శిల్ సర్వీసులు లాంటివి పెట్టి నష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రయత్నం చేశాం. ప్రభుత్వం మారింది.. కాంగ్రెస్ పార్టీ చేసిన 420 హామీల్లో ఆర్టీసీకి సంబంధించిన అనేక హామీలు ఉన్నాయి. విలీన ప్రక్రియకు సంబంధించిన బిల్లు అసెంబ్లీలో పాస్ చేయడం జరిగింది. విలీన ప్రక్రియ కూడా పూర్తి చేశాం. ప్రభుత్వం ఏర్పడి వన్ ఇయర్ అయిపోయింది. విలీన ప్రక్రియను తాత్సారం చేస్తున్నారు. ఆర్టీసీలో 3035 ఉద్యోగాల పేరుతో అనేక ప్రకటనలు ఇచ్చినప్పటికీ అటకెక్కించారు. ఆర్టీసీ డిపోలను ప్రయివేటీకరణ చేసేందుకు కుట్ర చేస్తున్నారు. వరంగల్ డిపో ద్వారా స్టార్ట్ చేశారు. జేబీఎం అనే సంస్థకు 500 ఎలక్ట్రిక్ బస్సులు ఇచ్చి.. హైదరాబాద్ డిపోలతో పాటు, నల్లగొండ, సూర్యాపేట, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్ డిపోను పూర్తిగా వాళ్లకు ధారాదత్తం చేసి.. ఎలక్ట్రిక్ బస్సుల ముసుగులో ప్రయివేటీకరణ చేసే ప్రయత్నం చేస్తున్నారని పువ్వాడ అజయ్ కుమార్ మండిపడ్డారు.



## ఇ(మీ)ది రాక్షస పాలన..

# ప్రజాపాలన పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నరు

- గ్రామసభల్లో ఊరూరా జనం తిరగబడుతుండ్రు?
- ఏడాది కాంగ్రెస్ పాలన ఫెయిల్యూర్ అంటూ హరీశ్‌రావు విమర్శలు

హైదరాబాద్, మనం ప్రతినిధిః ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఎగ్గొడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హరీశ్ రావు హెచ్చరించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అర్హులందరికీ ఇస్తామని చెప్పి... ఇప్పుడు భారీగా కోతలు విధిస్తే ప్రజలు తిరగబడతారన్నారు. కాంగ్రెస్ నాయకుల పాపం అధికారులకు శాపంగా మారిందన్నారు. గ్రామసభలు, ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లు... అన్నీ దగానే అన్నారు. ఏడాదిగా కాంగ్రెస్ చేస్తోన్న దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. అందుకే ఈరోజు యావత్ తెలంగాణ ఏకమై ఈ దుర్మార్గపు పాలనను నిలదీస్తోందన్నారు. మీ రాక్షస పాలనతో విసిగివేసారిపోయిన తెలంగాణ ప్రజలు ఉప్పెనగా మారి మీపైకి రాకముందే కాంగ్రెస్ కళ్లు తెరవాలని సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించాలన్నారు.



సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో... మంత్రులు అందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే? ఇక ప్రజలను ఎవరు పట్టించుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని... ముమ్మాటికి ప్రజావ్యతిరేక పాలన అన్నారు. సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. పథకాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్న గ్రామసభల సాక్షిగా ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న ఆగ్రహం తెలుస్తోందని హరీశ్ అన్నారు.అయితే, ఊరూరా జనం తిరగబడుతున్నారని, ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలను నిర్వహించే పరిస్థితులు వచ్చాయన్నారు. పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఓ వైపు గ్రామసభలు నిర్వహిస్తుంటే మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యకర్తలకే పథకాలు ఇస్తున్నప్పుడు ఇక గ్రామసభలు ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. అంటే అర్హులైన వారికి ఇవ్వడం లేదని అర్థమేగా? అని విమర్శించారు.

## మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిపై దాడి

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిపై దాడి జరిగింది. నల్గొండ మున్సిపల్ కార్యాలయంలో ఈ దాడి జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో కంచర్ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ వర్గీయులు... భూపాల్ రెడ్డిపై దాడి చేశారు. ఇరుపార్టీ వర్గాలు పరస్పరం దాడులు చేసుకొని... పూలకుండీలు విసురుకున్నారు. ఈ ఘటనలో కంచర్ల భూపాల్ రెడ్డి సొమ్మసిల్లి పడిపోయారు. అనంతరం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరులు, నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ప్లాన్ ప్రకారమే తమపై దాడి చేయించారని ఆరోపించారు. తమపై ఆయుధాలతో దాడి చేశారన్నారు. విచక్షణ మరిచి మహిళలను వివాదంలోకి లాగుతున్నారని మండిపడ్డారు.

# ఇందిరమ్మ గ్రామ సభలో గలాటా

- బదులిచ్చిన కాంగ్రెస్ నాయకులు
- సముదాయించిన అధికారులు



**వాజేడు, జనవరి 21,( మనం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందాలనే ఉద్దేశ్యంతో మంగళ వారం నాలుగు పథకాలకు లబ్దిదారులను ఎంపిక చెయ్యడానికి గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలను ప్రభుత్వం ప్రతుష్టాత్మకంగా చేపట్టింది. ఇందులో భాగంగా ఇందిరమ్మ గ్రామసభలను వాజేడు మండలంలోని కొంగాల, వాజేడు, ధర్మవరం, టేకులగూడెం గ్రామపంచాయతీలలో నిర్వహించారు. కాగా కొంగాల గ్రామపంచాయతీ గ్రామసభ జగన్నాధపురం గ్రామంలో నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయుచుండగా బిఆర్ఎస్ పార్టీ వాజేడు మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ ల అమలుకై అధికారులను ప్రశ్నించారు. రెండు లక్షల రుణమాఫీ కాలేదు, తులం బంగారం ఇవ్వలేదు, రైతు భరోసా జాడలేదు, మహిళలకు నెలకు 2500 ఇస్తానని చెప్పి దాని ఊసే లేదు అంటూ నిలదీశారు.దీనికి మండల ఎంపీ ఓ శ్రీకాంత్ నాయుడు బదిలిస్తూ.. ప్రస్తుతం, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి మాత్రమే వివరించగలం అని తెలియజేశారు. పథకాల పేరుతో పేద ప్రజలను మోసం చేస్తుందని, స్థానిక ఎన్నికల కొరకు ఈ ప్రభుత్వం డ్రామా ఆడుతుందని రామకృష్ణారెడ్డి తోపాటు బిఆర్ఎస్ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. ఇంతలో అందుబాటులో ఉన్న కాంగ్రెస్ నాయకులు దాట్ల ఖాళీ కృష్ణ కల్పించుకొని మీ ప్రభుత్వంలో 10 సంవత్సరాలలో ప్రజలకు ఏమి న్యాయం చేసిందో తెలపాలని ఎదురు తిరిగారు. గ్రామ సభలో నాయకుల మధ్య మాటల యుద్ధంతో గలాట మొదలైంది. ఇంతలో అధికారులు, స్థానిక ఎస్సై ఎన్ రాజ్ కుమార్ వచ్చి నాయకులకు నచ్చ జెప్పి సము యించారు. గ్రామ సభలో అధికారులతో పాటు, అధికార, ప్రతిపక్ష, నాయకులు ప్రజలు, మహిళలు, పాల్గొన్నారు.

## టెన్త్ స్టూడెంట్స్‌వార్షిక పరీక్షల కోసం ఒత్తిడిలేకుండా సిద్ధం కావాలి

**హనుమకొండ,జనవరి 21,( మనం న్యూస్):** కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. హనుమకొండ జిల్లా శాయంపేట, పత్తిపాక గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల పంపిణీ పథకాల కోసం చేసిన సర్వే వివరాలను సోమవారం పరిశీలించారు. మాందారిపేటలోని కేజీబీవీ నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. వంట సామగ్రిని భద్రపరిచిన స్టోర్ రూమును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, వారితో కలిసి భోజనం చేశారు. టెన్త్ స్టూడెంట్స్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఇటీవల సందర్శకులు కలెక్టర్‌కు బొకేలకు బదులుగా తెచ్చిన నోట్‌బుక్స్‌ను విద్యార్థినులకు పంపిణీ చేశారు. ముందుగా శాయంపేట, పత్తిపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను పరిశీలించి, వచ్చిన గ్రీవెన్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా, మండల స్థాయి అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీవో కె.నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో అపచారం

**జనవరి 21,( మనం న్యూస్):** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో అపచారం చోటుచేసుకుంది. ఆలయంలో పెద్ద పెద్ద కెమెరాలతో షూటింగ్ నిర్వహించారు. షూటింగ్ చేస్తే తప్పేంటీ అంటారా.. ఆ షూటింగ్ నేరుగా గర్భగుడిలోనే చేశారు. అది కూడా భక్తులను ఆపేసి, గుడి తలుపులు మూసేసి మరీ షూటింగ్ చేయటం గమనార్హం. ఈ ఘటనపై భక్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పవిత్రను అధికారులు దెబ్బతీస్తున్నారంటూ మండిపడుతున్నారు. తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయంలో అపచారం జరిగింది. సాధారణంగా భక్తులు గర్భగుడి వరకు వెళ్లి లోపల ఉన్న స్వామివారిని దర్శించుకుంటుంటారు. గర్భగుడిలోకి వెళ్లాలంటే ప్రత్యేక ఆచారాలు, వ్యవహారాలు ఉంటాయి. పైగా.. ఆలయంలో ఫొటోలు, వీడియోలు కూడా తీయనివ్వరు. అలాంటిది కాళేశ్వరంలోని ముక్తేశ్వర ఆలయంలో పెద్ద పెద్ద కెమెరాలతో ఏకంగా ఓ ప్రైవేటు ఆల్బమ్ను షూట్ చేశారు. అదికూడా గర్భగుడిలో. ఇందుకోసం.. దర్శనానికి వచ్చిన భక్తులను బయటే నిలిపేసి.. గుడి తలుపులు మూసేయటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఈ ఘటనపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులను ఆపేసి మరీ.. ఆలయ గర్భగుడిలో ఓ ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరిస్తుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అపచారం జరుగుతున్నా దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. ఆలయ పవిత్రతను అధికారులు దెబ్బతీశారంటూ తిట్టిపోస్తున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఒకవేళ వాళ్లు తీస్తున్న ఆల్బమ్ ఆధ్యాత్మికమైనదే అయినా.. కాళేశ్వర ఆలయ ప్రాముఖ్యతను చాటిపెట్టే పాటో, డాక్యుమెంటరీనో అయినా.. భక్తులు దర్శించుకునే సమయంలో తీయటమేంటని ప్రశ్నిస్తున్నారు. భక్తుల రద్దీ లేని రోజుల్లోనో, గుడి మూసేసిన తర్వాత సాయంత్రం సమయంలోనో షూటింగ్ తీసుకోవచ్చు కదా అని రకరకాల కామెంట్లు చేస్తున్నారు. మరి.. ఈ షూటింగ్ ఆలయ అధికారుల పర్మిషన్ తీసుకుని చేస్తున్నారా.. లేదా సిబ్బంది పెత్తనంతో జరిగిందా అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి. మరి ఈ ఘటనపై అధికారులు ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాలి.అయితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర పుణ్యక్షేత్రం.. త్రిలింగాల్లో ద్రాక్షారామం, శ్రీశైలం తర్వాత ముక్తేశ్వర ఆలయం ఒక్కటి. ఈ ఆలయంలో ఒకే వేదికపై రెండు శివలింగాలు ప్రతిష్ఠించబడి ఉండటం ప్రత్యేకత. ఒక శివలింగానికి కాళేశ్వరుడు అని, రెండో లింగానికి ముక్తేశ్వరుడు అని పేర్లు ఉన్నాయి. ఈ ఆలయానికి పిరమిడ్ ఆకారంలో శిఖరం నిర్మించబడి ఉండేది. ఈ ఆలయానికి ఉత్తరంగా మరొక చిన్న గుడి ఉండేది. అందులో అన్నపూర్ణ దేవి ప్రతిమ ఉండేది. ఇప్పటికీ ఈ ఆలయంలో గణపతి, మత్స్యావతారం, చతుర్ముఖలింగం, సూర్య, విష్ణు, నంది మొదలైన విగ్రహాలు ఉన్నాయి. విద్యానాథుడు ఈ పుణ్యక్షేత్రాన్ని త్రిలింగ దేశానికి ఒక సరిహద్దుగా కీర్తించాడు.



# అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**జనవరి 21,( మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పై మంగళవారం నల్లబెల్లి మండలం రెలకుంట,అర్షనపల్లి లో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి జడ్పి సీఈవో రాంరెడ్డిగార్లు పాల్గొని ప్రజల సమక్షంలోగ్రామ సభ నిర్వహించడమైనది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇది నిరంతర ప్రక్రియ, జాబితాలో పేరు నమోదు కానివారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలే కాకుండా గ్రామ సమస్యలపై దరఖాస్తు చేసినట్లయితే అట్టి దరఖాస్తులు కూడా స్వీకరించి రిజిస్టర్లలో నమోదు చేయాలని అన్నారు.ఏదైనా సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించుట కషి చేస్తానని పేర్కొన్నారు. నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామపంచాయతీ పరిధిలో గ్రామసభ నిర్వహించగా అక్కడ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణానికి సమీపంలో కిరాణా షాపు వలన ఇబ్బందికరంగా పరిస్థితులను ఎదుర్కొంటున్నామని విజ్ఞప్తి చేయగా అందుకు సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించవలసిందిగా ఆదేశించడమైనది. అనంత రం నర్సంపేట లోని ముదిరాజ్ మండలం సర్వాపు రం వార్డు మెంబర్ 6 లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ప్రజల సమస్యల పై ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా,రేషన్ కార్డుల పై సర్వే నిర్వహించిన తీరును పరిశీలించి అర్హులైన లబ్ధిదా రులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడా లని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో నల్లబెల్లి మండల తహశీల్దార్ కష్ణ,మండల ప్రత్యేక అధికారి సీపీఓ గోవిందరాజన్, నర్సంపేట ఇంచార్జీ మున్సిపల్ కమిషనర్ జోనా, సర్పంచ్ శ్రీదేవి మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యు లు, సంబంధిత అధికారులు, పంచాయితీ సెక్రటరీ లు,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్ డీసీసీబీ బ్యాంక్ టర్నోవర్

**హనుమకొండ జనవరి 21,( మనం న్యూస్):** అందరి సహకారంతో వరంగల్ డీసీసీబీ బ్యాంక్ టర్నోవర్ రూ.893 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల టర్నోవర్ దాటిందని వరంగల్ డీసీసీబీ బ్యాంక్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవిందర్ రావు తెలిపారు. సోమవారం నక్కలగుట్ట డీసీసీబీ భవనంలో ఆయన ఆధ్వర్యంలో మహాజన సభ జరిగింది.ఈ సందర్భంగా రవిందర్ రావు మాట్లాడుతూ బ్యాంకు పరిపాలన నివేదిక, ఆర్థిక సంవత్సరం 2024-25కు జారీ చేయబడిన ఆడిట్ సర్టిఫికేట్, బ్యాంకు జమ ఖర్చు, లాభనష్టాలు, ఆస్తులు, అప్పుల వివరాలను ప్రవేశపెట్టామన్నారు. బ్యాంకు తన 32 శాఖల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాలు, బ్యాంకు ఖాతాదారులకు ఉచిత సేవలు అందిస్తున్నామన్నారు. సమావేశంలో డీసీసీబీ బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, బ్యాంక్ వైస్ చైర్మన్ కుందురు వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు, నాబార్డు డీజీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## తొర్రూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతా

**తొర్రూరు,జనవరి 21 (మనం న్యూస్ ):** అభివృద్ధిలో తొర్రూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఆడిటోరియం నిర్మాణానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులతోకలిసి నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ.5.25 కోట్లతో ఆడిటోరియం నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కమిషనర్ శాంతి కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. వరంగల్‌జిల్లా రాయపర్తి మండలం ఏకేతండాకు చెందిన ధరావత్ గోపి పొలం వద్ద నాటు వేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అంతిమయాత్రలో పాల్గొని, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.




# అరులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలి

- దేవుని గుట్ట తాండ మాజీ సర్పంచ్ రాములు నాయక్
- గ్రామ సభలో గ్రామస్తులకు అవగాహన



**జడ్చర్ల జనవరి 21 (మనం న్యూస్ ):** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన గ్రామస్తులకు అందజేయాలని దేవుని గుట్ట తండా మాజీ సర్పంచ్ రాముల నాయక్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని దేవుని గుట్ట తండా గ్రామపంచాయతీ లోని ప్రజాపాలన గ్రామసభ నిర్వహించడం జరిగింది. ప్రకటించిన జాబితాను ఆయన పరిశీలించి కొన్ని సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో బ్రహ్మ గౌడ్, హౌసింగ్ డిఇ నరసింహులు, స్పెషల్ ఆఫీసర్ విజయ శంకర్, ఐ పి ఓ విజయభాస్కర్, టీమ్ మెంబర్ వేణు, ఏ ఈ ఓ శారద, పంచాయతీ సెక్రెటరీ ఉదయ్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, అంగన్వాడీ టీచర్ యాదమ్మ, గ్రామ పెద్దలు జేమ్లా నాయక్, వెంకట్ నాయక్, టీకియా నాయక్, వెంకట్ నాయక్, లక్ష్మణ్ నాయక్, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో ట్రాఫిక్ జామ్‌కు చెక్



**హైదరాబాద్,జనవరి 21 (మనం న్యూస్ ):** నగరంలో ట్రాఫిక్ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. కొన్నిసార్లు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద గంటల తరబడి వెయిట్ చేయాల్సిన పరిస్థితి. కి.మీ మేర వాహనాలు బారలు తీరుతాయి. అలా ట్రాఫిక్‌లో చిక్కుకుపోవటం నరకంలా అనిపిస్తుంటుంది. దీంతో చాలా మంది మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. మెట్రో ట్రైన్లలో నగరం ఓ మూల నుంచి మరో మూలకు వెళ్లేవారు ఈజీగా ప్రయాణాలు సాగిస్తున్నారు. త్వరలో మరింత ఈజీగా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జర్నీ చేయవచ్చు. నగర ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూ.. పాడ్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రభుత్వం-మెట్రోరైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.పాడ్ ట్యాక్సీ అంటే ఏంటి..?

పాడ్ ట్యాక్సీలను పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్గా వ్యవహరిస్తుంటారు. ఇవి బ్యాటరీ లేదంటే కరెంట్తో పని చేస్తాయి. పర్యావరణహితంగా ఉండే కారు లాంటి క్యాబిన్లో 6-8 మంది ప్రయాణించొచ్చు. వీటిలో డ్రైవర్లు ఉండరు. ప్రయాణికులు ఇందులో కూర్చున్న తర్వాత.. తాము వెళ్లాలనుకునే గమ్యాన్ని ఎంచుకోవటానికి టచ్ ప్యాడ్లు ఉంటాయి. అక్కడ క్లిక్ చేస్తే చేరాల్సిన గమ్యాలకు తీసుకెళ్తాయి. బస్టాండ్లు, మెట్రో స్టేషన్ల నుంచి నేరుగా ఆఫీసులకు వెళ్లేలా వీటిని రూపొందిస్తారు. భారీ టవర్లు ఉండే భవనాలు, కార్యాలయాలకు కూడా వెళ్లేలా డిజైన్ చేస్తారు. అందుకోసం ప్రత్యేకంగా మార్గాలను ఏర్పాటు చేస్తారు.రానున్న మూడేళ్లలో ఈ పాడ్ ట్యాక్సీలను హైదరాబాద్ నగరంలో పట్టాలెక్కించాలని యోచిస్తున్నారు. ముందుగా నగరంలో అత్యంత రద్దీగా ఉండే రెండు మార్గాల్లో తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారట. రాయదుర్గం - కొండాపూర్, రాయదుర్గం - నాలెడ్జ్ సిటీ మార్గం మధ్య ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ రెండింటి మధ్య దూరం 14.8 కి.మీ. కాగా.. మొత్తం 55 స్టాప్లు ఏర్పాటు చేయనున్నారు. వీటి గరిష్ఠ వేగం గంటకు 40 కి.మీ.హెచ్ఎంఆర్ఎల్ డీపీఆర్ ప్రకారం.. ట్రాఫిక్ రద్దీ వేళల్లో ఈ పాడ్కార్ల ద్వారా గంటకు 10 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాన్ని చేరుకుంటారని అంచనా. రోజుకు లక్ష మందిని ఈజీగా గమ్యస్థానాలకు చేర్చవచ్చు. ఈ రకమైన వ్యవస్థతో హైదరాబాద్లో పట్టణ రవాణా మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ముంబైలోని బాంద్రా-కుర్ల కాంప్లెక్స్ మధ్య పాడ్ ట్యాక్సీ కారిడార్ వ్యవస్థ నిర్మితమవుతోంది. గ్రేటర్ నోయిడా నుంచి నోయిడా ఎయిర్పోర్ట్ వరకు మరో లైన్ నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధమైంది. హైదరాబాద్ విషయానికొస్తే.. మెట్రోరైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) రూ.1,480 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీపీఆర్ను ప్రభుత్వానికి సమర్పించి ఆ తర్వాత అనుమతులు, నిధులు కోరనున్నట్లు తెలిసింది.



# పభుత్వ సంక్షేమ పథకాల అమలు



**మహబూబాబాద్/ నర్సింహులపేట,జనవరి 21 (మనం న్యూస్ ):** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభలను షెడ్యూల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని కోరారు. అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామ సభల తీర్మాన ప్రతులను భద్రపరచాలని సూచించారు. సమావేశంలో అడిషనల్‌కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె. వీరబ్రహ్మాచారి, జడ్పీ సీఈవో పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో పర్యటించిన కలెక్టర్ పలు వార్డులు, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో జరుగుతున్న డెవలప్మెంట్ పనులను పరిశీలించారు. శానిటేషన్ మెరుగ్గా ఉండేలా చూడాలన్నారు.

# యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆదాయం రూ.4.17 కోట్లు

**యాదగిరిగుట్ట,జనవరి 21 (మనం న్యూస్ ):** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. 48 రోజుల పాటు హుండీల ద్వారా వచ్చిన నగదు, బంగారం, వెండిని కొండ కింద గల సత్యనారాయణస్వామి వ్రత మండపంలోని ప్రత్యేకహాల్లో ఈవో భాస్కరావు పర్యవేక్షణలో కౌంట్ చేశారు. మొత్తం రూ.4,17,13,596లతో పాటు 288 గ్రాముల బంగారం, 7 కిలోల 50 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో భాస్కరావు చెప్పారు. అలాగే 1,721 అమెరికా డాలర్లు, 40 ఇంగ్లాండ్ పౌండ్లు, 490 యూఏఈ దిర్హామ్స్, 15 యూరోప్ యూరోలు, 110 నేపాల్ రూపీస్, 15 కెనడా డాలర్లు, 39 సౌదీ అరేబియా రియాల్స్, 62



సింగపూర్ డాలర్లు, 195 ఆస్ట్రేలియా డాలర్లు, 12 ఖతార్ రియాల్స్, 20 థాయ్లాండ్ భాట్, 702 ఒమన్ బైసా, 270 శ్రీలంక రూపీస్, 15 కెనడా డాలర్స్, 122 మలేషియా రింగిట్స్, 1000 కొరియా వన్, 170 బంగ్లాదేశ్ టక్కా, 1000 ఫిలిప్పీన్స్ పెసో, 25 జార్జియా, 1000 ఇండోనేషియా, 100 హాంకాంగ్ కరెన్సీ వచ్చినట్లు ఆఫీసర్లు తెలిపారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్

**జనవరి 21 (మనం న్యూస్ ):** ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కల్లెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ తో కలిసి స్వీకరించారు.



ప్రజావాణిలో మొత్తం 105 దరఖాస్తులు రాగా, వాటిలో కొన్నింటిని సత్వరమే పరిష్కరించారు. వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో అర్హులైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామసభలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని డీపీవో వెంకయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేక కలెక్టర్ నటరాజ్, డీఆర్ డీఏ పీడీ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# టాప్ ర్యాంక్ కు చేరువలో టీమిండియా ఓపెనర్..



ఐసీసీ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అగ్రస్థానానికి అడుగు దూరంలో నిలిచింది. ఐసీసీ తాజాగా ప్రకటించిన బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో మంధాన రెండో స్థానానికి చేరుకుంది. ఓ స్థానం మెరుగుపరుచుకుని రెండో స్థానానికి మంధాన దూసుకొచ్చింది.ఐర్లాండ్ తో సిరీస్ లో అద్భుత ప్రదర్శన కారణరంగా స్మృతి ర్యాంక్ మెరుగుపడింది. ఈ భారత వైస్ కెప్టెన్ ఖాతాలో ప్రస్తుతం 738 పాయింట్లు ఉన్నాయి. ఐర్లాండ్ సిరీస్ లో మంధాన అదరగొట్టింది. మూడు మ్యాచ్ ల సిరీస్ లో స్మృతి ఓ సెంచరీతో పాటు మొత్తంగా 249 పరుగులు చేసింది. కాగా ఐసీసీ మహిళల బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో భారత్ నుంచి మంధాన ఒక్కరే ఉండడం గమనార్హం. మరోవైపు ఈ ఐరిష్ సిరీస్ లో సెంచరీతో కదం తొక్కిన జెమిమా రోడ్రిగ్స్ రెండు స్థానాలు మెరుగు పరుచుకుని 17వ ర్యాంక్ కు చేరుకుంది. అదేవిధంగా ఈ సిరీస్ కు దూరమైన కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 15వ ర్యాంక్ లో కొనసాగుతోంది. ఇక ఆల్ రౌండర్ కోటాలో స్టార్ ప్లేయర్ దీప్తి శర్మ 344 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది.

**టాప్‌లో సౌతాఫ్రికా బ్యాటర్..**

కాగా వన్డే బ్యాటర్ల ర్యాకింగ్స్ లో సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్(773) అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. రెండో స్థానంలో మంధాన(738), మూడో స్థానంలో శ్రీలంక బ్యాటర్ చమిర అతపట్టు(733) మూడో స్థానంలో ఉన్నారు. మహిళల వన్డే బౌలింగ్ ర్యాకింగ్స్ లో ఇంగ్లండ్ స్టార్ స్పిన్నర్ సోఫియా ఎకిల్స్టోన్(770) టాప్ ర్యాంక్ లో కొనసాగుతుండగా.. గార్డెనర్(724), మెగాన్ స్కాట్(696) వరుసగా రెండు మూడు స్థానాల్లో నిలిచారు.

# షమి రాకతో టీమ్ఇండియా బలం పెరిగింది : గంగూలీ

మహ్మద్ షమి మళ్లీ భారత జెర్సీలో కనిపించబోతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత గాయం కారణంగా ఆటకు దూరమైన షమి కీలకమైన ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట పునరాగమనం చేయనున్నాడు. ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్, వన్డే సిరీస్తోపాటు తర్వాత జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి షమి ఎంపికయ్యాడు. షమి రీ ఎంట్రీ ఇస్తుండటంతో భారత మాజీ ఆటగాడు సౌరభ్ గంగూలీ సంతోషం వ్యక్తంచేశాడు. అతడి



రాకతో టీమ్ఇండియా బలం గణనీయంగా పెరిగిందన్నాడు. 'షమి ఫిట్ గా ఉన్నందుకు నేను సంతోషిస్తున్నాను. ఎందుకంటే అతను జస్ ప్రీత్ బుమ్రా తర్వాత దేశంలోనే అత్యుత్తమ బౌలర్ అని నేను భావిస్తున్నాను. షమి కాస్త భయాందోళనతో ఉంటాడని నాకు తెలుసు. ఎందుకంటే చాలాకాలం తర్వాత మోకాలి గాయం నుంచి కోలుకొని క్రికెట్ ఆడుతున్నాడు. కానీ, దేశవాళీ క్రికెట్ లో బెంగాల్ తరఫున ఆడటం అతడికి కలిసొచ్చే అంశం. ఆ అనుభవం రాబోయే మ్యాచ్ ల్లో షమికి ఉపయోగపడుతుంది. షమి రావడంతో బుమ్రాపై వర్క్ లోడ్ తగ్గుతుంది. ఇది జట్టు ప్రదర్శన మెరుగుపడటానికి ఉపకరిస్తుంది. బుమ్రా ఒక ఎండ్ నుంచి, షమి మరో ఎండ్ నుంచి బౌలింగ్ చేయడం భిన్నంగా ఉంటుంది. పరస్పర సహకారంతో ఇద్దరు టెస్టు క్రికెట్ లో సక్సెస్ అయ్యారు' అని గంగూలీ పేర్కొన్నాడు. ఇటీవల ముగిసిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత జట్టు పేస్ భారాన్ని శక్తికి మించి మోశాడు జస్ ప్రీత్ బుమ్రా. పని భారం ఎక్కువ కావడంతో అతను గాయం బారినపడ్డాడు. బుమ్రా ఫిట్ నెస్ గురించి ఆందోళన చెందుతున్నవేళ షమి అందుబాటులోకి రావడం టీమ్ఇండియాకు ఊరటనిచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో బుమ్రా కూడా ఉన్నాడు. ఫిట్ గా అంతకంటే ముందు ఇంగ్లాండ్ తో మూడో వన్డేలో ఆడతాడు. బుమ్రా, షమి ద్వయం రాణించి ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ను విజేతగా నిలపాలని అభిమానులు కోరుకుంటున్నారు.





# వైష్ణవి హ్యాట్రిక్.. మలేసియాపై భారత్ ఘన విజయం



అండర్-19 టీ20 ప్రపంచ కప్ లో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. వెస్టిండీస్ పై గెలిచి శుభారంభం చేసిన భారత్.. మంగళవారం మలేసియాతో జరిగిన రెండో మ్యాచ్ లోనూ ఘన విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు విజృంభించడంతో మలేసియా.. 14.3 ఓవర్లలో 31 పరుగులకే ఆలౌటైంది. ఇందులో 11 ఎక్స్ట్రాలు ఉండటం గమనార్హం. మలేసియా బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేదంటే మన బౌలర్ల జోరు ఎలా సాగిందో నూర్ అలియా హైరున్ (5), హుస్నా (5) పరుగులు చేశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 2.5 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (27నా; 12 బంతుల్లో 5 ఫోర్లు) మెరిసింది. కమలిని (4నా) పరుగులు చేసింది. భారత బౌలర్ వైష్ణవి శర్మ (5/5) సంచలన బౌలింగ్ తో ఆకట్టుకుంది. ఆమె తన చివరి ఓవర్లో నూర్ ఐన్ బింటి రోస్లాన్ (3), నూర్ ఇస్మా డానియా (0), సితి నజ్వా (0)ను పెవిలియన్ కు పంపి హ్యాట్రిక్ సాధించింది. ఆయుషి శుక్లా (3/8) అదరగొట్టింది. వైష్ణవి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచింది. భారత్ తదుపరి మ్యాచ్ లో (జనవరి 23) శ్రీలంకతో తలపడనుంది.

# సాత్విక్ జోడీ టైటిల్ కొట్టేనా?



భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి కొత్త ఏడాదిలో తొలి టైటిల్ పై గురిపెట్టారు. మంగళవారం ప్రారంభమయ్యే ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో ఈ జోడీ తన అదృష్టం పరీక్షించుకోనుంది. ఈ సీజన్ లో వరుసగా మలేసియా ఓపెన్ సూపర్ 1000, ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నీల్లో సెమీస్ చేరుకుని మంచి ఫామ్ లో ఉన్న సాత్విక్- చిరాగ్ జోడీ.. ఇండోనేసియా టైటిల్ సొంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతుంది. పురుషుల డబుల్స్ లో రే చెన్- యు లిన్ (చైనీస్ తైపీ) జంటతో సాత్విక్- చిరాగ్ జోడీ తమ పోరాటాన్ని ప్రారంభించనుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో లిన్ నుయెన్ (వియత్నాం)తో పి.వి.సింధు, నొజొమి ఒకుహర (జపాన్)తో ఆకర్షి కశ్యప్, జార్జియా మరిస్కా (ఇండోనేసియా)తో అనుపమ ఉపాధ్యాయ, తొమొక మియాజకి (జపాన్)తో రక్షితశ్రీ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో తకుమ ఒబయాషి (జపాన్)తో లక్ష్యసేన్, కొడయ్ నరవొక (జపాన్)తో ప్రియాన్షు రజావత్ పోటీపడనున్నారు. మహిళల డబుల్స్ లో ఓమ్నిచా- సుకిత (థాయ్లాండ్)తో అశ్విని పొన్నప్ప- తనీషా క్రాస్టో.. మిక్స్డ్ డబుల్స్లో గ్రెగరీ మేర్స్- జెనీ మేర్స్ (ఇంగ్లాండ్)తో రోహన్ కపూర్- రుత్విక శివాని, అద్నాన్ మౌలానా- ఇందా కహ్యా (ఇండోనేసియా)తో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో తమ పోరాటాన్ని ప్రారంభిస్తారు.

మనం మూవీ+ manammovie

## గుడ్ న్యూస్ షేర్ చేసిన కిరణ్ అబ్బవరం

మన టాలీవుడ్ లో ఉన్నటువంటి యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో కిరణ్ అబ్బవరం కూడా ఒకరు. మరి కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన క అనే చిత్రం సెన్సేషనల్ హిట్ అయ్యిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం హిట్ తర్వాత మరో సినిమా దిల్ రూబా అనే సినిమాతో రిలీజ్ కి రాబోతున్నాడు. ఓ పక్క ఈ సినిమా రిలీజ్ పనుల్లో బిజీగా ఉన్న నేపథ్యంలోనే ఓ గుడ్ న్యూస్ అయితే తాను షేర్ చేసాడు. తన భార్య రహస్య గోరక్ అబ్బవరంతో కలిసి ఓ బ్యూటిఫుల్ పిక్ తో తమ జీవితంలో కొత్త మెంబర్ ని ఆహ్వానిస్తున్నట్టుగా తెలిపారు. అయితే తన భార్య గర్భవతి అయినట్టుగా తన బేబీ బంప్ తో ఇద్దరూ కలిసి ఉన్న ఫోటో మంచి మూమెంట్ గా మారింది. దీనితో తమ పిక్ ఇపుడు వైరల్ గా మారింది. ఇక తన లేటెస్ట్ సినిమా దిల్ రూబా ఈ ఫిబ్రవరి 14న రిలీజ్ కి రాబోతుంది.



## చరణ్ 16 పై సాలిడ్ బజ్!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం గేమ్ ఛేంజర్ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం తర్వాత చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంపై కూడా భారీ హైప్ నెలకొనగా ఈ సినిమా షూటింగ్ సహా ఇతర అంశాలపై సాలిడ్ బజ్ తెలుస్తుంది. దీనితో ఈ సినిమా కొత్త షెడ్యూల్ ని ఈ జనవరి 27 నుంచి మొదలు పెట్టనున్నట్టుగా తెలుస్తుంది.



అలాగే షూటింగ్ ని మాత్రం పక్కా ప్లానింగ్ ప్రకారం కంప్లీట్ చెయ్యాలనే మేకర్స్ అనుకుంటున్నారట. దాదాపు ఈ ఏడాది జూలైకి పూర్తి చేసేస్తారని తెలుస్తుంది. అలాగే దాదాపు ఈ దసరా రేస్ లో లేదా డిసెంబర్ నెల లోనే రిలీజ్ చేసేస్తారని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

## దిల్ రాజు, మైత్రి మూవీ మేకర్స్ పై ఐటీ సోదాలు

మన టాలీవుడ్ దగ్గర ఉన్నటువంటి టాప్ మోస్ట్ స్టార్ నిర్మాతల్లో దిల్ రాజు అలాగే మైత్రి మూవీ మేకర్స్, నవీన్ యెర్నేని అలాగే యలమంచిలి రవి కూడా ఒకరని తెలిసిందే. మరి లేటెస్ట్ గా వీరి నిర్మాణంలో వచ్చిన సినిమాలు సంక్రాంతి కానుకగా రిలీజ్ వస్తే వాటిలో ఒకటి రికార్డ్ వసూళ్లు కూడా అందుకుంటుంది. అలాగే పుష్ప 2 అయితే ఇండియన్ ఇండస్ట్రీ రికార్డులు తిరగరాసింది. అయితే ఈ హ్యాపీ మూమెంట్ లో ఓ షాకింగ్ అండ్ బ్రేకింగ్ న్యూస్ ఇపుడు బయటకి వచ్చింది.
ఈ తెల్లవారు జామున హైదరాబాద్ లో దిల్ రాజు సహా తన సోదరుడు శిరీష్ అలాగే తన కూతురు హన్సిత సహా హైదరాబాద్ లో ఉన్నటువంటి దిల్ రాజు ఇల్లు, మ్యాంగో కార్యాలయాల్లో మొత్తం ఐటీ దాడులు చేస్తున్న వార్తలు బ్రేకింగ్ గా మారాయి. దీనితో పాటుగా మైత్రి నిర్మాతల కార్యాలయాలపై కూడా దాడులు జరిగినట్టుగా బయటకి వచ్చింది. వీటిలో మొత్తం 8 చోట్ల ఏకంగా 55 మంది బృందం ఈ రైడ్ నగరం వ్యాప్తంగా చేసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై మరింత సమాచారం బయటకు రావాల్సి ఉంది.



## హాలీవుడ్‌లోకి దిశ!

యువతరంలో మంచి క్రేజ్ ఉన్న బాలీవుడ్ నాయిక దిశా పటానీ. ఇటీవలే 'కంగువా'తో తమిళంలోకి అడుగుపెట్టి అందరి దృష్టినీ ఆకర్షించింది. భాషతో సంబంధం లేకుండా అవకాశాలను అందుకుంటున్న ఈ కథానాయిక.. ఇప్పుడు హాలీవుడ్ లో కూడా సత్తా చాటాడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. తాజాగా దిశ 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' నటుడు టైరీస్ గిబ్సన్ తో ఓ వెబ్ సిరీస్ కోసం జోడీ కట్టినట్లు సమాచారం. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న ఈ సిరీస్ సెట్స్ నుంచి కొన్ని ఫొటోలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. మెక్సికోలో షూటింగ్ చేసుకుంటున్న ఈ ప్రాజెక్టులో నటుడు హ్యారీ గుడ్విన్స్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు దిశ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి బాలీవుడ్ లో కుర్రకారుని ఉర్రూతలూగించే ఈమె.. ఇప్పుడు తన మొదటి హాలీవుడ్ ప్రాజెక్టుతో ఎలాంటి మాయ చేస్తోందో చూడాలి.



## మాస్ జాతర నుంచి సాలిడ్ ట్రీట్ రాబోతోందా!

మాస్ మహారాజ రవితేజ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కిస్తున్న సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రం మాస్ జాతర కూడా ఒకటి. తన హిట్ సినిమా ధమాకా బ్యూటీ శ్రీలీల మరోసారి మాస్ మహారాజ్ సరసన నటిస్తుంది. అయితే ఈ చిత్రం మళ్ళీ రవితేజ నుంచి ఒక వింటేజ్ ట్రీట్ ఇచ్చేలా ఉంటుంది అని మేకర్స్ చాలా కాన్ఫిడెంట్ గా ఉండగా ఇపుడు ఓ సాలిడ్ అప్డేట్ ఈ చిత్రంపై వినిపిస్తుంది. దీనితో ఈ రానున్న జనవరి 26 రవితేజ బర్త్ డే కానుకగా టీజర్ కట్ ని మేకర్స్ రిలీజ్ చేయబోతున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది. మరి దీనిపై అధికారిక క్లారిటీ కూడా త్వరలోనే రానున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఏ చిత్రానికి రవితేజ సినిమాతోనే పరిచయం అయ్యిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తుండగా ఈ మే 1న గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.



## ఆయన పై నాకు క్రష్ ఉండేది - మీనాక్షి

టాల్ బ్యూటీ మీనాక్షి చౌదరి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో సాలిడ్ హిట్ కొట్టింది. ఈ క్రమంలో మీనాక్షి రీసెంట్ గా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన క్రష్ ఎవరో చెప్పేసింది. మీనాక్షి మాట్లాడుతూ.. 'స్కూల్ టైంలో మా స్కూల్ టీచర్ అంటే నాకు క్రష్ ఉండేది. నిజానికి నా ఒక్కదానికే కాదు, మా స్కూల్ లో ఉండే అమ్మాయిలందరికీ అతనిపై క్రష్ ఉండేది. నేను కూడా ఆ వయసులో ఆయన్ని ఇష్టపడ్డాను. అతనే నా ఫస్ట్ క్రష్, ఆ తర్వాత ఎవరిపై ఆ ఫీలింగ్ కలగలేదు' అని మీనాక్షి చౌదరి చెప్పుకొచ్చింది. మీనాక్షి చౌదరి తన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా గురించి కూడా మాట్లాడుతూ.. 'జీవితంలో అందరికి ఎవరో ఒకరి మీద క్రష్ ఉంటుంది. మా సంక్రాంతికి వస్తున్నాం సినిమా కూడా అదే కథతో తెరకెక్కింది. ఈ సినిమా మంచి విజయం సాధించడం నాకు చాలా సంతోషంగా ఉంది' అంటూ మీనాక్షి చౌదరి చెప్పుకొచ్చింది. 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది మీనాక్షి. అడవి శేష్ నటించిన 'హిట్ 2' మీనాక్షికి మంచి గుర్తింపు తెచ్చింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.